సంపుటి : 78 సంచిక : 11 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు పుష్య శుద్ధ దశమి
29 డిసెంబర్ 2025 - 04 జనవరి 2026
వెల : ₹20/-





## కరోనా @ 6

### ఫలితాలు.. పాఠాలు..



## బాంగ్లా.. మైనారిటీల పాలిట బలిపీఠం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.







# మంచు ముసుగేసింది..

ఓ ఢిల్లీ నగరమా..
తెల్లని మబ్బులో మునిగి, రహస్యమైపోయావు!
దట్టమైన పొగమంచు నీ చుట్టూ చుట్టుకుని,
పరదా వలే కప్పి, నిన్ను దాచేసింది!
ఇండియా గేట్ నిలువెత్తు గర్వంతో నిలిచినా,
మంచు మాయలో అదృశ్యమై, కలలా అగుపిస్తోంది!
కర్తవ్య పథం మసక వెలుగుల్లో ముగ్గు పిండిని ధారగా పోసినట్టుంది.
రాదారుల పసుపు పచ్చని కాంతుల వాహనాలు
జీవన గమనానికి వెలుగుబాటలవుతున్నాయి!
శీతల స్పర్శలో, వెచ్చని చలి నెగళ్ల రుతుశోభలో..
ఈ మాయాజాలంలో ఓ అందం దాగి ఉంది!
ఓ ఢిల్లీ నగరమా,
నీ ఈ పొగమంచు కథ ఇంకా కొనసాగుతుంది..
వెలుగుల రేడు బయటపడే వరకు,
నీవు ఈ స్వప్నంలోనే మునిగి ఉండు!







# విమానాశ్రయంలో వనశోభ



గౌహతిలో లోకప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్తగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం భారతదేశంలోనే ప్రకృతి నేపథ్యంగా రూపొందిన మొదటి విమానాశ్రయ టెర్మినల్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ టెర్మినల్‌ను డిసెంబర్ 20న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. “బాంబూ ఆర్కిడ్స్” అనే థీమ్‌తో ఈ టెర్మినల్‌ను డిజైన్ చేశారు. అస్సాం రాష్ట్ర బయోడైవర్సిటీ, సాంస్కృతిక వారసత్వం నుంచి ప్రేరణ పొంది రూపొందించారు. దీని రూపకల్పనలో అస్సాం రాష్ట్ర పుష్పం కోపౌ ఫూల్, స్థానిక వెదురు జాతుల నుంచి స్ఫూర్తి పొందారు. ఈ టెర్మినల్ దాదాపు 1.4 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సంవత్సరానికి 1.3 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలను నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉంది. ఈ టెర్మినల్ కోసమని స్థానికంగా లభించే సుమారు 140 మెట్రిక్ టన్నుల వెదురును ఉపయోగించారు. కాజిరంగా నేషనల్ పార్క్‌ను పోలిన పచ్చిక బయళ్లు, ఏకశృంగ ఖడ్గమృగం చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అత్యంత ఆకర్షణీయమైనదిగా స్కై ఫారెస్ట్ నిలిచింది. ఇది దాదాపు ఒక లక్ష స్థానిక మొక్కలతో కూడిన ఇండోర్ ఫారెస్ట్ లాంటి అనుభవాన్ని ఇస్తుంది. విమానం దిగిన ప్రయాణికులకు వనంలోకి అడుగుపెట్టిన అనుభూతిని అందిస్తుంది.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**చు**ట్టూ ఉన్న ఏ ఒక్క దేశం భారత్‌తో సత్సంబంధాలు నెరిపే ఉద్దేశంలో లేదు. మన దేశం పట్ల వాటి వ్యతిరేకతను కాలం గడిచే కొద్దీ తీవ్రం చేస్తున్నాయి. బెంగాలీ మీద అనురక్తితో,ఉర్దూ మీద వ్యతిరేకతతో పంజాబ్ ప్రాంత పాకిస్తాన్ ఆధిపత్యం మీద తిరుగుబాటుతో ఏర్పడిన దేశం బాంగ్లాదేశ్. 1971 నాటి ఆ విమోచనోద్యమానికి భారత్ సహకరించిన వాస్తవం తిరుగులేనిది. దానికి భారత్‌కు వచ్చిన లబ్ధి ఏమిటో తెలియదు కాని, చాలా మూల్యం మాత్రం చెల్లించుకుంటున్నది. ఆ సంక్షోభ సమయంలో వచ్చిన పదిలక్షల మంది శరణార్థులను ఆదుకున్నది. ఎందుకంటే విమోచనోద్యమంలో, సోనార్ బాంగ్లా నినాదంలో సెక్యులర్ ధోరణి ఉన్నది. సోనార్ బాంగ్లా పేరుతో మొదలైన ఉద్యమాన్ని అణచివేసే క్రమంలో పాకిస్తాన్ సేనలు చేసిన అఘాయిత్యాలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. మొత్తానికి తూర్పు బెంగాల్ బాంగ్లాదేశ్ అనే స్వతంత్ర దేశంగా అవతరించింది. కానీ ఇప్పుడు బాంగ్లాదేశ్ అదంతా విస్మరించింది. బాంగ్లా నాయకులు తమ మనుగడ కోసం భారత్ పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు. పాకిస్తాన్ నిర్వాకం కూడా సరిగ్గా ఇదే. పాకిస్తాన్ లేదా బాంగ్లాదేశ్ పాలకులకు రాజకీయ మనుగడ భారత్ మీద కత్తులు నూరడంలోనే కనిపిస్తున్నది. తమకు స్వాతంత్ర్యం తెచ్చి పెట్టడానికి రక్తం ధారపోసిన పొరుగు దేశం పట్ల బాంగ్లాదేశ్ ప్రదర్శిస్తున్న కృతఘ్నత క్షమించరానిది.

2024లో జెన్‌జీ ఉద్యమం పేరుతో ఆవామీ లీగ్ నాయకురాలు షేక్ హసీనాను దేశం నుంచి తరిమేశారు. దానికి కొనసాగింపు, సదరు జెన్‌జీ ఉద్యమంలోని వైకల్యాలు 2025 డిసెంబర్ నాటి అరాచకత్వానికి బాటలు వేశాయి. 2024 అల్లర్లలో కీలకంగా వ్యవహరించిన ఉస్మాన్ హాది అనే యువనేతను గుర్తు తెలియని వ్యక్తులు ఈ డిసెంబర్‌లో హత్య చేశారు. మరొక విద్యార్థి నేత షిక్దర్ మీద కూడా కాల్పులు జరిగాయి. మళ్లీ దేశమంతా అగ్ని రాజుకుంది. తాత్కాలిక పాలకుడు మహమ్మద్ యూనుస్ ఎన్నికలు నిర్వహించి "ప్రజాస్వామ్య పునరుద్ధరణ" ప్రక్రియకు ప్రాణం పోయాలని అనుకున్నారట. అందుకు వచ్చే ఫిబ్రవరిలో ముహూర్తం కూడా పెట్టారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతుందని చెప్పడం అత్యాశ. నిజానికి యూనుస్‌కు కావలసినది ఇదేనేమో కూడా.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు పుష్య శుద్ధ దశమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**కరోనా @ 6**

ఫలితాలు.. పాఠాలు..

ధారావాహిక నవల

(16) **గణపతిదేవుడు**

– మత్తి భానుమూర్తి



20లో

ఆర్థికం

**ఉద్యోగుల కంటే పెన్షనర్‌లే ఎక్కువ**



26లో

# జాగృతి


## సంపాదకీయం

బాంగ్లాలోని హిందువులను హింసించి లేదా కొట్టి చంపడం నిరంతర ప్రక్రియగా మారింది. బంగబంధుగా కీర్తి సాధించిన బాంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబూర్ రహమాన్ దేశం ఏర్పడిన మూడేళ్లకే హత్యకు గురయ్యారు. కాబట్టి సెక్యులరిజం అన్నమాటకు ఇక్కడ విలువ ఉండదు అని ఆ హత్యతో దుష్టశక్తులు వెల్లడించినట్టయింది. అక్కడ ఏం జరిగినా, ఎలాంటి సంక్షోభం తలెత్తినా విధ్వంసకారుల చూపు హిందువుల మీదే ఉంటుందని చాలాసార్లు రుజువైంది. ఏటా దసరాకి అమ్మవారి పందిళ్లకు నిప్పు పెట్టడం, అపవిత్రం చేయడం యథేచ్ఛగా సాగిపోతున్నదే. నిన్న మొన్న జరిగిన దీపూచంద్ర దాస్

# ప్రాణాంతక క్రీడ

దారుణహత్య ఇందులో భాగమే. ఇంతకు మించిన అకృత్యాలకే బాంగ్లాదేశ్ పాల్పడిన మాట ఇక్కడ గుర్తు చేసుకోవాలి. 1992లో అయోధ్యలో వివాదాస్పద కట్టడం కూలినప్పుడు బాంగ్లా స్పందన విధ్వంసకరంగానే ఉంది. ఎన్నో హిందూ దేవాలయాలు కూలాయి. మైనారిటీల పట్ల ఆనాడు సాగిన ఈ పోకడను ప్రశ్నించిన రచయిత్రి తస్లీమా నస్రీన్ ఈ రోజుకీ ఆ దేశంలోకి తిరిగి అడుగు పెట్టలేకపోతున్నారు. ఏప్రిల్ 21,2001లో ఒకరూ ఇద్దరూ కాదు, 16 మంది భారత సరిహద్దు భద్రతాదళ సభ్యులను బాంగ్లా సరిహద్దులోని బోరాయిబరి అనే చోట అతి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాలను అప్పగించారు. ఎంత రాక్షసమంటే, ఆ మృతదేహాల అవయవాలు ఛిద్రమై కనిపించాయి. ఆనాడు ఇది భారతజాతిని కలచివేసింది. ముజిబూర్ కుమార్తె బాంగ్లాను చిరకాలం పాలించారు. ఇప్పుడు భారత్‌లో తలదాచుకుంటున్నారు. నానాటికీ పాకిస్తాన్ ప్రభావం ముదరడం, అవే పోకడలు రాజ్యమేలడం ఇప్పుడు బాంగ్లాదేశ్‌లో కనిపిస్తున్న వాస్తవ దృశ్యం. పాకిస్తాన్‌లో జరుగుతున్నదీ ఇదే. హిందూ బాలికలను అపహరించడం, మతం మార్చి బలవంతంగా పెళ్లిళ్లు చేసుకోవడం ఇప్పుడు ఆ రెండు ముస్లిం దేశాలలోను సాధారణ దృశ్యం. బాంగ్లా ఏర్పాటు ఉద్యమానికి ఊపిరులూదినదే బెంగాలీ భాషాభిమానం. కానీ ఇప్పుడు బాంగ్లాదేశ్‌లో ఉర్దూ ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు. ఇదొక్కటే కాదు, చాలా అంశాలలో పాకిస్తాన్‌ను బాంగ్లాదేశ్ ఆదర్శంగా తీసుకున్నట్టే ఉంది. 1971లో పాక్ సైన్యం ఊచకోత నుంచి, లైంగిక అత్యాచారాల నుంచి బాంగ్లా ప్రజానీకాన్ని రక్షించడానికి భారత్ సరిహద్దులను బార్లా తెరిచింది. ఇప్పుడు పాకిస్తాన్ రాకకు బాంగ్లాదేశ్ తలుపు తెరిచింది. తాజా అల్లర్ల వెనుక ఉన్నది కూడా పాకిస్తాన్ అన్నమాట లేకపోలేదు. పాకిస్తాన్‌ను ముస్లిం మతోన్మాద సంస్థలు, సైన్యం, ఐఎస్ఐ శాసిస్తున్నాయి. బాంగ్లా కూడా ఇదే ధోరణిని తెచ్చి పెట్టుకోవడం వింత. అక్కడ కూడా ఐఎస్ఐ ప్రభావం ప్రబలంగా ఉందనే విశ్లేషకులు చెబుతున్నారు. తాత్కాలిక ప్రభుత్వ అధినేత యూనుస్ ఐఎస్ఐ, బాంగ్లా సైన్యం నడిపించినట్టే నడుస్తున్నారన్న అభిప్రాయం బలంగానే ఉంది.

మాతృభాష, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం నినాదాలతో ఉద్యమించి ఆవిర్భవించిన బాంగ్లాదేశ్ నేడు పూర్తిగా మతోన్మాదానికీ, ఇస్లామిక్ రాజ్య స్థాపనకీ కట్టుబడిన మూకల చేతులలో బందీ అయింది. ఇందుకు వర్తమాన యువతరం కూడా వంత పాడుతున్నది. దురదృష్టవశాత్తు వీళ్లు లేవనెత్తిన రగడనే జెన్‌జీ ఉద్యమమంటూ ఆకాశానికెత్తారు. అలాంటిదే భారత్‌లోనూ రావాలని కొందరు ఉదారవాదులు ఉవ్విళ్లూరారు. నాడు జెన్‌జీ ప్రతినిధిగా కనిపించిన ఉస్మాన్ హాది ముస్లిం మత సంస్థల చేతిలోని కీలుబొమ్మగా తేలాడు. అటువైపు పొరుగు అణ్వాయుధాలు ఉన్నాయంటూ హుంకరిస్తున్నది. ఇటువైపు పొరుగు ఈశాన్య రాష్ట్రాలను కబళిస్తానని బెదిరిస్తున్నది. భారత్‌లోని కొందరు మైనారిటీలు, కొన్ని రాజకీయ పక్షాలు ఆ ఇరుగుపొరుగును సమర్థించడమే అసలు సమస్య. ★


29 డిసెంబర్ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




38లో

కథ

**హద్దులు**

– మహ్మద్ షరీఫ్

పరిహాసం





| | | |
|---|---|---|
| తిరగబడిన చరిత్రకు నిదర్శనమే.. (విజయం) | - | 11 |
| బుజ్జగింపుల దాడిలో వందేమాతర గేయం! (జాతీయం) | - | 12 |
| భారత్, రష్యా భాయి భాయి! (అంతర్జాతీయం) | - | 14 |
| వణికించే చలి… వాడివేడి వాదోపవాదాలు (తెలంగాణ) | - | 16 |
| వైద్యరంగ పటిష్టతకు పీపీపీ విధానం (ఆంధ్రప్రదేశ్) | - | 18 |
| మానవతా వనిత (మహిళ) | - | 24 |
| బాంగ్లా.. మైనారిటీల పాలిట బలిపీఠం (అమానుషం) | - | 30 |
| తరం మార్పునకు సంకేతం నితిన్ నబీన్ (జాతీయం-1) | - | 34 |
| పర్యావరణానికి పంచ పరివర్తనలు కీలకం (ఆర్ఎస్ఎస్-100) | - | 36 |
| ముక్తిమార్గం ఉత్తర ద్వార దర్శనం (ప్రత్యేక వ్యాసం) | - | 41 |
| 2025లో అరుదైన విజయాల క్రీడా 'భారతం'! (క్రీడ) | - | 43 |
| భావోద్వేగాలతో సాగే 'అవతార్ : ఫైర్ అండ్ యాష్' (సినిమా) | - | 50 |

భూగోళం మీద ప్రతి దేశాన్ని మృత్యుభయంతో నింపినదే కొవిడ్ 19. ఒక చిన్న క్రిమితో ప్రపంచదేశాలన్నీ యుద్ధం చేశాయి. ఆదిలో ఔషధమనే ఆయుధం లేకుండా వైద్యులు యుద్ధం చేశారు. ప్రపంచమంతా రణరంగమైంది. మనుషులు పిట్టల్లా రాలిపోవడం అంటే ఏమిటో చరిత్ర చూసింది. కరోనా మృతుల ముందు రాలిన కన్నీటి చుక్కలకీ వైరస్ అంటుకుంటుందేమోనన్నంత వెరపు. కార్యాలయాలు, కర్మాగారాలు, పాఠశాలలు, మైదానాలు బూజుపట్టాయి. ప్రపంచంలో చాలా చోట్ల వినిపించిన మంత్రం–లాక్‌డౌన్. చేతులు కడుక్కోవడమూ, శానిటైజర్ పూసుకోవడమూ ఇదే అందుబాటులోని మందయింది. కషాయాలూ, ఆయుర్వేద గుళికలు ప్రాణదాతలయ్యాయి. తరువాత పీపీఈ కిట్లు, ఆపై వ్యాక్సిన్‌ల వెనుక దాక్కొంది లోకం. మొత్తానికి ప్రకృతి ప్రకోపిస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమని రుజువు చేసి వెళ్లింది కరోనా. ఇదంతా ఆరేళ్ల క్రితం. కరోనా ఏం నేర్పింది? మనం ఏం నేర్చుకున్నాం?

కరోనా నుంచి మనిషి నేర్చుకుని తీరాలి. ప్రపంచంలో దాదాపు 71 కోట్ల మందికి వైరస్ సోకింది. 71 లక్షల మంది చనిపోయారు. అరవై కోట్ల మందిపైగా కోలుకున్నారు. ఎలాంటి ఔషధం లేదని కరోనా పుట్టిన తరువాత తెలిసింది. కొత్త వ్యాక్సిన్ కోసం అన్వేషణ సాగుతుండగానే అన్ని లక్షల మంది కన్ను మూశారు. నమోదు కాని మరణాలు ఎన్నో ఉండవచ్చు.

కొవిడ్ 19 మహమ్మారి లేదా కరోనా వైరస్ తొలి కేసులు అధికారికంగా డిసెంబర్ 31, 2019న చైనాలో నమోదయ్యాయి. కానీ నవంబర్‌లోనే అక్కడ ఈ వైరస్ లక్షణాలు ఉన్నవారు కొద్దిమంది ఆసుపత్రులలో చేరారు. ఆ డిసెంబర్‌లోనే చైనాలోని వూహాన్ పట్టణంలో ఉండే శాస్త్రవేత్త లీవెన్‌లియాంగ్ ఒక చర్చా కార్యక్రమంలో కొందరు ఒకే వ్యాధి లక్షణాలతో ఆసుపత్రులలో చేరారని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చైనాలోని వూహాన్‌లో కొన్ని న్యూమోనియా కేసులు నమోదైనట్టు ప్రకటించినప్పటికీ జనవరి 7, 2020న చైనా అధికారులు వాటికి కరోనా వైరస్ కేసులని పేరు పెట్టారు. ఇది జరిగిన కొన్ని వారాలకే కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని శరవేగంతో ఆక్రమిస్తున్నదని ఆ జనవరి 30న ప్రపంచ ఆరోగ్య సంస్థ పిడుగు వంటి వార్తను ప్రపంచం మీద విసిరింది. ఇది జరిగిన కొన్ని వారాలకు మాత్రమే అంటే ఫిబ్రవరి 11, 2020న ఆ అంటువ్యాధికి కొవిడ్ 19 (అసలు పేరు సార్స్–సీఒవి–2 కరోనా వైరస్) అని పేరు పెట్టారు. ఇది చైనాలో పుట్టినప్పటికీ తొమ్మిది రోజుల తరువాత ఫిబ్రవరి 20న అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) తమ దేశంలో కొవిడ్ 19తో ఒక వ్యక్తి మరణించినట్టు ప్రకటించింది. యాభయ్యో పడిలోని ఆ వ్యక్తి వాషింగ్టన్‌కు చెందినవాడు.

కొవిడ్ పేరు వినపడింది గాని, అది ఎలా విస్తరిస్తుంది, జనజీవనాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది అన్న విషయాల మీద ప్రపంచ దేశాలకు, ఆరోగ్య సంస్థలకు అవగాహన లేదు. కొవిడ్ 19ను ఎదుర్కొనే చర్యల కోసం మార్చి 1,2020న ఐక్య రాజ్య సమితి 15 మిలియన్ అమెరికన్ డాలర్లు విడుదల చేసింది. ఇది జరిగిన ఒక్క వారానికే అంటే మార్చి 7 నాటికే కేసుల సంఖ్య లక్షకు చేరింది. మార్చి 11న కొవిడ్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ మహమ్మారి (అంటే ప్రపంచాన్ని చుట్టబెట్టే అంటువ్యాధి)గా ప్రకటించారు. ఇటలీలో మార్చి 12–13 మధ్య



# కరోనా ఫలితాలు..

కూర్చుని ఆలోచిస్తే, ఆవేదన తన్నుకొస్తుంది.

జీవితంలో ఇన్ని రోజులు ఇంట్లో కూర్చున్నది లేదు. ఆలోచనలను కమ్మేస్తున్న ఆవేశం. అనగనగా అని అనడానికి అంత పాత విషయాలు కావు. అలాగని నిన్న గాక మొన్న అనడానికి అంత దగ్గర విషయాలూ కావు.

మనిషి ప్రతి చిన్న కదలికకు తాళం బిగించిన దృశ్యం మొదటిసారి కనిపించింది. కరోనా అనే చిన్న అణువు, ప్రపంచం మీద ఏకకాలంలో ఎర్ర జెండా ఎగరేసింది.

మనిషి ఎంతటి శక్తిమంతుడో, తెలివైనవాడో అని పొగుడుకుంటూ వస్తున్నా, ఒక్కసారిగా 'లాక్‌డౌన్' అనే పదం అతని దర్పాన్ని చెదరగొట్టింది. విమానాలు ఆగిపోయాయి, రైళ్లు స్తంభించాయి, బస్సులు బంద య్యాయి. అసలు కదిలితే కదా! వాహనాల చప్పుడు దాదాపు లేకుండా నిశ్శబ్ద చిత్ర దృశ్యాలు రాజ్యమేలాయి.

నేను పదవ తరగతిలో ఉండగా, నా భాగ్యనగరం ఎంతో బాగుండేది. నేను మాట్లాడుతున్నది 1981 సంవత్సరం, హైదరాబాద్ గురించి. ఇంతా చేస్తే, గట్టిగా నలభై సంవత్సరాల వెనుకటి మాట. బడికి ఎప్పుడూ త్రాగునీరు వెంట తీసుకెళ్లడం తెలియదు. నల్లాలలోనూ స్వచ్ఛమైన నీరు త్రాగిన రోజులవి.

గతాన్ని తలచుకుంటే, నలభై ఏళ్ల క్రితం జీవితం ఎంత సాదా సీదాగా ఉండేదో గుర్తుకొస్తోంది. పచ్చని వాతావరణం, ప్రకృతిలో అన్నీ సహజంగా లభించేవి. పిల్లల ఆటలూ సహజసిద్ధమైనవే–గిల్లి దండా, కిత కిత, బంతిపోటు, అడ్డాంగోళి లాంటి ఆటలు ఆడుతూ మనం పెరిగాం. కానీ క్రమంగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది, కాలుష్యం పెరిగింది, సంబంధాలు క్షీణించాయి, చివరికి కరోనా లాంటి మహమ్మారి మనపై దాడి చేసింది.

రోడ్లమీద అతి కొద్ది మందే ఉండడంతో, ఒంటరిగా నడవాలంటే భయం, సాయంత్రం ఏడు గంటలకే చాలా ఆలస్యమైందని భయపడేవాళ్లం. జనాభా అదుపులో ఉన్న రోజులు. పెద్దగా జాతి మత భేదాల గురించి అంతగా తెలీని రోజులవి. హిందువు అంటే గౌరవం, క్రిస్టియన్స్ అంటే అభిమానం, ముస్లిమ్ లంటే సోదరులని చిత్తశుద్ధితో నమ్మిన రోజులవి. భారతీయులకి అందరినీ గౌరవించడం వెన్నతో పెట్టిన విద్య. అన్ని భాషల వారినీ ఆప్యాయంగా చూసేవాళ్లం.

స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం అంటే మహా ప్రాణం.

దేవుడంటే భయభక్తులు, పురాణాలంటే నీతి కథలు, గురువంటే అపర సరస్వతి, గూగులే. ఇంకా,

ఒక్కసారిగా 250 మంది ఈ వ్యాధి బారిన పడి మరణించారు. అదే రోజు అమెరికా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.

మనుషుల మధ్య దూరం ఉండాలన్నారు. చేతులు కడుక్కోమన్నారు. అయితే ఇవి వైరస్ వ్యాప్తిని కాస్త తగ్గించగలవు. ఈ మహా విపత్తును అధిగమించాలంటే వ్యాక్సిన్‌తోనే సాధ్యమని శాస్త్రవేత్తలకు వెంటనే అర్థమయింది.మార్చి 17,2020న వ్యాక్సిన్‌ను కనుగొనే క్రమంలో తొలి ప్రయోగం జరిగింది. దాని పేరు మోడెర్నా ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్. మనుషుల మధ్య దూరం, లేదా చేతులు తరచు కడుక్కోవడంతోనే మహమ్మారిని నివారించలేమని అర్థం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. ప్రజలెవరూ ఇల్లు వీడి రావొద్దని మార్చి 26న యూకే ప్రకటించింది.అదే సమయంలో పలు ఐరోపా దేశాలు తమ అనుకూలతలను బట్టి లాక్‌డౌన్‌లు ప్రవేశపెట్టాయి. ఏప్రిల్ 2, 2020కి కొవిడ్ కేసులు ప్రపంచ వ్యాప్తంగా పది లక్షలకు చేరాయి. దీనితోనే ప్రపంచంలో వణుకు మొదలైంది. వ్యాక్సిన్ వచ్చే లోగా తాము ఏం చేయవచ్చునో అన్ని ఆయా దేశాల ప్రభుత్వాలు ప్రారంభించాయి.అప్పుడే ఏప్రిల్ 6న ప్రపంచ ఆరోగ్య సంస్థ మాస్క్ ధారణను ప్రవేశ పెట్టింది. తీసుకున్న జాగ్రత్తలతో ఆ వేసవిలో మహమ్మారి కాస్త శాంతించినట్టే కనిపించింది. ఆసుపత్రులకు వచ్చే కేసులు తగ్గాయి. కానీ వర్షాకాలం ఆరంభంలో అంటే ఆగస్ట్‌లో లాంబ్డా వేరియంట్ రంగ ప్రవేశం చేసింది. దీనిని మొదట పెరూ దేశంలో కనుగొన్నారు. అప్పటికే అది 29 దేశాలకు వ్యాపించినట్టు కనుగొన్నారు.

సెప్టెంబర్‌లో ఇంగ్లండ్‌లో అల్ఫా వేరియంట్ బయటపడింది. మళ్లీ కేసులు విజృంభించాయి. సెప్టెంబర్ 29 నాటికి పది లక్షల మంది రాలిపోయారు.

వ్యాక్సిన్‌ల పరిశోధన పని చాలా ప్రగతి సాధించింది. నవంబర్ 9 నాటికి ఫైజర్, బయోఎన్‌టెక్ వ్యాక్సిన్లు 90 శాతం ప్రభావవంతమైనవని రుజువైంది. మోడర్నా కూడా ప్రభావవంతమైనదని తరువాత వెల్లడైంది. నవంబర్ 23న యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ రూపొందించిన ఆస్ట్రాజెనికా కొవిడ్ 19 వ్యాక్సిన్ కూడా ప్రభావవంతమైనదని తెలిసింది.

ఆ డిసెంబర్‌లోనే భారత్‌కు ప్రత్యేకంగా పిడుగులాంటి వార్త వినిపించింది. డెల్టా వేరియంట్ పేరుతో కొత్త వైరస్ భారత్‌లోనే బయటపడింది. విస్తరించడంలో ఈ వేరియంట్‌కు ఉన్న వేగాన్ని బట్టి చాలా దేశాలు మరొకసారి లాక్‌డౌన్‌ను ఆశ్రయించవలసి వచ్చింది.

డిసెంబర్ 31, 2020న ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర వినియోగం కోసం ఫైజర్, బయోఎన్‌టెక్ వ్యాక్సిన్లను అందుబాటులోకి తెచ్చింది. ఆ విధంగా కొవిడ్ 19 వాక్సిన్ ఇక అందరికి అందుబాటులోకి వస్తుందన్న భరోసా వచ్చింది. ఏప్రిల్ 27, 2021 నాటికి ఒక బిలియన్ డోసులు అందచేశారు.

భారత్‌లో తొలి కరోనా కేసు జనవరి 30, 2020న కేరళలోని త్రిశ్చూర్‌లో నమోదయింది. వూహాన్‌లో వైద్యశాస్త్రం చదువుతున్న ముగ్గురు భారతీయ విద్యార్థులు అక్కడ నుంచి తెచ్చారు. కేరళలో మొదటిగా లాక్‌డౌన్‌ను మార్చి 23 ప్రకటించారు. దేశమంతటా మార్చి 25 నుంచి అమలులోకి వచ్చింది. ప్రపంచంలోనే అత్యధికంగా కేసులు నమోదైన రెండవ దేశం (అమెరికా తరువాత) భారత్. ఇక్కడ 45,056,126 కేసులు అధికారికంగా నమోదైనాయి. 5,33,847 మృతుల సంఖ్యతో అమెరికా, బ్రెజిల్ దేశాల తరువాత కరోనా మరణాలలో భారత్ మూడవ స్థానంలో ఉన్నది. రెండో వేవ్ మార్చి 2021న మొదలయింది. ఏప్రిల్ 30, 2021వ తేదీ భారత్‌ను గడగడలాడించింది. ఆ ఒక్కరోజే (24 గంటలలో) నాలుగు లక్షల కేసులు నమోదయ్యాయి. భారత్‌లో జనవరి 16,2021 నుంచి వ్యాక్సినేషన్ మొదలయింది. ఆస్ట్రాజెనికా (కోవిషీల్డ్), దేశీయంగా తయారైన కోవాక్సిన్ ఇక్కడ ఇచ్చారు. జనవరి 30, 2022 నాటికి దేశంలో డెబ్బయ్ కోట్ల మందికి పైగా వ్యాక్సిన్ ఇచ్చినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

ఆరేళ్ల తరువాత ఆ రోజులను ఒక్కసారి మనసుతో మళ్లీ అంచనా వేద్దాం.

# రా @ 6

# పాఠాలు..



ఆనాడు, ఎవ్వరి దగ్గరా ఫోన్లు పెద్దగా ఉండేవి కాదు. కొద్ది మంది ఇళ్లల్లో ఉండేవి. పాల పాకెట్స్ అప్పుడే మొదలయ్యి, ప్లాస్టిక్ ప్రపంచంలోకి విజృంభిస్తున్న రోజులవి.

అలాగే ఫ్రిడ్జి, టీవీ, ఏసీ ఇలాంటివన్నీ కొంత మంది ఇళ్లల్లోనే ఉండేవి. దూరదర్శన్ చానల్ అంటే ఎంతో మమకారం, ప్రైవేట్ ఛానెల్స్ లేవు. రేడియో అంటే ఎంతో అభిమానం.

ఇంటికి ఒక్కరైనా అమెరికాలో స్థిరపడ్డ రోజులు అప్పుడే మొదలయ్యాయి.

చాలా మటుకు ఇండిపెండెంట్ ఇళ్లు, అతి కొద్దిగా ఫ్లాట్ సిస్టమ్, అదికూడా ముచ్చటగా మూడు ఫ్లోర్లు.

మున్సిపల్ నీరు, ఓవరహెడ్ టాంక్ లోకి అవే పంపయ్యేవి. ఎక్కడో మోటర్ సిస్టమ్ కూడా అరుదుగా చూసేవాళ్లం.

పిచ్చుకలు ఫ్యాన్ కప్పులలో గూళ్లు కట్టుకునేవి.

మధ్యాహ్నం అందరూ పోస్టుమాన్ కోసం ఎదురు చూసేవారు.

అతి కొద్ది కార్లు, ఒక మోస్తరుగా బజాజ్ చేతక్ స్కూటర్లు, ద్విచక్ర వాహనాలు, చాలా మటుకు సైకిల్స్ ఉండేవి.

హోటళ్లు, మాల్స్, పెద్ద పెద్ద సూపర్ మార్కెట్స్, ఫంక్షన్ హాల్స్ కూడా తక్కువే. రోడ్డుప్రక్క తిను బండారాలు అంటేనే చులకనగా చూసే రోజులవి. బ్యూటి పార్లర్స్, అప్పుడప్పుడే మొదలైన రోజులు. బొటీక్ అన్నపదం చాలామందికి తెలియదు.

పాశ్చాత్య అనుకరణ అప్పుడే మొదలయ్యిందని చెప్పవచ్చు.

మరి ఇన్ని విషయాలలో ప్రపంచం ఇంత త్వరగా మారిపోయింది. అంటే నలభై ఏళ్ల క్రితం లేని జనాభా సమస్య, నీటి కొరత, టెలిఫోన్స్ ఇంకా కమ్యూనికేషన్ అభివృద్ధి, వాహనాలు, సబ్ వేస్, రెస్టోరెంట్స్, మాల్స్, మెట్రో ఫ్లయ్ఓవర్స్, కార్పొరేట్ స్కూళ్ళు, ఆసు పత్రులు, ఆన్ లైన్ షాపింగ్, జొమాటో, స్విగ్గీ, బ్లింక్ ఇట్ ఇంకా ఎన్నెన్నో.

ఇన్ని మార్పులు గట్టిగా నలభై ఏళ్లక్రితం నుంచి జరిగినవే కదా! వీటి వెనుక ఉద్దేశం, మనిషి సంతోషంగా జీవించాలనే కదా!

మరి మన అభివృద్ధిని తారుమారు చేసి, కనీ వినీ ఎరుగని రోగాలకు గురి అవుతున్నాం. చిత్ర విచిత్ర రోగాలతో, సతమత మయిపోయాము కానీ, కరోనాలాంటి భయంకరమైన పరిస్థితి మొదటిసారి ఎదుర్కొన్నాం. అదికూడా ప్రపంచం మొత్తాన్ని ఏకంచేసి, క్రుంగదీసి ప్రతీ మనిషినీ ఏకాకిని చేసేసింది.

కానీ... కరోనా నేర్పిన పాఠాలు ఎన్నెన్నో,

ఆరోగ్యం కన్నా గొప్ప సంపద లేదని తెలుసు కున్నాం. డబ్బు ఉన్నా, వైద్యం లభించని పరిస్థితులు చాలామంది ఎదుర్కొన్నారు. ఇంటివాళ్లతో గడిపే సమయం, అంతకు ముందు బిజీ జీవితంలో కుటుంబం మర్చిపోయాం. కరోనా ఆ పోకడని ఆపి, మనల్ని మళ్లీ కలిపింది.

మనిషి సహజంగా కలిసిమెలిసి జీవించేవాడు, కానీ ఈ వైరస్ మనల్ని దూరంగా నెట్టేసింది.

స్వచ్ఛత, చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, శుభ్రతపై శ్రద్ధ పెట్టడం మన సంస్కృతిలో ఒక కొత్త అలవాటు అయిపోయింది.

సహజ వనరుల విలువ, లాక్‌డౌన్ సమయంలో పక్షుల కిలకిలరావాలు, ఆకాశం నీలిరంగు, నదులు స్వచ్ఛంగా ప్రవహించడం అందరం గమనించాం. మనిషి కాళ్ల ముద్రలు తగ్గగానే ప్రకృతి ఎలా పునరుద్ధరించుకుందో చూశాం.

కరోనా ఒక రోగం మాత్రమే కాదు. అది ఒక సామాజిక విప్లవం. పెళ్లిళ్లు, వేడుకలు సాదాసీదాగా జరిగాయి. దూరపు బంధువులు వీడియో కాల్స్‌లోనే పాల్గొన్నారు. పాఠశాలలు మూతపడి, ఆన్‌లైన్ విద్య ప్రారంభమైంది.

కార్యాలయాలు ఖాళీగా మారి, వర్క్ ఫ్రమ్ హోమ్ సాధారణమైంది. పెద్ద పెద్ద ఉద్యోగ, వ్యాపార స్థలాలు జనాలు లేక, వెల వెలలాడిపోయాయి.

అంతేకాదు, ఆ సమయంలో వలస కార్మికుల కష్టాలు, ఆకలి బాధలు మనసును కలచివేశాయి. నడిచి వందల కిలోమీటర్లు వెళ్లిన వారి దుఃఖగాథలు చరిత్రలో నిలిచిపోయాయి. కమ్యూనికేషన్, ఫోన్లు మన చేతిలోకి వచ్చి అన్నీ తెలుసుకుని బాధ పడే పరిస్థితి నుండి ఎవ్వరం తప్పించుకోలేక పోయాం.

గత నలభై ఏళ్ల క్రితం నుండీ మనిషి చేసిన కాలుష్యం, జీవజంతువులపై, భూమిపై, వాతా వరణంపై ఎంత తీవ్రమైన ప్రభావం చూపిందో తలచుకుంటే ఎంత, శోచనీయ విషయమో కదా!!

ప్రపంచంలో జరిగిన వాతావరణ కాలుష్యం, మనిషి విచ్చలవిడితనం, ఇంకా భయంకరమైన మార్పులతో భూమాతకు భారం అయిపోయామా!!

భూమి మీది ప్రతీ మనిషీ, వల వలా కన్నీరు కార్చి, తమ పాప ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన తరుణమిది కాదా మరి!

ఇన్ని రకాల సమస్యలు జనాభా అదుపు తప్పడం వల్లే కదా!

నిజంగా, మనం జనాభాని అదుపులో ఉంచు కుంటే, ఈరోజు కరోన మనలని ఇంత భయపెట్టేది కాదేమో! ఎంతమంది వారి కన్నవారిని, కన్నపిల్లలని, తోబుట్టువులని, బంధుబలగాన్ని, ఆత్మ బంధువులను కోల్పోయామో!

ఇంకా మనం, కలియుగం ప్రథమ పాదంలోనే ఉన్నాం. నాకు తెలిసిన గత ఇన్ని సంవత్సరాలలోనే ఇంత వినాశనం జరిగితే, మరి మరో నలభై సంవత్స రాలకి ప్రపంచం ఎటు పోతుందో ఊహించు కోటానికే సాధ్యం కాదు.

ఈనాడు అన్ని సదుపాయాలు, సంతోషకరమైన వాతావరణం కోసం, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, యాహూ, గూగుల్, ఇంకా ఎన్నెన్నో, కానీ ప్రేమలు లేని పలుకరింపులు, సంబంధం లేని బంధాలు, నటీనటులను మించిన నటనలు, ఎదిగేమా, నేలకి ఒరిగామా, ఆలోచించాలి మరి!

పిల్లల గురించి చెప్పుకుంటే, కరోనా కాలంలో వారంతా ఇంటికే పరిమితమయ్యారు. ఆడుకోవడం, స్నేహితులతో కలవడం, పాఠశాలలో గడిపే ఆ అనుభవం మొత్తం లేకపోవడం వల్ల వారి బాల్యానికి గణనీయమైన లోటు ఏర్పడింది. శారీరక చలనం తగ్గిపోవడం, మొబైల్ ఫోన్లు, టెలివిజన్, ఆన్‌లైన్ తరగతులకే పరిమితమవ్వడం వల్ల మానసిక ఒత్తిడి, ఆందోళన, అధికంగా ఆధారపడే స్వభావం పెరిగింది. ఆటపాటలతో కూడిన సహజ వాతా వరణం దూరమై, వారిలో సామాజిక నైపుణ్యాలు ఎంతో దెబ్బతిన్నాయి.

ఒక విధంగా చూస్తే మనల్ని మనం ప్రశ్నించుకో డానికే నాలుగు గోడలలో బందీలయ్యామే మోననిపిస్తుంది.

ఆర్థిక పరిస్థితిపై దెబ్బ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలింది.

పరిశ్రమలు మూతపడ్డాయి, చిన్న వ్యాపారులు అప్పుల్లో కూరుకుపోయారు. రైతులు తమ పంటను అమ్ముకోలేక ఇబ్బంది పడ్డారు. రవాణా లేక, పర్యాటకం మునిగిపోయింది.



ఇకపోతే, వైద్యరంగం, అత్యంత ఒత్తిడిని ఎదుర్కొంది. డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది నిజమైన దేవుళ్లుగా మారారు.

భావోద్వేగాలపై ప్రభావం వల్ల, ఇంట్లో నలుగురు ఉన్నా, ఒంటరితనం చుట్టుముట్టింది.

భయం, అనిశ్చితి, ఆందోళన, ఇవన్నీ మన మనసును వేధించాయి.

ఎప్పుడూ పరిగెత్తే మనిషి, ఒక్కసారిగా ఆగిపోవడం వల్ల తన అంతరంగాన్ని పరిశీలించే అవకాశం లభించింది.

కొంతమంది ధ్యానం, యోగా, పుస్తకాలు చదవడం, సంగీతం వినడం వంటి మార్గాలలో శాంతిని వెతికారు.

కానీ మరికొందరు నిరాశ, డిప్రెషన్‌లో కూరుకు పోయారు.

మన మనుగడ కోసం మారాలి, లేకపోతే మరెన్ని కరోనా జబ్బుల బారిన పడాలో ఊహించుకోలేం. ప్రపంచం మొత్తం భారత దేశం కుప్పకూలిపోతుందని ఎదురుచూసిన తరుణంలో, భారతదేశం అన్నింటినీ ఎదుర్కొని, అగ్రరాజ్యాల స్థాయికి ఎదిగి, ఎన్నో దేశాలకు దిక్సూచిగా మారింది. ఎంతో గొప్పగా మందులను సహితం అందజేసి చేయూతగా నిలిచింది. ఈ విషయం భారతీయులుగా మనం హర్షించేదే అయినా మన తప్పులను కూడా తెలుసుకోవాలి.

కరోనా మనకు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది.

మనిషి ఎంతటి శక్తిమంతుడైనా, ప్రకృతి ముందు బలహీనుడే.

అందుకే మనం చేయవలసింది, జనాభా నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి,



ఆరోగ్యంపై మరింత శ్రద్ధ, స్థానిక ఆహారం, స్థానిక ఉత్పత్తుల వినియోగం, కాలుష్యంపై అదుపు, క్రమ శిక్షణ, అనాదిగా మనకున్న కట్టుబాట్లు.

చిత్తశుద్ధితో ఆలోచించి, ఆత్మశుద్ధి చేసుకునే తరుణమిది. కరోనా మహమ్మారి మన జీవన విధానంపై, మనసుపై, సమాజంపై చూపిన ప్రభావాలను మరింత లోతుగా వెళ్లి అర్థం చేసుకోవాల్సిన అవసరం మనందరిది. మతం, రాజకీయాలు, మనసుల మధ్య దూరాలు, కరోనా మనల్ని విభజన చేసింది, మరో వైపు ఏకం చేసి చూపించింది.

మతం, జాతి పేరుతో నిందారోపణలు జరిగాయి. కానీ వైరస్ ఎవ్వరినీ వదలలేదు- ధనిక, పేద, హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ ఎందరో అందరికీ ఒకే శిక్ష విధించింది.

ఇది ఒక సార్వత్రిక సత్యాన్ని, మనం అందరం ముందుగా మనుషులమేనని గుర్తు చేసింది.

కరోనాని అధిగమించాం, కానీ కలవర పరిచే మన చిత్ర విచిత్ర అలవాట్లు, మతం పేరుతో చేసే దారుణాలు, దేశం, ప్రపంచం, వాతావరణంలో కాలుష్యం. వీటన్నిటిని మనం అరికట్టక పోతే, మనం ఏమై పోతామో, మన మనుగడ, భావితరాల భద్రత ఎటు పోతుందో ఆలోచించాల్సిన తరుణమిది.

పిల్లలు, విద్య, మానవ మనస్తత్వంపై కరోనా మహమ్మారి ప్రపంచాన్నంతా కుదిపేసి, మనిషి జీవన విధానం, ఆర్థికవ్యవస్థ, విద్యారంగం, కుటుంబ సంబంధాలు అన్నిటిపై ప్రభావం చూపింది. ఇవన్నీ గమనించాలి.

విద్యారంగంలో కరోనా చేసిన మార్పులు విశేషంగా చెప్పుకోవాలి. పాఠశాలలు, కళాశాలలు మూతపడి ఆన్‌లైన్ విద్య ప్రధానంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సదుపాయాలు లేక పోవడం వల్ల విద్యలో పెద్ద అంతరాయం ఏర్పడింది. పేద విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు లేక, ఇంటర్నెట్ లేక పాఠాలు కోల్పోయారు. దీనివల్ల విద్యా అసమానతలు మరింత పెరిగాయి. మరోవైపు, ఆన్‌లైన్ క్లాసులు కొనసాగించినా, ప్రత్యక్ష బోధనలో ఉండే అనుభవం, గురువుల సమక్షంలో ఉండి నేర్చుకునే ప్రక్రియ లోపించింది. ఇది విద్యార్థుల మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపింది.

మానవ మనస్తత్వం విషయంలో కరోనా చేసిన మార్పులు గమనించదగ్గవే. అనిశ్చితి, భయం, ఒంటరితనం మనిషిని వదలలేదు. చాలా మందిలో ఆందోళన, నిరాశ, భవిష్యత్తుపై భయం పెరిగింది. ఉద్యోగాలు కోల్పోవడం, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య భయం కుటుంబాలలో ఉద్రిక్తతలు పెంచాయి. చాలా మంది మానసికంగా బలహీనపడగా, కొందరు కొత్త మార్గాలను వెతికి పట్టుదలతో ముందుకు సాగారు. కరోనా మానవ సహనశక్తిని పరీక్షించింది.

కరోనా తర్వాత జీవితం కుంటుతూ మొదలై



**కరోనాని అదిగమించాం, కానీ కలవర పరిచే మన చిత్ర విచిత్ర అలవాట్లు, మతం పేరుతో చేసే దారుణాలు, దేశం, ప్రపంచం, వాతావరణంలో కాలుష్యం. ఇవన్నీ మనం అరికట్టక పోతే, మనం ఏమై పోతామో, మన మనుగడ, భావితరాల భద్రత ఎటు పోతుందో ఆలోచించాల్సిన తరుణమిది.**

య్యింది.

క్రమంగా వ్యాక్సిన్లు వచ్చాయి, చికిత్సలు అభివృద్ధి చెందాయి.

ప్రజలు మళ్లీ బయటకు రావడం మొదలు పెట్టారు.

కానీ జీవితం పూర్వంలా కాకుండా కొత్త నిబంధనలతో సాగింది.

మాస్క్ మన జీవితంలో ఒక భాగమైంది.

హ్యాండ్ సానిటైజర్ జేబులో స్థానం సంపాదించుకుంది. పెద్ద సమావేశాలపై నియంత్రణలు వచ్చాయి. పెళ్లీపేరంటాలు కొత్త రకం మార్పులతో చక్కబడ్డాయి.

ఇంకా, మనం నేర్చుకోవలసినది చాలా ఉంది.

కరోనా మానవజాతికి ఒక హెచ్చరిక, ప్రకృతిని జయించలేవు, ప్రకృతిని గౌరవించు, సహజ సమతుల్యతను కాపాడు, లేకపోతే మరిన్ని మహమ్మారులు వస్తాయని హెచ్చరించింది.

ప్రతి వ్యక్తి స్వీయ నియంత్రణ, సమాజం పట్ల బాధ్యత, భూమి పట్ల గౌరవం చూపాలి.

అప్పుడే భావితరాలకు సురక్షిత భవిష్యత్తు లభిస్తుందన్న గొప్ప సందేశాన్ని అందించింది.

చివరిగా,

అయితే, ఈ మహమ్మారి కొన్ని సానుకూల మార్పులను కూడా తెచ్చింది. కుటుంబ సభ్యులు కలిసి గడపడం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం, పరిశుభ్రతను అలవాటు చేసుకోవడం వంటి మంచి అలవాట్లు పెరిగాయి. విద్యలో సాంకేతిక వినియోగం పెరగడం వలన, డిజిటల్ విద్య మరింత బలపడింది. మానసిక ఆరోగ్యం, ధ్యానం, యోగ వంటి విషయాలపై చైతన్యం పెరిగింది.

మొత్తానికి కరోనా మన జీవితాన్ని కొత్త దారుల్లో నడిపించింది. పిల్లల అభివృద్ధి, విద్యావిధానం, మానవ మనస్తత్వంపై దీని ప్రభావాలు దీర్ఘకాలం మనతోనే ఉండబోతున్నాయి. ఈ అనుభవం మనకు ఒక పాఠం నేర్పింది - ఆరోగ్యమే మహాభాగ్యం. మానసిక స్థైర్యం ఉంటేనే అన్ని కష్టాలను ఎదుర్కొనే శక్తి వస్తుందని తెలియచేసింది.

నాలుగు గోడల మధ్య కూర్చోబెట్టి మనల్ని మనం ప్రశ్నించుకునే అవకాశం ఇచ్చింది కరోనా.

మనం ఎంత దూరం వచ్చామో, ఎంత తప్పు దారిలో పయనించామో ఆలోచించమని బోధించింది.

ఈ మహమ్మారి మనల్ని భయపెట్టినా, అదే సమయంలో మనిషి హృదయంలోని మానవత్వాన్ని మళ్లీ వెలిగించింది.

డాక్టర్లు, పోలీసులు, స్వచ్ఛంద సేవకులు వారి త్యాగం మరువలేనిది.

మనందరం కలసికట్టుగా ముందుకు సాగితేనే, రాబోయే కాలంలో మరిన్ని విపత్తులను తట్టుకోగలుగుతాం.

వసుధైక కుటుంబం అన్న మన నినాదాన్ని యావత్ ప్రపంచానికి తెలియచేసి, భారతదేశానికి గౌరవాన్ని సంపాదించింది కరోనా. కాలం తెచ్చిన కష్టాలతో పాటుగా, మనకు ఎన్నో సదవకాశాలను కూడా కల్పించింది కరోనా, వాటిని సద్వినియోగం చేయవలసిన బాధ్యత మనందరి మీదా ఉంది.

**డా॥ జె.పి. భారతి కాజా**
**7989053047**



డిసెంబర్ 13. ఢిల్లీ ఎర్రకోట ప్రాంతం ఒక్కసారిగా 'వందేమాతరం, జైహింద్, భారత్‌మాతా కీ జై' నినాదాలతో మార్మోగింది. భారతీయ సాంస్కృతిక సంప్రదాయానికి, తరతరాల జీవన విధానానికి అత్యంత అరుదైన గౌరవం దక్కిన సందర్భమది. భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకునే 'దీపావళి' పర్వదినానికి ప్రతిష్టాత్మకమైన ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) గుర్తింపు లభించింది. యునెస్కో 'మానవ సంస్కృతికి చెందిన వారసత్వ జాబితా/సాంస్కృతిక వారసత్వ (Intangible Cultural Heritage) జాబితాలో చేర్చడం ద్వారా, దీని విశిష్టత విశ్వవ్యాప్తమైంది. ఈ పర్వదినానికి ఈ గుర్తింపు లభించడం భారతీయ సనాతన ధర్మానికి, సంస్కృతికి దక్కిన విశ్వవ్యాప్త ఆమోదంగా భావిస్తున్నారు. వారసత్వ సంపద అంటే కేవలం కట్టడాలు, నిర్మాణాలే కాదు. అమూర్త వారసత్వం అంటే భవనాలు, కట్టడాలు కాదు. తరతరాలుగా ప్రజలు పాటిస్తున్న ఆచారాలు, పండుగలు, కళలు, నైపుణ్యాలు కూడా.

# విశ్వ మకుటంలో దివ్వెల పండుగ

కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకునే పండుగ దీపావళి. కేవలం ఒక మతపరమైన ఉత్సవంగానే కాకుండా, మానవతా విలువలకు, ఆశావాదానికి ప్రతీకగా నిలిచే దీనికి యునెస్కో గుర్తింపు రావడం ప్రతి భారతీయుడికి గర్వకారణం. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే దీపావళిని జరుపుకుంటున్నప్పటికీ, యునెస్కో ఆమోదముద్రతో అధికారిక హోదా దక్కినట్లయింది. దీనివల్ల విదేశీ పర్యాటకులు, మన సంస్కృతిని ప్రత్యక్షంగా వీక్షించడానికి అవకాశం ఉంటుది. ప్రధానంగా అయోధ్యలో జరిగే 'దీపోత్సవం', వారణాసిలో 'దేవ దీపావళి' లాంటి వేడుకల వీక్షణకు అంతర్జాతీయ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని, ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని ఆర్థికనిపుణుల అంచనా.

దీపావళి అంటే కేవలం బాణసంచా కాల్చే పండుగే కాదు. రామాయణభారతగాథలతో ముడిపడి చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక. శ్రీరాముడు వనవాసానంతరం అయోధ్యకు తిరిగి రావడం; దుష్టశిక్షణ, శిష్టరక్షణ సూత్రంపై శ్రీకృష్ణుడు నరకా సురుడిని హతమార్చడం ఈ పండుగకు నేపథ్యం. అలాగే లక్ష్మీపూజ మరో ప్రధానాంశం. ఈ పూజ ద్వారా సిరిసంపదలను ఆహ్వానించడం హిందూ సంప్రదాయంలో భాగం. వ్యాపారులు తమ కొత్త ఖాతా పుస్తకాలను ప్రారంభించడానికి ఈ రోజును పవిత్రంగా భావిస్తారు. ఈ వారసత్వ సంపద జాబితాలో ఇప్పటివరకు గల 15 భారతీయ అంశాల సంఖ్య తాజాగా దీపావళి చేరికతో 16కి పెరిగింది. శారీరక, మానసిక ఆరోగ్యానికి మన పూర్వీకులు అందించిన యోగా(2016), ప్రపంచంలోనే అతిపెద్ద కుంభమేళా(2017),పశ్చిమ బెంగాల్‌లో అత్యంత వైభవంగా జరిగే దుర్గాపూజ(2021), పార్సీల నూతన సంవత్సర వేడుక నవ్రోజ్ వంటివి ఈ జాబితాకు ఎక్కాయి. రంగోలి (కుటుంబ ఆచారాలు), చక్ లెమా (ఉత్తరాఖండ్), రామమణి (కర్ణాటక్),9. నవరాస పురుష లాంటి అంశాలు ఇప్పటికేఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

హిందువులు, సిక్కులు, జైనబౌద్ధులు దీపావళిని భిన్నరీతులలో జరుపుకుంటాయి. సిక్కులు దీపావళిని బంద్ చోర్ దివాస్ లేదా ఖైదీల విడుదల దినోత్సవంగా జరుపుకుంటారు. 1619లో ఆరవ సిక్కు గురువు గురు హర్గోబింద్ సాహిబ్ గ్వాలియర్ జైలు నుండి విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని దీనిని జరుపుకుంటారు. తనతో పాటు జైలులో ఉన్న మరో 52 మంది హిందూ యువరాజులనూ విడుదల చేస్తేనే తాను విడుదల అవుతానని మొగలులకు స్పష్టం చేశారని, అలా అంతమంది ప్రాణాలను కాపాడిన మహనీయుడికి నివాళిగా భావిస్తారు.

జైనులకు ఈ పర్వదినం ప్రాముఖ్యమైనది. జైనమత 24వ వరి, తీర్థంకర (ధర్మ రక్షకుడు, ఆధ్యాత్మిక గురువు) మోక్షం, మహావీరుడు జ్ఞానోదయం పొందడాన్ని గుర్తుచేసుకొంటూ దీపావళి జరుపుకుంటారు. అశోకుడు కళింగ యుద్ధంలో విజయం సాధించిన తర్వాత శాంతి, జ్ఞానోదయం సాధించేందుకు బౌద్ధమతం స్వీకరించాలన్న నిర్ణయాన్ని గౌరవిస్తూ ఈ పండుగను జరుపుకుంటారు. దేశంలో దీపావళిని జరుపుకోవడంలో ప్రతి ప్రాంతానికి ఒక్కొక్క ప్రత్యేక సంప్రదాయం, విధానం ఉన్నప్పటికీ, చెడుపై మంచి విజయం సాధించడం అనేది సాధారణ విశ్వాసంగా మిగిలిపోయింది. వారాణిసిలో దీనిని దేవ దీపావళి, దేవతల పండుగ అని వ్యవహరిస్తారు. దేవ దీపావళి రాక్షసుడు త్రిపురాసురుడిపై శివుడు సాధించిన విజయాన్ని కూడా సూచిస్తుంది. ఆ రోజున, దేవీ దేవతలు, పితృ దేవతలు గంగాస్నానానికి దిగి వస్తారని విశ్వాసం.

దేశంలోని చాలా ప్రాంతాల్లో దీపావళి రోజున లక్ష్మీదేవిని; పశ్చిమ బెంగాల్, అస్సోంలో కాళీమాతను పూజిస్తారు. పూలు, మధుర పదార్థాలు, చేపలు, మాంసాన్ని నైవేద్యంగా పెడతారు. గోవాలో గడ్డి, ఎండుగడ్డితో తయారు చేసిన నరకాసురుడి భారీ దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. ఒడిషాలో దీపావళిని పితృతృప్తి దినంగా పాటిస్తారు. ఆరోజు పూర్వీకులు స్వర్గం నుంచి దిగివస్తారనే విశ్వాసంతో జనపనార కర్రలు కాల్చుతూ వారికి ఆహ్వానం పలుకుతారు. కుటుంబాలను ఆశీర్వదించాలని వేడుకుంటారు. ఫిజి, గయానా, మలేషియా, మారిషస్, మయన్మార్, నేపాల్, సింగపూర్, శ్రీలంక, సురినామ్ ట్రినిడాడ్, టొబాగోలలో కూడా దీపావళి జరుపుకుంటారు. ఇన్ని విశిష్టతల నేపథ్యంలో యునెస్కో దీపాల పండుగను వారసత్వ పర్వదినంగా గుర్తించింది.

## ప్రధాని ప్రశంస

'దీపావళి మన సంస్కృతి, విలువలతో పెనవేసుకు పోయింది. ఈ పర్వదినానికి లభించిన గుర్తింపుతో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీ యులు పులకాంకితులవుతున్నారు. ఈ గుర్తింపుతో ఈ పండుగ ప్రాశస్త్యం ప్రపంచవ్యాప్తంగా మరింత పెరుగుతుంది' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా సామాజిక మాధ్యమంలో స్పందించారు. 'ఇది భారత్‌కు చారిత్రాత్మక రోజు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో భారత సాంస్కృతిక వారసత్వం అంతర్జా తీయస్థాయిలో అపూర్వంగా గుర్తింపు పొందుతోంది' అని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పేర్కొన్నారు. దీపావళి వారసత్వ సంపద జాబితాలో చేరడం పట్ల పాకిస్తాన్ దౌత్యవేత్త షోయబ్ సర్వార్ మన దేశానికి అభినందనలు తెలిపారు.

– జాగృతి డెస్క్

విజయం



# తిరగబడిన చరిత్రకు నిదర్శనమే తిరువనంతపురం ఫలితం

కేరళ రాజధాని తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికలు జాతీయ స్థాయిలో చిన్నవే కావచ్చు. కానీ అది బీజేపీ వశం కావడం ఇప్పుడు దేశ రాజకీయాలలో కీలక రాజకీయ పరిణామంగా చెబుతున్నారు. అక్కడి రాజకీయాలలో నవశకం కూడా భావిస్తున్నారు. కేరళ దేశంలోని మిగిలిన ప్రాంతాల కంటే భిన్నమైన రాజకీయ వాతావరణం కలిగిన రాష్ట్రం. ఇక్కడ ఎప్పుడూ ఎల్‌డీఎఫ్ (వామపక్షాలు), యూడీఎఫ్ (కాంగ్రెస్ కూటమి)ల మధ్యే అధికారం చేతులు మారుతూ ఉండేది. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఆ పాత లెక్కలన్నింటినీ సమూలంగా మార్చేశాయి. ఈ ఫలితాలు కేవలం విజయాలు కాదు, దశాబ్దాల కమ్యూనిస్ట్ కంచుకోట గోడలను కూల్చిన చారిత్రక ఘట్టాలు. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికలలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) సాధించిన తిరుగులేని విజయం, కేరళ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ ఒక అద్వితీయ శక్తిగా ఆవిర్భవించడానికి స్పష్టమైన సంకేతం. ఈ విజయం, 'వికసిత కేరళ నిర్మాణం'లో బీజేపీ రాబోయే రోజుల్లో కింగ్ మేకర్''గా మారుతోందని బలంగా చాటిచెబుతోంది.

తిరువనంతపురం కార్పొరేషన్లో గత 45 సంవత్సరాలుగా ఎల్‌డీఎఫ్ తిరుగులేని అధికారాన్ని చెలాయించింది. మొత్తం 101 వార్డుల్లో 50కి పైగా సీట్లను గెలుచుకుని, ఎల్‌డీఎఫ్‌ను 29 సీట్లకు, యూడీఎఫ్‌ను 19 సీట్లకే పరిమితం చేయడం అనేది వికసిత భారత సంకల్పం పట్ల ప్రజలు చూపిన నమ్మకం.

ఈ విజయం ఒక్క రోజులోనో, ఈ ఒక్క ఎన్నికల్లోనో సాధించింది కాదు. 2010లో కేవలం 6 సీట్లతో మొదలైన బీజేపీ ప్రయాణం, 2015లో 35, 2020లో 34 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగి, ఇప్పుడు 50 సీట్లకు చేరుకోవడం స్థిరమైన, వ్యూహాత్మకమైన వృద్ధికి నిదర్శనం. ప్రతి ఐదేళ్లకూ రాజధాని ప్రజల్లో జాతీయవాద భావజాలం పట్ల, ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి ఎజెండా పట్ల పెరుగుతున్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు తిరువనంతపురంలో బీజేపీ తిరుగులేని శక్తి.

కేరళలో బీజేపీకి దక్కిన ఓట్ల శాతంలో మార్పును పరిశీలిస్తే, విపత్కర పరిస్థితులు నేడు ఎలా ప్రజాదరణగా మారుతున్నాయో స్పష్టమవుతుంది. దశాబ్దాల పాటు, కేరళలో బీజేపీకి ఓట్ల శాతం 10% లోపే. 2010 స్థానిక ఎన్నికల్లో కేవలం 11 లోపు ఉన్న ఓట్ల శాతం, కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వం వచ్చిన తర్వాత గణనీయంగా పెరిగింది. తిరువనంతపురం కార్పొరేషన్లోనే ఓట్లు 30% మార్కును దాటి, ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లతో సమానంగా ఎదిగింది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే, బీజేపీ ఓట్ల శాతం 15% నుంచి 20% వైపు స్థిరంగా దూసుకెళుతున్నది. ముఖ్యంగా, త్రిపునితుర వంటి ఇతర మున్సిపాలిటీలలో కూడా ఎన్‌డీఏ విజయం సాధించడం, పట్టణ ప్రాంత ప్రజల దృక్పథం మారుతున్నట్లు సూచిస్తోంది. ఈ పెరుగుదల ఒక వర్గానికో లేదా ప్రాంతానికో పరిమితం కాలేదు. స్థానిక సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకత, కేంద్రంలో ఉన్న అభివృద్ధి పాలన పట్ల ఆకర్షణ – కలయికతో ఏర్పడుతున్న కొత్త రాజకీయ సమీకరణం.

ఈ స్థానిక ఎన్నికలలో బీజేపీ పట్ల యువత, మహిళలలు సుముఖత వ్యక్తం చేయడం చూస్తే కేరళలో బీజేపీ భవిష్యత్తును నిర్ణయించేది నవ యువశక్తి, నారీశక్తి అని అర్థమవుతోంది. అనేక గ్రామ పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో బీజేపీ తరపున పోటీ చేసిన యువతలో కనిపించిన ఉత్సాహం ప్రశంసనీయం. ఈ యువ కార్యకర్తలు ఎలాంటి గడ్డు పరిస్థితులనూ లెక్కచేయకుండా, వీధుల వెంట జాతీయవాద భావజాలాన్ని, అభివృద్ధి సందేశాన్ని తీసుకెళ్లారు. కమ్యూనిజం, కాంగ్రెస్‌లతో విసిగిపోయిన యువత ఇప్పుడు వికసిత భారత నిర్మాణంలో పాలుపంచుకోవడానికి బీజేపీని ఒక సరైన వేదికగా చూస్తోంది. ఈ యువశక్తి రాబోయే రోజుల్లో కేరళలో బీజేపీని నిజమైన కింగ్ మేకర్‌గా నిలబెడుతుంది. బీజేపీకి మహిళల మద్దతు గణనీయంగా పెరుగుతోంది. దీనికి నిదర్శనం, మాజీ ఐపీఎస్ అధికారిణి, కేరళ తొలి మహిళా డీజీపీగా పనిచేసిన ఆర్. శ్రీలేఖ తిరువనంతపురం కార్పొరేషన్‌లోని శాస్త మంగళం వార్డు నుండి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందడం. ఇలాంటి ప్రముఖ మహిళా నాయకురాళ్లను రంగంలోకి దింపడం, నారీ శక్తి సేవలను స్థానిక స్థాయిలో ఉపయోగించుకోవాలని బీజేపీ చూపిన చొరవ, మహిళా ఓటర్లలో గొప్ప నమ్మకాన్ని పెంచింది. కేరళలో బీజేపీ అధికారాన్ని పొందగలదా? అనే ప్రశ్నకు ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు ధీమాతో కూడిన సమాధానాన్ని ఇచ్చాయి. తిరువనంతపురం కార్పొరేషన్ విజయం కేవలం ఆరంభం మాత్రమే. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం వైపు బీజేపీ వేస్తున్న అడుగులు చాలా పటిష్టంగా ఉన్నాయి. కేరళ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ నాయకత్వంలో, పార్టీ కేవలం రాజకీయపరమైన అంశాలపై కాకుండా, రాజధాని అభివృద్ధి, అవినీతి రహిత పాలన అనే అంశాలపై దృష్టి పెట్టింది. ఇది కమ్యూనిజం, కాంగ్రెస్ పాలనలో కలుషితమైన రాజకీయాలను చూసిన మధ్య తరగతి, మేధావి వర్గాన్ని బలంగా ఆకట్టుకుంటోంది.

గతంలోను, ప్రస్తుతం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అనుసరించిన హిందూ వ్యతిరేక విధానాలు, ముఖ్యంగా శబరిమల బంగారు స్కామ్ వంటి అంశాలను బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఇది హిందూ ఓటు బ్యాంకును ఏకీకృతం చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్‌లో బీజేపీ అభ్యర్థిగా తొలిసారి సురేష్ గోపి గెలుచుకోవడం, ప్రస్తుతం తిరువనంతపురంలో సాధించిన కార్పొరేషన్ విజయం–ఇవి రెండూ రాబోయే అసెంబ్లీ ఎన్నిక లలో నమ్మకంతో ముందుకు సాగేటట్టు చేస్తాయి. కేరళలో సంప్రదాయ రాజకీయ శక్తులు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ పట్ల ప్రజల్లో విసుగు, అవినీతి పట్ల ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ శూన్యాన్ని బీజేపీ జాతీయవాద, అభివృద్ధి ఎజెండా నింపు తోంది. ఈ నేపథ్యంలోనే తిరువనంతపురం విజయం కార్యకర్తల పట్టుదలకు, నిబద్ధతకు, త్యాగానికి దక్కిన ప్రతిఫలం. కమ్యూనిస్టుల కంచుకోట కూలింది. మోదీజీ వికసిత భారత సంకల్పం, స్వయం సమృద్ధ భారత్ మంత్రం – భవిష్యత్తుకు మార్గదర్శకాలు. దేశ పురోగతి కోసం, కేరళ అభివృద్ధి కోసం, జాతీయవాద భావజాలంతో బీజేపీ వేస్తున్న అడుగులు సరైన మార్గంలోనే పడుతున్నాయి. ప్రతి పంచాయ తీలో, ప్రతి వార్డులో యువతరం సాధించిన నేటి చిన్నపాటి విజయాలన్నీ ఒకరోజు పెద్ద శక్తిగా మారుతాయి.

**– బీఎల్ఎన్ పవన్**

**బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి, ఏపీ.**



దేశంలో బుజ్జగింపు రాజకీయాలు 1930వ దశకంలోనే ప్రారంభమయ్యాయి. 'సెక్యులరిజం' పేరుతో వందేమాతరం గేయంపై ముస్లింలీగ్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడం దగ్గరినుంచి కాంగ్రెస్ సంతుష్టీకరణ విధానాలు మొదలయ్యాయని చెప్పాలి. వందేమాతరం గేయం రచించి ఈ ఏడాదితో సరిగ్గా 150 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిని వందేమాతరం సంస్మరణ సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో "జాతీయ గేయం వందేమాతరం 150 వార్షికోత్సవం సందర్భంగా చర్చ" పేరుతో అప్పట్లో చోటుచేసుకున్న వాస్తవ పరిణామాలను ప్రజలకు ముఖ్యంగా నేటితరం వారికి పార్లమెంట్ ద్వారా తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.



# బుజ్జగింపుల దాడిలో

ముఖ్యంగా వందేమాతరం గేయంలో రెండు చరణాలను మాత్రమే ఉంచి మిగిలిన వాటిని తొలగించడంపై లోక్‌సభలో ప్రధాని నరేంద్రమోదీ చర్చను ప్రారంభించగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ముగించారు. డిసెంబర్ 8వ తేదీన లోక్‌సభలో మొత్తం పదిగంటలపాటు చర్చ జరిగింది. అదేవిధంగా రాజ్యసభలో డిసెంబర్ 9న హోంమంత్రి అమిత్ షా చర్చను ప్రారంభిస్తే, 10వ తేదీన బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభాపక్ష నేత జె.పి.నడ్డా ముగించారు. నిజానికి దీనిపై చర్చించ డానికి ఎన్డీఏ పక్షాలు సిద్ధం కాగా, విపక్షాల్లో ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఈ చర్చకు అంగీకారం తెలపడం గమనార్హం. అయితే కాంగ్రెస్ మాత్రం ఈ చర్చ జరపడానికి ఎంచుకున్న సమయాన్ని ప్రశ్నించింది. అంతేకాదు ఓటర్ల జాబితా సవరణల అంశం కీలకం కాగా ప్రభుత్వం వీటినుంచి దృష్టి మరల్చడానికే వందేమాతరం చర్చను ముందుకు తెచ్చిందని ఆరోపించింది.

**బీజేపీ వాదన**

వందేమాతరంపై జరిగిన చర్చలో బీజేపీ ప్రధానంగా కొన్ని అంశాలపై దృష్టి కేంద్రీకరించడం గమనార్హం. వీటిలో వందేమాతరం నినాదాన్ని నెహ్రూ ఏవిధంగా ఓటుబ్యాంకు రాజకీయాలకోసం ఉపయోగించుకున్నది వెల్లడి చేయడం ప్రధానంగా ఉంది. 1937లో వందేమాతరం గీతాన్ని కుదించ డంలో సుభాష్ చంద్రబోస్ వంటి సొంత పార్టీ నేతలు వ్యతిరేకిస్తున్నా నెహ్రూ ఏ విధంగా ముస్లింలీగ్, జిన్నాల ఒత్తిళ్లకు లొంగిపోయిందీ బహిర్గతం చేసింది. 1896లో గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ కాంగ్రెస్ సమావేశంలో వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించినప్పటికీ ఎవరూ ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. పైగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులుగా రహమ్‌తుల్లా సయానీ ఉన్నారు. 1870 ప్రాంతంలో బెంగాల్‌కు చెందిన బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం దేశంలోని హిందూ, ముస్లింలను ఏకతాటిపై నిలిపి బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటానికి ఉద్దీప్తం చేసింది. 1905లో వలస ప్రభుత్వం బెంగాల్‌ను విభజించినప్పుడు, అందుకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో వందేమాతరం మొత్తం గీతం ఒక నినాదంగా మారింది. కేవలం రాడికల్ మతతత్వవాదుల ఒత్తిడితో కాంగ్రెస్ ఈ అద్భుత గీతాన్ని రెండు చరణాలకు కుదించింది. ఈవిధంగా దేశాన్ని ఏకం చేసిన గీతాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసమే ముక్కలు చేశారనేది బీజేపీ అభిప్రాయం.

**కాంగ్రెస్ సమర్థన**

వందేమాతరం గీతాన్ని రచించినప్పుడు బీజేపీ ఉనికిలోనే లేదు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్‌లు తాము చేపట్టిన ఆందోళనా కార్యక్రమాల్లో ఎప్పుడూ వందేమాతరం గీతాన్ని ఆలపించేవారు. దేశంలో క్రమంగా మతపరమైన విభేదాలు బలం పుంజుకుంటున్న దశలో, గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ సూచన మేరకు వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను స్వీకరించడానికి నిర్ణయించారు. బీజేపీ ప్రభుత్వం దేశం ఎదుర్కొంటున్న వర్తమాన సవాళ్ల నుంచి దృష్టి మరల్చడానికే సాంస్కృతిక చిహ్నాలను తన స్వార్థం కోసం ఉపయోగిస్తున్నది. 1937లో వందేమాతరంలో మొదటి రెండు చరణాలు తీసుకోవాలనేది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయం. అది కేవలం నెహ్రూ ఒక్కరే చేయలేదు. నిర్ణయం తీసుకున్న కమిటీలో ఆయనతోపాటు మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, సుభాష్‌చంద్రబోస్, సరోజినీనాయుడు, రాజేంద్రప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి ఉద్దండ నాయకులున్నారని కాంగ్రెస్ గుర్తుచేసింది. అంతేకాదు స్వాతంత్ర్యోద్యమం సమైక్యంగా జరగాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పెద్దలు తీసుకున్న నిర్ణయమని పార్టీ పేర్కొంది. ఈ గేయంలోని రెండు చరణాలు మాత్రం ఉపయోగించవచ్చంటూ రవీంద్రనాథ్ ఠాకూర్ రాసిన లేఖను నిదర్శనంగా చూపుతూ ప్రధాని నుంచి క్షమాపణను కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

**నేటి తరాలవారు తెలుసుకోవాలి**

పార్లమెంట్‌లో చర్చను ప్రారంభిస్తూ ప్రధాన







# వందేమాతర గేయం!

మంత్రి, “నేటి తరాలవారు ఈ మహామంత్రంవంటి ఈ గేయానికి జరిగిన అన్యాయాన్ని స్పష్టంగా తెలుసుకోవాలి. నాటి విభజన మనస్తత్వం ఇప్పటికీ దేశానికి పెను సవాలు విసురుతోంది” అన్నారు. గేయంలోని కొన్ని చరణాలను తొలగించడం ద్వారా దాని ఆత్మను విడగొట్టినట్లయిందన్నారు. ఈ గేయాన్ని కుదించడంతోనే దేశ విభజనకు బీజాలు పడ్డాయని కూడా ఆయన అన్నారు.

అయితే ఎప్పుడో జరిగిన దానికి ఇప్పుడు చర్చ ఎంతవరకు అవసరమన్న వాదనలు వచ్చాయి. కానీ ఆధునిక స్వాతంత్ర్య పోరాటంలో కీలక ఘట్టాలను మనం సంస్మరించుకుంటూనే ఉన్నాం. అటువంటప్పుడు దేశ ప్రజలను ఒకే లక్ష్యం వైపునకు మరల్చడంలో కీలకపాత్ర పోషించిన వందేమాతరం గేయ చరిత్రను సంస్మరించుకోవడం అవసరమనేది బీజేపీ వాదన. అంతేకాదు బుజ్జగింపు రాజకీయాలతో ఈ గేయాన్ని కుదించి మెజారిటీ ప్రజల మనోభావాలకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదనేది కూడా బీజేపీ నాయకుల విమర్శ. అయితే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని మీరు దీనిపై చర్చించడమేంటనేది కాంగ్రెస్ ప్రతి విమర్శ. అంతేకాదు పశ్చిమ బెంగాల్‌లో మరో నాలుగు నెలల్లో ఎన్నికలు జరుగనున్న తరుణంలో, కేవలం రాజకీయ లబ్ధి కోసమే వందేమాతరం అంశాన్ని చర్చకు తీసుకు వచ్చారని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా ఎదురుదాడికి దిగారు. 150 సంవత్సరాలనుంచి ప్రజల హృదయాల్లో ఉందని, మనకు స్వాతంత్ర్యం వచ్చి దెబ్బయి ఐదేళ్లు దాటింది. అటువంటప్పుడు దీనిపై చర్చ ఎందుకని ఆమె ప్రశ్నించారు. ‘మీరు ఎంతసేపూ గతాన్ని సజీవంగా ఉంచే యత్నమే చేస్తారు. వర్తమానం, భవిష్యత్తు మీకు అవసరం లేద’ ని ఆమె అన్నారు. అయితే వందేమాతరం రచించిన బంకింబాబు బెంగాల్‌కు చెందిన వారైనప్పటికీ ఈ గేయం కేవలం ఆ రాష్ట్రానికే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది కనుక దీనిపై చర్చ అవసరమేనని బీజేపీ వాదించింది.

అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధులు ఎక్కడైనా అజ్ఞాత ప్రదేశంలో కలిసినప్పుడు వందేమాతరమని సంబోధించుకునేవారని రాజ్యసభలో చర్చ ప్రారంభిస్తూ హోంమంత్రి అమిత్‌షా అన్నారు. అంతేకాదు సరిహద్దుల్లో దేశరక్షణ విధుల్లో నిమగ్నమైన మన భద్రతాదళాల పెదవులపై కదలాడే నినాదం





వందేమాతరం అని ఆయన గుర్తుచేశారు. వందేమాతరంను స్వాతంత్ర్య నినాదంగా మలచిందే కాంగ్రెస్. సదస్సుల్లో వందేమాతరం పాడే సంప్రదాయాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్. కేవలం నెహ్రూ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని చూస్తుంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు.

**ఇతర పార్టీల వాదనలు**

రాజ్యాంగం మతస్వేచ్ఛకు హామీ ఇస్తోంది కనుక దేశభక్తిని కేవలం ఒక చిహ్నానికో లేక మతానికో ఆపాదించడం రాజ్యాంగాన్ని ధిక్కరించినట్టే అవుతుందని ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ వ్యాఖ్యానించారు. ఆ విధంగా వందేమాతరం గేయాన్ని ముఖ్యంగా ముస్లింలను ఆలపించమనడం దేశభక్తిని తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతు స్వాతంత్ర్యోద్యమ కాలంలో బెంగాల్‌కు చెందిన ఎందరో కవులు ఎన్నో కవితలను, గీతాలను రచించారని ప్రధాని కేవలం ఈ చర్చ ద్వారా రాజకీయ రంగు పులుముతున్నారు తప్ప మరోటి కాదన్నారు. వందేమాతరం గేయా లాపన వెనుక భావోద్వేగం మతరాజకీయాలను తిరస్కరించేదిగా ఉన్నదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు కకోలీ ఘోష్ దస్తీదార్ మాట్లాడుతూ వందేమాతరం ప్రతి భారతీయుడి హృదయాన్ని, సచేతనను తట్టిలేపేదిగా ఉన్నదన్నారు. జేడీ(యూ) నేత దేవేష్ చంద్ర ఠాకూర్ వందేమాతరం జాతి చైతన్యానికి మేల్కొలుపు వంటిదన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన డా.బైరెడ్డి శబరి వందేమాతరం దేశ ప్రజల ఉమ్మడి చైతన్యానికి చిహ్నమన్నారు.

శివసేనకు చెందిన శ్రీరాంగ్ బర్నే వందేమాతరం జాతీయతకు చిహ్నమన్నారు. డీఎంకెకు చెందిన ఎ. రాజా, శివసేన (యూబీటీ) నేత అరవింద్ సావంత్, ఎన్‌సీపీ (ఎస్‌సీపీ) నేత భాస్కర్ బగారే కూడా ఈ చర్చలో పాల్గొన్నారు.

**బంకించంద్ర చటోపాధ్యాయ (1838-1894)**

బెంగాల్ పునరుజ్జీవనంలో గొప్ప పాత్ర పోషించిన సాహితీ ద్రష్ట,గొప్ప నవలాకారుడు, మేధావిగా బంకించంద్ర చటోపాధ్యాయ పేరుపడ్డారు. బెంగాల్‌లోని నైహతిలో జన్మించిన ఆయన కలకత్తా యూనివర్సిటీనుంచి మొట్టమొదట గ్రాడ్యుయేట్ పట్టా పొందిన వారిలో ఒకరు. దుర్గేష్‌నందిని, కపాలకుండల, ఆనంద్‌మఠ్ నవలలను రచించారు. నిజానికి బంకించంద్ర చటోపాధ్యాయ 1857లో చోటుచేసుకున్న సన్యాసుల తిరుగుబాటు స్ఫూర్తితో 1870 ప్రాంతంలో హుగ్లీ నది తీరాన ఒక గృహంలో కూర్చొని వందేమాతరం గేయాన్ని రచించారు. అప్పట్లో డిప్యూటీ మెజిస్ట్రేట్‌గా ఉన్న ఆయన, వలస ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపట్ల అసంతృప్తితో రగిలిపోతుండేవారు. నవంబర్ 7,1875న ఆయన ఈ గేయం “బంగదర్శన్” అనే మ్యాగజైన్‌లో ఆరు చరణాలతో ప్రచురితమైంది. తర్వాత 1882లో “ఆనంద్‌మఠ్” పేరుతో ఆయన రాసిన నవలలో ఇదే గేయం 12 చరణాలతో ఉంది.

ఇందులో తొలి రెండు చరణాలను 1950లో కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయంగా స్వీకరించింది. అయితే ఈ గేయంలో మొదటి రెండు చరణాలు సంస్కృత భాషలో, మిగిలినవి బెంగాలీలో ఉండటం గమనార్హం. మొత్తంమీద చెప్పాలంటే బెంగాలీ భాషను సంస్కృతీకరించిన శైలిలో దీని రచన సాగింది. ఇందులో మాతృభూమి సౌందర్యాన్ని, స్ఫూర్తిని హృదయానికి హత్తుకునే విధంగా రచించడంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిలో ఇదొక నినాదంగా మారి, దేశ ప్రజలను ఒక్కతాటిపై నడిపించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు పురికొల్పింది. అయితే ఈ గేయ రచనకు బ్రిటిష్ జాతీయగీతం "గాడ్ సేవ్ ది క్వీన్" ప్రేరణ అని కూడా చెబుతారు.

**తొలిసారి ఆలాపన**

ఈ గేయాన్ని 1886లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో హేమచంద్ర బెనర్జీ ఆలపించగా, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గేయానికి సంగీతాన్ని సమకూర్చి, 1896 కాంగ్రెస్ సమావేశంలో ఆలపించినప్పుడు ఒక్కసారిగా ఈ గేయం దేశవ్యాప్తంగా ప్రజల నాలుకలపై నడయాడింది. 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో వందేమాతరం గీతం కలకత్తానుంచి లాహోర్ వరకు మారు మోగింది. అరవిందఘోష్ దీన్ని "స్వేచ్ఛామంత్రం"గా వర్ణించారంటే దీని ప్రభావం అప్పట్లో ఎంత తీవ్రంగా ఉన్నదీ అర్థమవుతుంది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ గీతాన్ని అణగదొక్కాలని ప్రయత్నించినా, ఫలితంలేకపోయింది. 1906 నుంచి 1911 మధ్యకాలంలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో వందేమాతరం పూర్తి చరణాలను ఆలపించారు. ప్రొఫెసర్ సవ్యసాచి భట్టాచార్య ప్రకారం 1920 ప్రాంతంలో దేశవ్యాప్తంగా ప్రజల్లో విస్తృత ప్రచారం పొందిన గేయం వందేమాతరం. ఇది తప్ప మరో జాతీయ గేయం ప్రజలకు తెలియదు. దేశంలోని వివిధ భాషల్లోకి దీన్ని అనువదించారు. మరాఠీ (1897), కన్నడ (1897), గుజరాతీ (1901), హిందీ (1906), తెలుగు (1907), తమిళం (1908), మలయాళం (1909) భాషల్లోకి ఈ గేయం అనువాదమైంది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్





# భారత్, ...

వాస్తవానికి, పుతిన్ ఢిల్లీ బయలుదేరి వచ్చే ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లతో క్రెమ్లిన్‌లో అయిదు గంటల పాటు సమావేశమయ్యారు. ఆ చర్చలను బట్టి, త్వరలో ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోయే అవకాశం ఉందనే సూచనలు కనిపించాయి.

రష్యా, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు కూడా కొత్త పుంతలు తొక్కుతాయని, ప్రపంచశాంతికి మార్గం సుగమం అవుతుందనే అభిప్రాయం కూడా అంతర్జాతీయంగా వ్యక్తమైంది. నిజానికి, అమెరికా, రష్యాల మధ్య మైత్రీ సంబంధాలు దెబ్బతినడం వల్ల భారత్ కూడా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటుంది. అగ్రరాజ్యాల మధ్య సంబంధ బాంధవ్యాలు మార్పులు, చేర్పులకు లోనవుతున్న సమయంలో భారత, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కావడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

**శాంతి సౌభాగ్యాలకు ప్రాధాన్యం**

సందర్భం దొరికినప్పుడల్లా మోదీ ప్రపంచ కీలక సమస్యలు, సంక్షోభాలపై భారతదేశ వైఖరిని స్పష్టం చేస్తూ వచ్చారు. దాపరికాలు, అరమరికలకు అవకాశం లేకుండా ఆయన నేరుగా అసలు విషయంలోకి దిగిపోతుండడం అటు రష్యా దౌత్యాధికారులనే కాక, ఇటు భారతీయ దౌత్యవేత్తలను కూడా ఆశ్చర్యపరచింది. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో తమది తటస్థ వైఖరి అని, శాంతి స్థాపనకు తాము అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మోదీ రష్యా అధ్యక్షుడి సమక్షంలోనే బహిరంగ ప్రకటన చేశారు. ఉక్రెయిన్ యుద్ధానికి చరమ గీతం పాడాలని పుతిన్, ట్రంప్‌లు కోరుకుంటున్న వేళ మోదీ ఈ ప్రయత్నాలకు తమవంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధమయ్యారు. అటో ఇటో తేలేవరకు యుద్ధం కొనసాగాలని కోరుకుంటున్న ఐరోపా దేశాలకు పుతిన్, మోదీల ప్రకటనలు ఒక పట్టాన మింగుడు పడడం లేదు.

పుతిన్ భారతదేశ పర్యటనకు బయలుదేరుతున్న రోజే ట్రంప్ తన అధ్యక్ష పదవికి సంబంధించి కొత్త జాతీయ భద్రతా వ్యూహాన్ని ప్రకటించారు. ఐరోపా దేశాలు క్రమంగా బలహీనపడుతున్నాయని, వాటి మీద నమ్మకం పెట్టుకోవడం ఏమంత శ్రేయస్కరంగా కనిపించడం లేదని ఆయన భావిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. వారిని భాగస్వాములుగా కొనసాగించడం వల్ల ఉపయోగమేమీ కనిపించడం లేదని కూడా ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. విదేశాలకు సంబంధించిన అంతరంగిక వ్యవహారాల్లో అమెరికా ఇక కల్పించుకోబోదన్న అభిప్రాయం కూడా వ్యక్తమయింది. ఇతర దేశాల భద్రతా వ్యవస్థల మీద ఆధారపడడం వల్ల అమెరికా భద్రతా వ్యవస్థ బలహీనపడుతోందన్న అభిప్రాయాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు.

ముఖ్యమైన విశేషమేమిటంటే, ఈ జాతీయ భద్రతా వ్యూహాన్ని ప్రకటిస్తున్న సందర్భంగా ట్రంప్ రష్యా, భారతదేశాలతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవలసిన అవసరాన్ని అమెరికా గుర్తించిందని చెప్పకనే చెప్పారు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారతదేశ పర్యటనకు రావడం సహజంగానే అంతర్జాతీయ దృష్టిని ఆకట్టుకుంది. ఇదొక ప్రపంచ స్థాయి రాజకీయ పరిణామంగా కూడా గుర్తింపు పొందింది. పుతిన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీన్ని ఒక ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అంశంగా పదే పదే ప్రకటించినప్పటికీ, ప్రపంచ దేశాలు అనేక విధాలుగా వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు చేయడం జరిగింది. ఢిల్లీలో ఉన్న జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ రాయబారులు ఒక అడుగు ముందుకు వేసి, పుతిన్ పర్యటనను ప్రచారార్భాటంగా, ఒక సాధారణ విషయంగా తీసిపారేయడం విమర్శలకు దారితీసింది. భారత విదేశాంగ శాఖ ఆ రాయబారుల మీద ధ్వజమెత్తింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుతిన్ గౌరవార్థం ఏర్పాటుచేసిన విందులో అమెరికా కాస్తంత ఎడమొహం పెడమొహంగా వ్యవహరించినప్పటికీ మోదీ గానీ, పుతిన్ గానీ దాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. మొత్తం మీద విందు సైతం ప్రశాంతంగా గడిచిపోయింది.

# రష్యా భాయి భాయి!

**ట్రంప్ ఆలోచనల్లో మార్పు**

మొత్తం మీద భారత, రష్యా దేశాల మధ్య సంబంధాలు కొత్తపుంతలు తొక్కడం ట్రంప్ ఆలోచనా ధోరణిలో బాగా మార్పు తెచ్చింది. రష్యాతో వ్యూహాత్మక స్థిరత్వాన్ని మెరుగుపరచుకుంటామని, అదే సమయంలో పసిఫిక్ ప్రాంతంలో శాంతి స్థాపనకు భారత్ చేస్తున్న కృషికి సహాయ సహకారాలు అందజేస్తామని కూడా ఆయన ప్రకటించారు. నిజానికి, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు సహా ఏ దేశమూ పుతిన్, మోదీల మధ్య చర్చలు, సమావేశాలను తేలికగా తీసిపారేయలేదు. పైగా ముందు భారత, రష్యాల వైపు ట్రంప్ మొగ్గుచూపే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ చర్చలు, సమావేశాల సందర్భంగా మోదీగానీ, పుతిన్ గానీ ఇతర దేశాలను రెచ్చగొట్టే విధంగానో, సవాలు చేసే విధంగానో ప్రసంగాలు, ప్రకటనలు చేయకపోవడం అనేక దేశాలకు ఊరట కలిగించింది. పూర్తిగా ద్వైపాక్షిక సంబంధాలు, మైత్రీ సంబంధాల మెరుగుదలకే ఈ దేశాలు పరిమితం కావడం కూడా అమెరికా, చైనా, బ్రిటన్, కెనడా దేశాలను ఆశ్చర్యపరచింది. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ అమెరికాకు వ్యతిరేకంగా వీరిద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనించవలసిన విషయం.

తమ రెండు దేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాలు బలపడాలన్నదే ఈ ఇద్దరి లక్ష్యంగా కనిపించింది. ఒకరి మీద ఒకరికి నమ్మకం పెరగాలని, తమ దేశాల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ఒకరినొకరు గౌరవించుకోవాలని ఈ ఇద్దరు ప్రపంచ నాయకులు తమ ఉమ్మడి ప్రకటనలో స్పష్టం చేశారు. అగ్ర రాజ్యాలు ప్రపంచ శాంతి, సౌభాగ్యాల విషయంలో బాధ్యత లను పంచుకోవాలని, అగ్రరాజ్యాల వల్ల వైషమ్యాలు చెలరేగకుండా ప్రపంచ శాంతి, సుస్థిరతలకు అవకాశం లభించాలని, భద్రత, సమానత్వాల కోసం ప్రయత్నించాలని మోదీ, పుతిన్‌లు తమ ప్రకటనలో నొక్కి చెప్పారు. పరస్పర ఉపయోగకర భారత, రష్యా సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకు వెళ్లాల్సి ఉందని, టెక్నాలజీ, సైన్స్, భద్రత, పెట్టుబడులు, అంతరిక్షం, అణు శక్తి, ఎనర్జీ, విద్య వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని వృద్ధిచేసుకోవాలని, సాంప్రదాయిక రంగాలతో పాటు సరికొత్త రంగాల్లో కూడా సహకారాన్ని పెంపొందించుకోవాలని మోదీ, పుతిన్‌లు అభిలషించారు. తమ సంబంధాల మెరుగుదలకు, వ్యూహాత్మక భాగస్వామ్యానికి విదేశీ విధానంలో ప్రాధాన్యం ఇవ్వాలని వారు భావించారు.

**లాభదాయక ఒప్పందాలు**

భారతదేశం మీద ట్రంప్ ప్రభుత్వం అత్యధికంగా సుంకాలను విధించడం, మోదీ కూడా ట్రంప్ విధానాలను, నిర్ణయాలను నిర్మొహమాటంగా తిరస్కరించడం అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ, మోదీ, పుతిన్‌ల శిఖరాగ్ర సమావేశంలో అటువంటివేవీ ప్రస్తావనకు రాలేదు. టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి ఈ రెండు దేశాలు సమీప భవిష్యత్తులో కొత్త చర్యలు తీసుకోబోతున్నాయని భారత-రష్యా ఆర్థిక సహకార కమిషన్ ఉపాధ్యక్షుడు, రష్యా ప్రథమ ఉపాధ్యక్షుడు డెనిస్ మాంతురొవ్ తెలిపారు. ఇందులో భాగంగా భారతీయులు రష్యాలో పని చేయడానికి, వృత్తి, వ్యాపారాలు చేపట్టడానికి మార్గం సుగమం చేయడం జరుగుతుంది. భారతీయులు రష్యా విశ్వవిద్యాలయాల్లో, పరిశోధన శాలల్లో పరిశోధనలు, ప్రయోగాలు చేయడానికి అవకాశాలు కల్పిస్తారు. భారతీయ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయడానికి ఉమ్మడి రంగంలో పరిశ్రమలను స్థాపించారు. 'ఆర్.టి. ఇండియా' పేరుతో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి మీడియా రంగాల మధ్య సహకారాన్ని పెంపొందిం చడానికి కూడా కృషి జరుగుతోంది. ప్రజల స్థాయిలో కూడా ఇరు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడాలని మోదీ, పుతిన్‌లు భావిస్తున్నారు.

ఒకరి సైనిక వ్యవస్థలను, సౌకర్యాలను మరొకరు ఉపయోగించుకోవడానికి, పసిఫిక్ మహా సముద్రంలో చైనా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లతో పాటు రష్యా కూడా ప్రవేశించడానికి అవకాశం ఇస్తూ ఉభయ దేశాల మధ్య ఒక అంగీకారం కుదిరింది. పసిఫిక్ మహా సముద్రంలో రష్యా ప్రవేశించడం వల్ల భారతదేశానికి కూడా భద్రత ఏర్పడుతుంది. పుతిన్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవడానికి ట్రంప్ కూడా ప్రయత్నించడం భారత్‌కు కూడా లాభం చేకూరుస్తుంది. రష్యా, చైనాల మధ్య విభేదాలు సృష్టించడానికి అమెరికా గత కొంత కాలంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉండకపోవచ్చు. రష్యా మీద విధించిన ఆంక్షలను అమెరికా తొలగించే అవకాశం ఉంది. అదే జరిగితే, భారత, రష్యా దేశాల మధ్య ఉన్న చెల్లింపుల వ్యవస్థ ముందుకు దూసుకుపోవడం జరుగుతుంది. రష్యాతో ఈ విధంగా సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడం మోదీకి ఒక ఘన విజయమనే చెప్పాలి. దేశ ప్రజలకు కూడా పుతిన్ పట్ల గౌరవాభిమానాలు పెరగడం, అందుకు ఆయన సానుకూలంగా స్పందించడం సాధారణ విషయం కాదు.



**జి.రాజశుక**
**సీనియర్ జర్నలిస్ట్**

రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. శీతల గాలుల తాకిడి ముంచెత్తుతోంది. ఇదే సమయంలో వేడిగాలులకు, మాటల మంటలకు అసెంబ్లీ సిద్ధమవుతోంది. శాసనసభ శీతకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో అధికార మార్పిడి తర్వాత రెండేళ్లకు మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్రసమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు తొలిసారి శాసనసభ సమావేశాలకు హాజరవడమేకాదు... వివిధ అంశాలపై మాట్లాడతామని సంకేతాలు ఇచ్చారు. దీంతో, అసెంబ్లీ వేదికగా మాటల మంటలు రేగే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా నెలకొన్న పరిణామాలు, పేలుతున్న మాటల తూటాలు అసెంబ్లీ కోసం నిప్పులు రాజేస్తున్నాయి.



# వణికించే చలి...వాడి

శాసనసభ శీతకాల సమావేశాల్లో నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశమే ప్రధానంగా ఉండబోతుందని తెలుస్తోంది. అటు ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖరరావు,ఇటు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వీటిపై ఒక స్పష్టత నిచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన నీటి వనరులైన గోదావరి, కృష్ణానదుల జలాల మీద ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. అధికారం చేతులు మారినప్పటి నుంచి రెండేళ్లు ఓపిక పట్టానని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా తాకట్టు పెట్టడం భరించలేక బయటకు వచ్చానని చంద్రశేఖరరావు మీడియా ముఖంగా చెప్పుకొచ్చారు. ప్రధానంగా కృష్ణా, గోదావరి నదుల మీద నీటి వాటాలు, ప్రాజెక్టులు, పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో వివాదాలను ఆయన ప్రస్తావించారు. దీనికి దీటుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో నీటి వాటాలు, ప్రాజెక్టుల పరిస్థితికి బీఆర్ఎస్, కేసీఆరే కారణమని, చర్చకు వస్తే అసెంబ్లీ సాక్షిగా అన్నీ బయటపెడతామని ఎదురుదాడికి దిగారు.



రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటుండగా.. మరో ప్రతిపక్ష పార్టీ భారతీయ జనతాపార్టీ రెండు పార్టీల వైఫల్యాలను ఎండగడుతోంది. అవి దొందూ దొందే అని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ గానీ, కాంగ్రెస్ గానీ ఏమీ చేయలేదని, చేయడం లేదని, పరస్పర విమర్శలు, ఆరోపణలు, దూషణలకు సమయం వృథా చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు వ్యాఖ్యానించారు. అప్పుడు బీఆర్ఎస్ కేసీఆర్ కుటుంబ ప్రయోజనాలకోసం పాకులాడితే.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సోనియా, రాహుల్ చేతుల్లో కీలుబొమ్మల్లా మారిపోయిందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో, ఈ పరిణామాల్లో ఎవరు వాదన నిజం? ప్రజలు మాత్రం గందరగోళంలో పడిపోయారు. వీటికి అసెంబ్లీ సాక్షిగా అసలు దృశ్యం బయటపడబోతోందని ఎదురు చూస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలకు కృష్ణా, గోదావరి నదుల జలాల కేటాయింపులు, పాలమూరు–రంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టులు, గత ప్రాజెక్టుల వైఫల్యాలపై సమగ్రంగా చర్చించడమే ప్రధాన ఎజెండాగా శీతకాల సమావేశాలు ఉంటాయని చెబుతున్నారు. జలాల చర్చ విషయంలో రెండు ప్రధాన పక్షాలు పక్కా వ్యూహాత్మకంగానే వ్యవహరించాయన్న చర్చ జరుగుతోంది. డిసెంబర్ 21వ తేదీన బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, శాసనసభలో ప్రతిపక్ష నేత కేసీఆర్ దాదాపు ఎనిమిది నెలల సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ భవన్ వేదికగా బయటకు వచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం అనంతరం మీడియా ముందుకు వచ్చారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు అంశమే ప్రధాన ఎజెండాగా చర్చించామని, కేంద్రం, రాష్ట్రం.. పాలమూరు ప్రాజెక్టుకు ద్రోహం చేశాయని, ఆ జిల్లా ప్రాజెక్టులకు 174 టీఎంసీల కృష్ణా జలాలు రావాల్సి ఉందని కేసీఆర్ అన్నారు. 'పాలమూరు జిల్లాలో కృష్ణానది 300 కి.మీ ప్రవహిస్తోంది. 1974లో బచావత్ ట్రిబ్యునల్ 17 టీఎంసీలు జూరాలకు సుమోటోగా కేటాయించినా.. పట్టించుకున్నవారే లేరు. పాలమూరు జిల్లాకు 170 టీఎంసీలు తీసుకెళ్లాలన్నది బీఆర్ఎస్ వ్యూహం. ఎంతసేపూ భూములు అమ్ముకుందామనే యావలోనే ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. మనకు వచ్చే నీళ్లను కూడా కాపాడలేకపోతోంది. కేవలం 40 టీఎంసీలు చాలని కేంద్రానికి లేఖ ఎలా రాస్తారు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల మధ్య ఎండగడతాం. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో గ్రామ గ్రామాన భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం. ఆ సభలకు నేనూ వస్తాను. ప్రభుత్వానికి కావాల్సినంత సమయం ఇచ్చాం. ఇకపై మౌనంగా ఉండేది లేదు. అందుకే నేనే స్వయంగా



# వేడి వాదోపవాదాలు

రంగంలోకి దిగాను' అని కేసీఆర్ చెప్పుకొచ్చారు.

ఇక, కేసీఆర్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం వెనువెంటనే స్పందించడం మొదలుపెట్టింది. కేసీఆర్ మీడియా సమావేశం పూర్తయ్యిందో లేదో, మంత్రులతో పాటు.. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఎదురుదాడిచేసే ప్రయత్నం చేశారు. కేసీఆర్ మీడియా ముందుకు వచ్చిన మరునాడు సాయంత్రానికే ముఖ్యమంత్రి సహా మంత్రులు ఎనిమిది మంది మీడియాతో మాట్లాడారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో, బీఆర్ఎస్ పాలన తీరును ఎండగట్టారు. అదేరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆ తరవాత వరసగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఉమ్మడిగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా సెక్రెటేరియట్ లో ప్రెస్‌మీట్ పెట్టారు. నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోసారి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కూడా మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ వైఖరిని తప్పుబట్టారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇదే అంశంపై ఓ ప్రెస్ నోట్ విడుదల చేశారు.

కాగా, కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్ ప్రభుత్వాన్ని ఉలికిపాటు పాలుచేసిందని, అందుకే ముఖ్య మంత్రితో పాటు.. అంతమంది మంత్రులు వరుసబెట్టి మరీ మీడియా మీట్‌లు నిర్వహించారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. అధికార పక్షం అంత ఆదరాబాదరాగా, స్పందించాల్సిన అవసరం లేదేమో అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్నవాళ్లు..ఒక్కసారిగా ఈ స్థాయిలో విరుచుకుపడితే ప్రతిపక్షానికి మరో అస్త్రం చేతికి ఇచ్చినట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే దీనిపైనే మరో విశ్లేషణ కూడా నడుస్తోంది. కేసీఆర్ స్వయంగా సవాల్ చేసినందున.. ఇదే అదనుగా ఆయన్ను ఈసారి అయినా అసెంబ్లీకి రప్పించాలని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని ప్రభుత్వం భావించినట్లు కూడా చెబుతున్నారు. అందుకే వెంటవెంటనే ఆరోపణలు, విమర్శలతో పాటు.. అసెంబ్లీ సమావేశాల ఎజెండాను కూడా ఖరారు చేశారం టున్నారు. ఇకపోతే, కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల విమర్శలు, ప్రతి విమర్శలపై భారతీయ జనతాపార్టీ కూడా విరుచుకుపడింది. రెండు పార్టీలు రాష్ట్రానికి ద్రోహం చేశాయని, తెలంగాణలో వన్ టైమ్ పాస్ వర్డ్ (ఓటీపీ) మాదిరి రాజకీయాలు సాగవని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. ఇన్నాళ్లకు కేసీఆర్ ఫామ్‌హౌజ్ నుంచి బయటకు వచ్చారని, మళ్లీ వెళ్లిపోతారని, ఆయనది ఓటీపీ రాజకీయమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మరుగున పడిపోయిందని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమే అని అన్నారు.




ఇక, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డిసెంబర్ 22వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో సమావేశం నిర్వహించి అసెంబ్లీ వేదికగా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యవహార శైలిని ఎండగట్టాలని నిర్ణయించారు. 'నీళ్లు–నిజాలు' అంశమే ప్రజా ఎజెండాగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పెండింగ్ ప్రాజెక్టులు, నీటి కేటాయింపుల విషయంలో బీఆర్ఎస్ చెబుతున్నవి అబద్ధాలని, అసెంబ్లీ వేదికగా వాటిని తిప్పి కొడదామన్న నిర్ణయానికి వచ్చారు. నదీ జలాలకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందన్న అంశాన్ని ఎత్తి చూపాలని రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టడాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ప్రశంసించిన వీడియోను ఈ సందర్భంగా మంత్రులకు చూపించారు. కృష్ణా నీటి కేటాయింపుల్లో కేసీఆర్ తీరుతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశంలో అనుకున్నారు. ప్రాజెక్టులు, నీటి కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఆంధ్రప్రదేశ్ కడుతున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలనూ ఈ సందర్భంగా వివరించాలని నిర్ణయం తీసుకున్నారు.

అయితే, కేసీఆర్ తీరుపై ఎప్పటిలాగే ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో మాదిరిగానే అలా వచ్చి తెలంగాణ భవన్ వేదికగా చురకలంటించి వెళ్లారని, ఈసారి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటున్నట్లు కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా? అన్న చర్చ నడుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవచ్చునని, కానీ, ప్రభుత్వం మాత్రం ఈ అంశంపై అసెంబ్లీలో వివరిస్తామని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు.


**సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

రాష్ట్రంలో వైద రంగం బలోపేతం కావాలంటే బోధనాసుపత్రుల నిర్మాణంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) అత్యవసరమని ప్రభుత్వం దృఢంగా విశ్వసిస్తోంది. ఈ విధానం ద్వారా వైద్య సేవల్లో నాణ్యత పెరగడమే కాకుండా, నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం సాధ్యమవుతాయని ఆశిస్తోంది. యాజమాన్య హక్కులు, నియంత్రణ అధికారాలు పూర్తిగా ప్రభుత్వం వద్దే ఉంచుకుంటూ, కేవలం నిర్వహణ బాధ్యతలను మాత్రమే ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ఈ వ్యూహం ప్రత్యేకత. నిర్ణీత కాలం తర్వాత ఈ కళాశాలలు తిరిగి ప్రభుత్వానికే చెందుతాయి కాబట్టి, ఇది ప్రజలకు దీర్ఘకాలికంగా మేలు చేకూరుస్తుంది.



# వైద్యరంగ పటిష్టతకు పీ

బోధనాసుపత్రుల నిర్మాణంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానం వల్ల కన్వీనర్ కోటా సీట్లను గణనీయంగా పెంచి, విద్యార్థుల ఆశలకు ఊపిరి పోస్తామని కూటమి సర్కార్ చెబుతోంది. దీని వల్ల ప్రతి కళాశాలలో కన్వీనర్ కోటా కింద 22 సీట్లు అదనంగా వస్తాయని, ఇది పేద విద్యార్థులకు గొప్ప అవకాశంగా భావించవచ్చని హామీ ఇస్తోంది. పార్లమెంటరీ స్థాయి సంఘం సైతం తన నివేదికలో వైద్య విద్యను పేదలకు చేరువ చేయాలన్నా, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలన్నా పీపీపీ విధానమే శ్రేయస్కరమని స్పష్టం చేసింది. అయితే, స్వలాభం, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తోన్న వైసీపీ ఈ అంశంపై బురదజల్లుతూ బోధనాసుపత్రుల నిర్మాణాన్ని అడ్డుకోడానికి ప్రయత్నంచేస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం వైద్య కళాశాలలకు కనీస నిధులు, భూములు కేటాయించకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. తమ పార్టీ ప్రచారం కోసం పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, ఆరోగ్యకేంద్రాలు, పేదల ఇళ్లకు పార్టీ రంగులు వేయించడం, తరగతి పుస్తకాలు, భూములలో సర్వేరాళ్లకు జగన్ ఫొటోల ముద్రణ ఇలా వేల కోట్ల నిధులను వరదలా పారించి దుర్వినియోగం చేసింది. ప్రజారోగ్యం కంటే రాజకీయ విలాసాలకే పెద్దపీట వేస్తూ, రుషికొండలో సుమారు రూ.500 కోట్లతో అతిథిగృహాలను నిర్మించింది. ఆ నిధులతో కనీసం రెండు అత్యాధునిక బోధనాసుపత్రులను నిర్మించి వేలాది మంది పేదలకు వైద్యం అందించే అవకాశం ఉన్నా, అప్పటి ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయలేదు. ఈ నేపథ్యంలో, రాజకీయ విమర్శలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నూతన విధానాన్ని అమలు చేయడం రాష్ట్ర ఆరోగ్య రంగానికి ఆశాకిరణంగా మారుతుంది.

**రాజకీయ ఉద్యమాలు**

ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో వైద్యబోధనాసుపత్రులను ప్రైవేటు వారికి కట్టబెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆరోపిస్తూ వైసీపీ రాష్ట్రంలో ఆందోళన చేస్తోంది. పీపీపీ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వివరణ ఇచ్చింది. టెండర్ల ఆపడానికి స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించినా వైసీపీ మాత్రం రాజకీయ ప్రయోజనం నిమిత్తం ఆందోళనలు చేస్తూనే ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బోధనాసుపత్రులను ఎందుకు నిర్మించలేదని ఇప్పటి కూటమి ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. కనీసం భూమి కేటాయించకుండా, నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబించిన విషయాన్ని గుర్తుచేస్తోంది.

రాష్ట్రంలో 2025 నాటికి ప్రభుత్వరంగంలో 18, ప్రైవేటురంగంలో 18, ఎయిమ్స్ 1, గీతం 1 మొత్తం కలిసి 38 కాలేజీలున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రతి జిల్లాలో ఒక బోధనాసుపత్రి నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి కళాశాలకు రూ.100 కోట్లు ఆర్థికసహాయం కూడా అందించనున్నట్లు ప్రకటించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రంలో 17 బోధనాసుపత్రులను నిర్మించ నున్నట్లు ప్రకటించింది. ఒక్కో కళాశాల నిర్మాణానికి రూ.500 కోట్ల చొప్పున మొత్తం 17 కళాశాలలకు రూ.8490 కోట్లు ఖర్చుచేయాలని అంచనా వేసింది. కాని ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇందులో ఒక్క కళాశాల నిర్మాణం కూడా పూర్తిచేయలేదని ఆరోపణలు వచ్చాయి. 2024 నాటికి ఖర్చు చేసింది కేవలం రూ.1,550 కోట్లు. ఐదేళ్లలో వ్యయం చేసింది 17శాతమే. కూటమి ప్రభుత్వం రాగానే బకాయిలు రూ.783 కోట్లు (తొమ్మిది శాతం) విడుదల చేశారు. రాజమండ్రి మెడికల్ కాలేజీకి రూ.487 కోట్లకుగాను






# పీపీ విధానం

నాడు కేవలం రూ.81 కోట్లు ఖర్చు చేశారు. వైసీసీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం కాబట్టి పులివెందుల వైద్యకళాశాలకు రూ.500 కోట్ల గాను రూ.396 కోట్లు ఖర్చు పెట్టారు. పార్వతీపురానికి రూ.600 కోట్లు అవసరం కాగా, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మిగతావన్నీ కొన్ని పదిశాతం, కొన్ని అయిదు శాతం పనులతో పునాదులకే పరిమితమయ్యాయి. ఈ కళాశాలల్లో బోధనా సిబ్బంది కూడా సగానికి తక్కువగానే ఉన్నారు. కళాశాలల నిర్మాణం పూర్తిచేయకపోవడంతో 500 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రాలేదు.

**ప్రభుత్వందే పూర్తి అజమాయిషీ**

ప్రభుత్వం వద్ద నిధులు లేనందుకు కళాశాలల భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం భావించింది. అలాగే వీటి నిర్వహణకు ఒక్కో కళాశాలకు ఏడాదికి దాదాపు రూ.200 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇదంతా ఆర్థికభారంగా మారడంతో పీపీపీ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలలో ఈ కళాశాలను నిర్మించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. ఈ నిర్మాణ పనులను రెండేళ్లలోగా పూర్తి చేసి, ఈ కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో వైద్యం, మందులు, వైద్యపరీక్షలు ఉచితంగా అందచేస్తామని, ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తామని చెబుతోంది. పేదవాళ్లకు చికిత్సతోపాటు సీట్ల విషయంలో న్యాయం జరిగేలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెప్టెంబరు 23న శాసనసభ సమావేశంలో స్వయంగా వెల్లడించారు. ప్రైవేటుకు ఇవ్వడంలేదని స్పష్టం చేశారు. మొత్తం పడకల్లో 70 శాతం పేదలకే కేటాయించనున్నట్లు చెప్పారు.



Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES,
ANDHRA PRADESH, VIJAYAWADA-520 008

PROSPECTUS / REGULATIONS

FOR ADMISSIONS INTO B.Sc. PARAMEDICAL TECHNOLOGY COURSES UNDER COMPETENT AUTHORITY QUOTA IN THE STATE OF ANDHRA PRADESH FOR THE ACADEMIC YEAR 2024-25.

Application and Processing Fee through online Mode

| | | |
|---|---|---|
| 11.00 AM on 21.11.2024 to 09.00 PM on 09.12.2024 | OC Category | Rs.2360/-(Rs.2000/-+360/-(GST@18%) |
| | SC/ST/BC Categories | Rs.1888/-(Rs.1600/-+288/-(GST@18%) |

| | |
|---|---|
| For Notifications, Notices etc., visit University Website: | https://drntr.uhsap.in |
| For online application, counseling etc. | https://apuhs-ugadmissions.aptonline.in/UGBPT/Home/StudentLogin |

'ఆస్తి ప్రభుత్వానిది.. నిర్వహణ ప్రైవేటుది. బాగా నిర్వహించి, వచ్చిన లాభాలతో అప్పులు చెల్లించి, మిగిలినదానిలో కొంత లాభం వారు తీసుకుంటారు. 33 ఏళ్ల తర్వాత ఆ ఆస్తిని ప్రభుత్వానికి తిరిగిచ్చేస్తారు' అని చంద్రబాబు వివరించారు.

**పెరిగిన కన్వీనర్ కోటా సీట్లు**

పాత వైద్య కళాశాలలో 15 శాతం ఆల్ ఇండియా కోటా, 85 శాతం సీట్లు ప్రభుత్వానికి వస్తాయి. కొత్త వాటిలో ఆల్ ఇండియా కోటా 22 సీట్లు (15శాతం) వెళ్లగా, కన్వీనర్ కోటా 64 సీట్లు (42.5 శాతం), సెల్ఫ్ ఫైనాన్స్ (మేనేజ్మెంట్ కోటా) 45 సీట్లు (29.75 శాతం), ఎస్ఆర్ఎస్ఐ కోటా 19 సీట్లు (12.75) ఉండేలా గత ప్రభుత్వంలో కేటాయించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీలో అఖిల భారత కోటా ఉండదు. కన్వీనర్ కోటా 75 సీట్లు (50శాతం), సెల్ఫ్ ఫైనాన్స్ 53 సీట్లు, ఎన్ఆర్ఐ కోటా 22 సీట్లు ఇచ్చారు. 11 సీట్లు (కన్వీనర్ కోటా) అదనంగా ప్రతి కాలేజీలో ఇస్తున్నారు.

**టెండర్లపై స్టే ఇవ్వలేమన్న హైకోర్టు**

పీపీపీ విధానంలో బోధనాసుపత్రుల నిర్మాణ టెండర్ల ఆహ్వానాన్ని నిలిపివేయాలని కోరుతూ హైకోర్టులో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో హైకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం విధానంలో నిర్మించి నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. అలా నిర్మిస్తే తప్పేమిటి? అనీ ప్రశ్నించింది. పూర్తిగా ప్రైవేటుకు అప్పగించకుండా ప్రభుత్వ భాగస్వామ్యం ఉండడం మంచిదే కదా? అని వ్యాఖ్యానించింది. పీపీపీ విధానంలో ఆసుపత్రులను నిర్మించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని గుర్తుచేసింది. రాజ్యాంగ, చట్టవిరుద్ధ నిర్ణయాల్లో తప్ప ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవని తెలిపింది. ప్రస్తుతం ఈ అంశం విచారణలో ఉంది.

**పీపీపీ స్థాయి సంఘం సిఫార్సు**

దేశంలో వైద్య విద్య వ్యయం భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో వైద్య కళాశాలలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో నిర్వహించే అంశం గురించి ఆలోచించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సుచేసింది. వైద్యకళాశాలలు, ఆసుపత్రిని పీపీపీ విధానంలో నిర్వహించి, అందుకోసం ముందుకువచ్చే కంపెనీలు/సంస్థలకు పన్ను ప్రయోజనాలను కల్పించాలని సూచించింది. పీపీపీ విధానానికి ఎదురయ్యే నిబంధనలను రూపొందించి, ప్రైవేటు మెడికల్ కళాశాలలు, జిల్లా ఆసుపత్రులతో కలసి పనిచేసే విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని పేర్కొంది.

దేశంలో వైద్యవిద్య నాణ్యత గురించి సమాజ్‌వాది పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ నేతృత్వంలోని వైద్యం, కుటుంబ సంక్షేమ వ్యవహారాల స్థాయీ సంఘం ఈనెల 12 పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ఈ మేరకు పేర్కొంది. ఈ స్థాయీ సంఘం గత ఏడాది ఫిబ్రవరి 9న సమర్పించిన నివేదికలో వైద్యవిద్యను అందరికీ అందుబాటులోకి తేవడానికి పీపీపీ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఎలా ప్రోత్సహించాలో కేంద్రానికి సిఫార్సుచేసింది. వాటిపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కూడిన నివేదికను ఇప్పుడు పార్లమెంటుకు సమర్పించింది. పీపీపీ విధానాన్ని ప్రోత్సహించాలన్న సిఫార్సును తాజా నివేదిక పునరుద్ఘాటించింది.



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**

ఓ స్వయంపోషిత రాజ్యంలో.. సైనికుడికి కూడా డిండిమ సహాయ పడుతున్నాడు. కారణం రాజ్యం ఇచ్చే మాస జీతం సరిపోవడం లేదు.

గణపతి, అంకాల ముఖాలు చూసుకున్నారు. ఓ మహారాజు అయిన గణపతి చాలా ఖిన్నుడయ్యాడు.

"మరి ఇంతింత పన్నులు విధిస్తారు. భయపెట్టి వసూలు చేస్తారు. ఆ సొమ్మంతా ఏమి చేస్తున్నట్లు?"

అంకాల సాలోచనగా అన్నాడు.

"వసూలయ్యింది అంతా రాజుగారి కిరీటాలకు, మహారాణి గారి వడ్డాణాలకు సరిపోతుంది. మిగిలితే ఇదిగో ఇలాంటి పనికిరాని కత్తులు కొనడానికి ఖర్చు చేస్తారన్నమాట." అన్నాడు గణపతి.

"అది సరే. ఆ కత్తిని ఏవిటి అలా పిచ్చిమొక్కను విరిచినట్లు విరిచేశావ్ గణా?" అన్నాడు ఆశ్చర్యంగా అంకాల.

"అదొక కత్తా. వీళ్లు ఇచ్చే సొమ్ముకు ఇంతకంటే మంచి కత్తులు ఎక్కడినుండి వస్తాయి. వాటితో అమాయక రైతులను భయపెట్టి పన్నులు వసూలు చేస్తారు గాని యుద్ధానికి పనికిరావు మిత్రమా.."

"సరే సరే.. అసలు డిండిమను ఎక్కడ బంధించారో తెలుసా?"

అప్పుడే బయట కలకలం వినిపించింది. పహారా సైనికులు ఇద్దరూ అప్రమత్తమయ్యారు.

'ఏటయ్యిందేమోనని మావోళ్లు వచ్చేశారు. మేం పోతాం. లేకుంటే మీరెవరో ఆళ్లకు సెప్పాలి. ఈయన మా నాయన దేవరయ. నాయనా.. డిండిమను కాపాడ్డానికి ఒచ్చిరంట. ఈ అయ్యలకు సాయం సెయ్యే.." అంటూ ఇద్దరూ వడివడిగా బయటకు వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లిపోయాక గణపతి, అంకాల మంచంలో దేవర విగ్రహంలా కూర్చున్న ఆ దేవరయ వైపు చూశారు.

ఆయన చటుక్కున మంచం నుండి ఎగిరి దూకాడు. అతన్ని చూసి ఇద్దరూ ఖంగుతిన్నారు. ఆయన కాళ్లు మోకాళ్ల వరకే ఉన్నాయి. ఆయన అలాగే ఆ ఉన్న కాళ్ల పైనే నడుస్తున్నాడు నేలపై మరుగుజ్జులా. మంచం ఎత్తి మూలనున్న గడ్డపార తీసుకుని గదిలో చకచక తవ్వసాగాడు.

కేవలం ఆ గదిలో చిన్నదీపపు వెలుగులో అతడు ఏకాగ్రతతో చకచకా గుంట ఏర్పడేలా నేల తవ్వాడు. ఆ గుంటలో పెద్ద మోకుతాడు.. బలిష్టమైన పెద్ద కొండచిలవలా చుట్ట చుట్టుకుని ఉంది. దానిని దులిపి ఎత్తి నెత్తిన పెట్టుకున్నాడు.

"పదండి.." అంటూ కదిలాడు.

అతడు చకచకా మోకాళ్లపై నడుస్తూ వెళ్లిపోతుంటే తెల్లబోయి చూస్తున్న మిత్రులిద్దరూ గుర్రాలను ఇంటి వెనుక వదిలి అతని వెనుక పరుగు పెట్టారు.

రాత్రి గాఢమైంది. జనం తలుపులు మూసుకుని నిద్రలోకి వెళ్లిపోయారు. పహారా సైనికులు వీళ్లను పట్టించుకోవడంలేదు. చివరికి రాజప్రాసాదం దగ్గరగా చుట్టూ నాలుగైదు మహాభవనాలున్నాయి. వాటిల్లో ఓ భవంతి వెనగ్గా వెళ్లి దాని గోడలను తట్టి చూశాడు. సంతృప్తితో నెత్తిన ఉన్న భారీ తాడుచుట్టను క్రింద పడవేశాడు.

దేవరయ అప్పుడు మొదటసారిగా మాట్లాడాడు. "ఇదే కారాగారం. నేను ఈడ పాతికేళ్లు కాపలా సైనికుడిగా పని చేశా. ఓ అడవి దొంగల ముఠా ఈ పైనుండే పారిపోయారు. నేను వెంటపడి ఆరుగురిని సంపేశా. మిగిలినోళ్లు నా కాళ్లు నరికేశారు. అప్పటి నుండి ఈ పైనున్న రాయి పక్కకి తొలగే ఉంది. ఆ సంగతి నాకే తెలుసు.



డిండిమను కాపాడ్డానికి మీరొస్తే ఆయనగోరి కోసం నేనూ సాయం సెయ్యలని ఒచ్చా.."

ఆ చీకటిలో అతని ప్రతి మాటా కత్తి ప్రహారంలా గణపతి గుండెల్లో గుచ్చుకుంది. ఇద్దరూ దిమ్మెరబోయి చూస్తుండగా దేవరయ భవంతికి దగ్గరగా ఉన్న పెద్దవృక్షం ఎక్కాడు.

"మీలో ఒకరు నాతో రండి. మరొకరు ఈడే ఉండండి.."

ఈ చెట్టు నుండి కారాగారం లోపలనున్న మరో పెద్ద చెట్టుకి మోకు విసిరి దాని సాయంతో కారాగారం లోపలికి దిగిపోయాడు. అతని వెనుక గణపతి కూడా కారాగారంలోకి వెళ్లాడు. మోకు చివరి అంచు నడుముకు చుట్టుకుని అంకాల అక్కడే ఉన్నాడు.

మరో గంట తర్వాత నలుగురూ తిరిగి ఊరి వైపు పరిగెత్తసాగారు.

✻ ✻ ✻

అనుమకొండ రాజప్రాసాదం.

పండిత సమావేశ మందిరం కిటకిటలాడుతోంది.

ఆరోజు చింతన శిబిరం ప్రారంభం. ఈ మందిరం మహారాజుగారి ప్రధాన సమావేశాలు నిర్వహించే మందిరంలా లేదు. ఇతర పెద్ద పెద్ద సమావేశాలు జరగడానికి తగ్గట్లు.. ఎక్కువమంది అందరూ దగ్గర దగ్గరగా కూర్చుని చర్చించుకునేలా నిర్మాణం ఉంది. విశాలంగా ఉన్న ఆ మందిర మంతా.. అరుగుల్లా కొన్ని ఎత్తుగా.. కొన్ని పల్లంగా.. అందరూ బాసింపట్టు లేదా పద్మాసనం వేసుకుని దగ్గర దగ్గరగా కూర్చునేలా ఉంటాయి. అందరూ నేలపై పరచిన చాపలపై.. లేదా మెత్తని కశ్మీరు కంబళ్లపై కూర్చుంటారు. అందరి మాటలు, ఉపన్యాసాలు, వాటిపై అభిప్రాయాలు, ఖండన మండనాలు, అభినందనలు, హాస్యాలు, కోపాలు, వ్యంగ్యం, తిట్లు.. ఒకటేమిటి పండిత చర్చల్లో వినవచ్చే అన్ని అంశాలు అందరికి వినపడేలా.. అర్థమయ్యేలా ఆ మందిర నిర్మాణం ఉంది.

అక్కడ మహారాజు.. ప్రధాని, సర్వసైన్యాధ్యక్షుడు, పండితుడు, నిపుణుడు కూడా ఒక్కలాగే కూర్చుంటారు.

మహాప్రధాని గంగాధరమంత్రి అతిథులు ఒక్కొక్కరిని గణపతిదేవునికి పరిచయం చేస్తుండగా ఆయన వినయంగా తలవాల్చి నమస్కరిస్తూ ఆహ్వానం పలికాడు.

అందరూ విశ్రాంతిగా కూర్చున్న తర్వాతనే ఆయన కూర్చున్నాడు.

అందరికి తగిన వింజామరలు, మంచినీరు, ప్రతివారికి అందుబాటులో ఏదైనా వ్రాసుకోవలంటే కొన్ని తాళపత్రాలతో వ్రాత బల్ల.. ప్రక్కనే ఘంటాలు, సిరా పిడతలు.. కనుసైగతో అడిగింటే తడవుగా

# గణపతిదేవుడు




16

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

ఏదైనా అందించడానికి చురుకైన పరిచారికలు.. వారికి ఆవలగా కొందరు మగ సహాయకులు.. అందరూ జరగబోయే గొప్ప చారిత్రాత్మక చింతనా శిబిరానికి పూర్తిగా సర్వం సిద్ధం చేస్తూ చురుగ్గా పరుగులు పెడుతున్నారు.

మహామహోపాధ్యాయుడు, అపర సరస్వతి రూపం, పుంభావ సరస్వతి, హరిహరతత్వజ్ఞులు, తెలుగుజాతి మరెన్నోతరాల స్మరణీయులు, విక్రమసింహపురి రాజ్య గౌరవ మహామాత్యులు బ్రహ్మశ్రీ తిక్కనామాత్యులను శిబిరానికి అధ్యక్షునిగా నిర్ణయించి వారు అధ్యక్షులుగా ఉండటం తన అదృష్టంగా ప్రకటించాడు చక్రవర్తి.

శిబిరానికి విచ్చేసిన మహామహులంతా హర్షధ్వనాల మధ్య తమ ఏకగ్రీవ ఆమోదాన్ని ప్రకటించారు.

దాదాపు వందమంది వివిధ రంగాలలో నిపుణులైన మహాశాస్త్రవేత్తలు, విషయనిపుణులు, పండితులు, వాణిజ్య శ్రేణి ప్రముఖులు హాజరయ్యారు. కాకతీయ రాజ్య పాలనా ప్రముఖులు, డెబ్బది రెండు నియోగాల అధికారులు, మహాప్రధాని, పదిమంది ప్రధానులు, పాతికమంది అమాత్యులు, మరో పాతికమంది మంత్రులు, మరో యాభై మంది వివిధ రంగాల సలహాదారులు, సామంత రాజులు, మండలేశ్వరులు కూడా హాజరయ్యారు.

ఈ చింతనా శిబిరానికి ఆహ్వానం అందుకున్న వీరంతా భారతదేశ.. ఏదేని రాజ్యంలో పుట్టిపెరిగినా వారి ప్రతిభ వ్యుత్పత్తులు అన్ని రాజ్యాలలో.. కొందరు సహజసరిహద్దులు దాటి అఖండభారత రాజ్యాలలో కూడా గుర్తింపు తెచ్చుకున్నవారు.

మొత్తంగా రెండువందలమంది విజ్ఞానులతో ఆ సభాప్రాంగణం అంతా కిటకిటలాడుతోంది.

తొలుత తిక్కనార్యుడు తన అధ్యక్షోపన్యాసం చేశారు.

“ఇది కలా నిజమా.. తెలియడంలేదు. గతంలో ఇలాంటి ఒక శిబిరం జరిగినట్లు పురాణాలు, వేదాలు, బ్రాహ్మణాలు.. ఏ అర్వాచీన సంప్రదాయ గ్రంథాలలోనూ.. బౌద్ధ, జైన పుస్తకాలోనూ చూడలేదు. భూమండలం ఉన్నంత వరకు చిరస్థాయిగా నిలిచేలా పరిపాలన చేసిన షట్చక్రవర్తులు కూడా ఇలాంటి శిబిరాన్ని నిర్వహించారని నేను చరిత్రలో చదవలేదు. తన పరిపాలన ప్రారంభంలోనే ఇలాంటి శాస్త్ర చర్చ, సమస్త రాజ్య అంశాలు, సహజ వనరులు, రాజ్య లక్షణాలు, ఇందున్న సంపదలు, సమస్యలు తెలుసుకోవాలని ఓ వారసత్వ పాలకుడు కోరుకోవడమే మహా విడ్డూరం. అందుకు మన మహారాజు శ్రీశ్రీశ్రీ గణపతిదేవులవారిని అభినందిస్తున్నాను.

అయితే నా అభిప్రాయంలో మన రాజ్యం.. అంటే కాకతీయ రాజ్యం అనే కదా అర్థం?!.. మరి నేను ప్రాతినిధ్యం వహించే రాజ్యం వేరు. అది విక్రమ సింహపురి రాజ్యం. ఇక్కడి నుండి వేల యోజనాల దూరంలో ఉంది. ఇప్పుడు మనం నా రాజ్యమంచి చెడ్డలు విశ్లేషించాలా.. లేక కాకతీయ రాజ్యమంచి చెడ్డలు విశ్లేషించాలా..?”

అందరూ నిశ్శబ్దం. అయోమయంగా చూశారు.

గణపతిదేవుని ముఖంలోనూ ఆశ్చర్యం కనపడింది. నవ్వుతూ అన్నాడు.

“మహాకవీ.. తమరు చెప్పింది అక్షరాలా నిజం. ఇది మా రాజ్యం. అది మీ రాజ్యం. ఇక్కడున్న పెద్దలు పండితులు వేరు వేరు రాజ్యాల నుండి వచ్చారు. కొందరు ఉత్తరాది నుండి, కొందరు దక్షిణాది నుండి కూడా విచ్చేశారు. కాని ఆ రాజ్యమైనా ఈ రాజ్యమైనా ఏ రాజ్యమైనా.. అక్కడి ప్రజల జీవితాలు, బాధలు, ఇక్కడి ప్రజల బాధలు, ప్రజల బాధలన్ని సమాజ సమస్యలన్ని ఎక్కడైనా ఒక్కటే అని నా అభిప్రాయం. కాబట్టి ఈ చిన్న చిన్నరాజ్యాల సరిహద్దులన్నీ చెరిపేసి మన ప్రజలందర్ని ఏకంచేస్తే ఆ రాజ్యం ఎలా ఉంటుందో.. దాని రూపురేఖలు ఎలా ఉంటాయో ఊహించి ఆ రాజ్యపాలన ఇలా ఉండాలో తమరు చెప్పండి మహాకవీ..!”

రెట్టించిన ఉత్సాహంతో కరతాళధ్వనులతో స్వాగతించారు ప్రముఖులంతా.

మళ్లీ తిక్కన కొనసాగించాడు.

“అద్భుతం మహారాజా! అద్భుతం. నేను కలలు కంటున్నది తెలుగురాజ్యం. తొట్టతొలిగా భాషను ఆధారంగా చేసుకుని ప్రకటిస్తున్న రాజ్యం. ఇప్పటివరకు ఎవ్వరూ భాషాప్రయుక్త రాజ్యం అనే ఆలోచనే చేయలేదు. మా భాష మాట్లాడే వాళ్లంతా ఏక రాజ్యంగా ఉండాలని ప్రవచించిన మహారాజులు గాని, పండితులు గాని, మంత్రాంగ నిష్ణాతులు గాని నా దృష్టికి రాలేదు. భాషారాజ్యం.. తెలుగుభాషా రాజ్యం. అంటే తెలుగు మాట్లాడే ప్రజలందరినీ ఏకంచేసి ఒకే రాజ్యంగా ఏర్పరచాలి. ఇది మనమే కాదు తమిళరాజ్యం, కన్నడ రాజ్యం, మరాఠీ రాజ్యం.. ఇకపై ఇలా భాష ప్రధానంగానే రాజ్యాలను పిలుచుకునే రోజులు రాబోతున్నాయి. అందులో ప్రప్రథమం తెలుగు భాషా రాజ్యం. అదే తెలుగు సామ్రాజ్యం. అదే కాకతీయ సామ్రాజ్యం కావాలి. ఇది నేను కలలు కంటున్నది. దానిని సాధించగల మహావీరులు మీరే అని నా విశ్వాసం. కాబట్టి ఈ చింతన శిబిరం మొత్తం తెలుగు మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలన్నింటిని కలగలిపిన ఓ అద్భుత రాజ్యంగా.. తెలుగు సామ్రాజ్యంగా భావించి.. దాని స్వరూపస్వభావాలను ఆకళింపు చేసుకుని.. అందున్న మంచిచెడ్డలపై ప్రసంగించవలసినదిగా మహాను బావులనందరిని కోరుతున్నాను.”

తిక్కన అధ్యక్షోపన్యాసంతో శిబిర చింతనాపరులకు ఓ స్పష్టత వచ్చింది. అందరి ఆలోచనలూ ఓ స్పష్టమైన హద్దులున్న ప్రాంతాన్ని ఊహించుకుంటూ దానిపై తమ ప్రత్యేక అంశాలకు మెరుగు పెట్టుకుంటున్నారు మనసుల్లోనే. ప్రస్తుత రాజ్యాల వివరాలు, పాలనాంశాలు చెప్పడానికి రాజకీయ ధురంధరుడుగా పేరున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యల్లరౌతును ఆహ్వానించాడు తిక్కన.

“మహా తంత్రజ్ఞులు, మహాకవులు శ్రీశ్రీశ్రీ తిక్కనామాత్యులకు, కాకతీయ చక్రవర్తి గణపతిదేవుల వారికి ప్రణామములు. మొత్తం తెలుగుభాషా



మత్తి భానుమూర్తి

రాజ్యంగా తీసుకుని దానిపై మన చింతనను చర్చించడం ముదావహం. అయితే నేను ప్రస్తుత హద్దులలోపలి రాజ్యాల గురించి చెప్పనా.. హద్దుల లోని రాజ్యాలు, హద్దుల ఆవల రాజ్యాల గురించి చెప్పనా?" అన్నాడు.

శిబిరమంతా మళ్లీ మౌనం. అంటే ఈ అంశంలో కూడా స్పష్టత కావాలని అందరికీ అర్థమౌతోంది.

గణపతిదేవుడు తిక్కనార్యుని వంక చూశాడు.

ఆయన దీర్ఘంగా తలపంకించి, "ముందు అంతర్గత సమస్యలు, తగవులు సరిదిద్దుకుని హద్దులలోని రాజ్యాల గురించి ఆలోచించడం మంచిది మహారాజా.." అన్నాడు.

అందుకు గణపతిదేవుడు కూడా అంగీకారంగా తల ఊపాడు.

అందరూ నిశ్శబ్దమయ్యాక యల్లరౌతు మహారాజుకు, తిక్కనార్యునికి నమస్కరించి ఓ మారు గొంతు సవరించుకుని ప్రారంభించాడు.

"మహాకవులు తిక్కనామాత్యులు ఉద్యమిస్తున్న అంశం తెలుగు భాషారాజ్యం. మొత్తంగా ఓ సామ్రాజ్యం. చిత్ర మేమిటంటే ఇప్పటివరకు సకల భోగభాగ్యాలతో తులతూగుతున్న ఈ తెలుగుసీమను విశాల సామ్రాజ్యరూపంగా పాలించినవారు ఎవ్వరూ లేరు. కారణం ఆ స్థాయి మహావీరులు ఇక్కడ పుట్టకపోవడం. ఆ లోటును భర్తీ చేస్తూ తెలుగు సామ్రాజ్య రూపం స్పష్టమైన మధుర క్షణాన గణపతిదేవుడు లాంటి అచ్చమైన తెలుగువాడు చక్రవర్తిగా ఉండటం మా అదృష్టం. అయితే ఈ తెలుగు భాష మాట్లాడే రాజ్యాలన్నీ చిన్నచిన్నవి. చిన్న చిన్న రాజ్యాలలో సమస్యలు ఇన్ని అన్ని అని చెప్పడానికి మాటలు రావు.

ఒక చిన్న రాజ్యం అష్టైశ్వర్యాలతో తులతూగుతుంటే.. సరిహద్దులో మరో చిన్నరాజ్యం దుర్భర దారిద్ర్యంలో కునారిల్లుతుంటుంది. మొత్తంగా చెప్పవలసివస్తే.. చిన్న రాజ్యాలన్నింటి మధ్య సరిహద్దులు తొలగించి ఓ సామ్రాజ్యంగా చూస్తే ప్రజల్లో తీవ్రమైన ఆర్థిక, సామాజిక వైరుధ్యాలు కనపడుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే చిన్నరాజ్యాల వలననే తెలుగు ప్రజలు దుర్భర దారిద్ర్యంలో ఉన్నారు మహారాజా.."

ఏదో గుర్తొచ్చినట్లు గణపతిదేవుడు చెయ్యెత్తాడు ఆపమన్నట్లు.

శిబిరమంతా పరికించి చూసి ఓ వ్యక్తిని గుర్తించి ముందుకు రావలసినదిగా చేయి ఊపి ఆహ్వానించాడు.

ఆ వ్యక్తి డిండిమ.. డిండిమరాయడు!

"ఆ.. డిండిమా.. ఇప్పుడు మీ అభిప్రాయాలు చెప్పండి. తెలుగు మాట్లాడుతున్న చిన్నరాజ్యాల పాలన ప్రస్తుతం ఎలా ఉంది?.. ప్రజల సుఖశాంతుల సంగతి ఏవిటి??"

**చిన్న చిన్న రాజ్యాలలో సమస్యలు ఇన్ని అన్ని అని చెప్పడానికి మాటలు రావు. ఒక చిన్న రాజ్యం అష్టైశ్వర్యాలతో తులతూగుతుంటే.. సరిహద్దులో మరో చిన్నరాజ్యం దుర్భర దారిద్ర్యంలో కునారిల్లుతుంటుంది. మొత్తంగా చెప్పవలసివస్తే.. చిన్న రాజ్యాలన్నింటి మధ్య సరిహద్దులు తొలగించి ఓ సామ్రాజ్యంగా చూస్తే ప్రజల్లో తీవ్రమైన ఆర్థిక, సామాజిక వైరుధ్యాలు కనపడుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే చిన్నరాజ్యాల వలననే తెలుగు ప్రజలు దుర్భర దారిద్ర్యంలో ఉన్నారు మహారాజా.."**

కూర్చునే అందరికి నమస్కరించిన డిండిమను మేధావులంతా ఆశ్చర్యంగా.. విచిత్రంగా చూశారు. అతనిది పండిత రూపం కాదు. బలిష్టయోధుని రూపం, సాధారణ ఆహార్యం. జీవితానుభవాలతో రాటు తేలిన వ్యక్తిత్వం అతని ముఖంలో తేజరిల్లుతోంది. అక్కడెవ్వరికి డిండిమ ఎవరో తెలియదు. తిక్కనామాత్యునికి కూడా. చక్రవర్తి గణపతిదేవునికి, అంకాల సెట్టికి మాత్రమే తెలుసు.

చక్రవర్తి గణపతిదేవుడు స్వయంగా పరిచయం చేశాడు. "డిండిమ ఇతని పేరు. ఈయన గురించి మీకు ఏమి చెప్పాలి.. ఆ.. దాదాపు పాతికరాజ్యాలు ఇతనికి మరణదండన విధించాయి.."

ఒక్కసారిగా శిబిరమంతా కలకలం. ఇలాంటి వాడు మహారాజుల ఆస్థానంలో.. అందులోనూ కాకతీయ చక్రవర్తి సమావేశంలో ఉండటమే ఆశ్చర్యమని అందరికి లిప్తకాలంలో కలిగిన ఏకాభిప్రాయం.

"డిండిమా.. చిన్నరాజ్యాలలో ప్రజల జీవితాలను చూసిన నీ అనుభవాలు చెప్పు.." అన్నాడు చక్రవర్తి.

డిండిమ గొంతు సవరించుకుని పెద్ద కథ చెప్పబోతున్న కథకునిలా తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.

"నా చిన్ననాడు నేను చూసిన ఓ సంఘటన చెబుతాను.. ఓ నడిరాత్రి నేను మా అమ్మ పక్కలో పడుకుని ఆమె కప్పిన పమిట క్రింద ఆదమరచి నిద్రపోతున్నాను. అప్పుడు హటాత్తుగా ఎవరిదో స్త్రీ ఏడుపులు.. పెడబొబ్బలు. నేను ఉలిక్కిపడి లేచాను. ఎవరో ఆమె హృదయవిదారకంగా ఏడుస్తోంది.. ఎవరో ఇద్దరు ముగ్గురు మగవారి గొంతుకలు ఏవో మంత్రాల్లాంటివి అరుస్తూ చదువుతున్నట్లు వినవస్తున్నాయి. ఆ వినవడేది మొత్తంగా భయపెడుతోందన్నది నిజం.

"అమ్మా.." అన్నానేను మెల్లగా భయపడుతున్నట్లు.

అప్పటికే మా అమ్మ మేలుకునే ఉంది కాబోలు చటుక్కున నన్ను తన వైపు గట్టిగా హత్తుకుంది.

"పడుకో.. పడుకో నాన్నా.. నిద్రపోతండ్రి.." అంది మెల్లగా ఆదుర్దాగా.

ఆమె గొంతు నా చెవికి ఆనుకుని ఉంది కాబట్టి ఆమె స్వరం నాకు తప్ప మరెవ్వరికీ వినపడదు. కాని ఆ వినపడుతున్న స్త్రీ ఆర్తనాదాలు.. 'దేవుడో రక్షించు దేవుడో..' అంటూ ఆమె పెడబొబ్బలు పెడుతూ అరుస్తోంది. ఆ మగ గొంతుకల అరుపులను బట్టి ఆమెను కొందరు మగాళ్లు కొడుతున్నట్లు అర్థమై నాకు భయం ఎక్కువై వణకుపుడుతోంది. నేను అమ్మను మరింత గట్టిగా కరచుకున్నాను. ఆమె నన్ను మరింతగా.. వీలయితే తన లోలోపల దాచుకుని భయం పోగొట్టాలన్న ఆరాటంతో మరీమరీ పొదవుకుంది. ఆమె కళ్ల నుండి కారుతున్న కన్నీరు నా జుట్టును తడుపుతున్నది. ఆ అరువులు ఏడుపులు 'రక్షించు దేవుడో..' అంటూ ఆ స్త్రీ ఎవరో .. దేవుడికి పెడుతున్న దండాలు నాకే కాదు మా అమ్మకు కూడా తెలుస్తూనే ఉన్నాయని నాకు తెలుస్తోంది. 'ఆడ బ్రతుకు..' 'ఆడ బ్రతుకు..' ఆమె పెదవులు వణకుతున్నాయి.

ఎప్పటికో ఆ ఆర్తనాదాలు ఆగిపోయాయి. ఆ మగవాళ్ల భీషణమైన అరుపులు కూడా ఆగిపోయాయి. ఏడ్చి ఏడ్చి అమ్మా, నేనూ ఎప్పుడు నిద్రపోయామో తెలియదు.

ఎప్పటిలాగే ఉదయించింది. ఉలిక్కిపడి లేచాన్నేను. లేచాక బయటకు పరిగెత్తాను. ఆ మా చిన్న గ్రామంలో ఓ విషాద వాతావరణాన్ని నేను మొదటిసారి గుర్తించాను. రెండు డొంకల తర్వాత ఓ వీధిలో ఓ మహిళ.. ఓ అమ్మ.. ఓ అక్క.. ఓ నాన్నమ్మ.. ఎవరైనా కావచ్చు.. మట్టిలో పడి ఉంది.. వివస్త్రగా.. ఆమెపై వేపకొమ్మలు.. ఈగలు. చుట్టూ కుక్కలు. ఆమె చుట్టూ కోసి పెట్టినట్లున్న కోళ్లు, నిమ్మకాయలు. మరేవో కాయలు.. వాటిపై పసుపు కుంకుమ.. వేప కొమ్మలతో కొట్టి కొట్టి ఆమెను చంపేశారు. ఆమె శరీరం ఎర్రగా తోలు తీసిన దూడ పెయ్యలా..

మహాజనులారా.. మహారాజా.. ఆ దృశ్యం ఇప్పటికి ఇదిగో.. ఇక్కడ ఈ గుండెల్లో అలా బ్రతికే ఉంది. అలాంటి హృదయ విదారక స్త్రీ హత్యలు.. మాసానికి ఒకటో రెండో.. మా గ్రామంలో.. చుట్టుప్రక్కల గ్రామాలలో చూస్తూనే పెరిగాను. ఆమెకు దెయ్యం పట్టిందట.. ఆ దెయ్యాన్ని వదిలించే ప్రక్రియలో ఆమె ప్రాణాలు పోయాయట. చస్తే చచ్చింది. ఆ భర్తకు మరో ముగ్గురు పెళ్లాలున్నారట. ముందు ఊళ్లో దెయ్యం పారిపోయిందట. ఈ దయ్యాలను వదలగొట్టే మహానుభావులకు గ్రామ గ్రామం బ్రహ్మరథం పట్టడం ఎంత దారుణం.."

చెప్పడం ఆపాడు డిండిమ. అతని పెదవులు

అదురుతున్నాయి. కళ్లు తడితడిగా మెరుస్తున్నాయి. అనుమానం లేదు అతనిలో ఆ దృశ్యం ఇప్పటికి బ్రతికే ఉంది.

ఆ మందిరమంతా పూర్తి నిశ్శబ్దం ఆవరించింది.

ఆయన చెప్పిన ఈ సన్నివేశం అక్కడున్న అందరికి స్పష్టంగా తెలుసు. మౌనంగా ఉన్నా ఆ అమాయక స్త్రీల హత్యల పట్ల ఎవ్వరికీ సానుభూతి లేదు. కారణం అందరూ దెయ్యాలను, భూత ప్రేత పిశాచాలను నమ్ముతున్నారు. ఒకరిద్దరు నమ్మని హేతువాదులున్నా వాళ్లు నిస్సహాయులు.

ప్రతి గ్రామం ఈ వికృత నమ్మకాలతో నిండి ఉన్నదన్నది ఇక్కడున్న ప్రతి మేధావికి, పాలక వీరులకు, మహా రాజుకు సైతం తెలుసు.

ప్రతి గ్రామంలో చదువుకున్న బ్రాహ్మణ కుటుంబాలుంటాయి. చాలా మంది చదువుకుని సమాజానికి మంచి చెబుతూ గ్రామ సౌభాగ్యానికి సహాయంగా నిలబడతారు. మరి కొందరు దైవభక్తి ద్వారా గ్రామ ప్రశాంత జీవనాన్ని కాపాడుతుంటారు. కొందరు ఈ దెయ్యాలు, భూత ప్రేత పిశాచ క్షుద్రపూజల ద్వారా అమాయక గ్రామీణులకున్న సమస్యలను తొలగించడానికన్నట్లు తతంగం నిర్వహిస్తుంటారు. కేవలం బ్రాహ్మణ వర్గాలు మాత్రమే కాదు, గ్రామ దేవతల పూజారులైన వృత్తిదారుల్లో కొందరు కూడా ఈ క్షుద్ర దేవతలను కొలుస్తూ పూజలు నిర్వ హిస్తుంటారు. ఆనాటి రాత్రి విన్న ఆ మహిళ ఆర్తనాదాలు ఆ చిన్ననాడే నాలో హేతుబద్ధతకు బీజాలు వేసింది. హేతువు దృక్కోణంలో చేసే నా ఆలోచనలే నన్ను పోరాటానికి సిద్ధం చేశాయి. అందుకు నేను ఆ భూత ప్రేత పిశాచ దెయ్యాల క్షుద్ర పూజారి వర్గాలకు ప్రధాన శత్రువునయ్యాను.”

అందరూ మౌనంగా విన్నారు. ఒకరిద్దరూ అభినందనగా చప్పట్లు కొట్టారు కాని ఆ శబ్దం చాలా బలహీనంగా వినపడుతోంది.

“మరో ఉదంతం చెబుతాను మహారాజా..” అన్నాడు డిండిమ.

ఆ.. చెప్పండి..” అన్నాడు గణపతిదేవుడు. అందరూ ఆ క్షుద్ర పూజల ఉదంతం నుండి బయటపడ్డారు.

“అప్పుడు నా వయసు పదేళ్లు ఉండవచ్చు.

నేనొక పెరికె వ్యాపారి కొడుకును. మా తండ్రికి పాతిక ఎడ్ల బళ్లు ఉండేవి. కొందరు వైశ్యులు, బలింజలు మా బళ్లపై వాళ్ల సరుకులతో బిడారు వెళ్లేవారు.

అలా ఓసారి ఓ వైశ్యుని బిడారుతో నేనూ ఓ బండి తొట్లో కూర్చు ని హుషారుగా ఎడ్లను తోలుతూ బండిని పరిగెత్తిస్తున్నాను. ఆ రహదారులు దారుణంగా ఉన్నాయి. బండిచక్రాలు నడిచే గాలు మొత్తం పెద్ద గోతులతో పాతాళం కనిపిస్తోంది. పాపం చాలా శ్రమ కోర్చి అలాగే ఆ బాటలో.. ఇంత లోతు బురదలో.. నా చేతిలోకి చేర్నాకోలాతో దెబ్బలు తింటూ ఎద్దులు బండి లాగుతున్నాయి. నిజా నికి మా ఈ బిడారు చాలా చిన్నది. కేవలం పాతిక అంటే పాతికే బళ్లు ఉన్నాయి. వాటి వెంట ఆయా సరుకులు అమ్మకానికి తెచ్చిన వైశ్యులు ఉన్నారు. అప్పటికి చీకటి పడింది. రానురానూ చీకటి మరింత చిక్కబడుతోంది. బిడారు దట్టమైన అడవిలోకి ప్రవేశించింది. చీకటి ముదిరాక కళ్లకు ఏమీ కనబడటం లేదు. అసలు సమస్య బాట.. రహదారి. అది భయంకరంగా ఉంది. ఎద్దులు ఆ బండిగాలులో మోకాలులోతు బురదలో బండి లాగ లేకపోతున్నాయి. అప్పుడు ఆ చీకటిలో హటాత్తుగా ఫెళఫెళా శబ్దం. అది బండిచక్రం బురదలో కూరుకుపోగా బలంగా లాగడం వల్ల అది విరిగిన శబ్దం. అందరూ బళ్లు ఆపేసి ఆ విరిగిన బండి వద్దకు వెళ్లాం. ఆ బండి ఎద్దులు కూడా ప్రక్కకు ఒరిగిపోయి చావు భయంలో ఉన్నాయి. ముందు వాటిని బండి నుండి విడదీసి కాపాడారు. అందరూ.. మా నాన్న, వణిజులు, పెరికెలు.. అందరూ ఆ బాటలో వాళ్లు పడుతున్న బాధలు, ఇబ్బందులు చెప్పుకుంటూ తిట్టుకుంటున్నారు.

ఎవరిని తిడుతున్నారో నాకు అర్థం కాలేదు. ఒక దారిబాట బాగులేనప్పుడు ఎవరిని తిట్టాలి. ఆ బాటను బాగు చేయాల్సిన వారెవ్వరూ.. ప్చ్.. ఏమో ఆ ప్రశ్నకు జవాబు అప్పటికి ఇప్పటికి నాకు తెలియదు మహారాజా.

అప్పుడే మరో ఘోరం జరిగిపోయింది.

(సశేషం)

## జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

**ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.**

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ప్లేస్టోర్‌లో **Jagriti Weekly** అని సర్చ్ చేయండి లేదా పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నెమ్, పాస్ వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.

3 మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.

4 Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.

5 Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.

6 Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.

7 మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

**– మేనేజర్**



# మానవత

**పదే పదే అదే పనిగా ఎంతోమంది పలికే పదం 'మానవత'. అది ఏమిటో, ఎక్కడుంటుందో కొంతమందికి మాత్రమే అనుభవపూర్వకంగా తెలుసు. ఆ అనుభవాన్ని ఆచరణకి తెచ్చేవారు వేళ్లమీద లెక్కపెట్టేంతగా ఉంటారు. నిజానికి మానవతా దినోత్సవమంటూ ఒకటుంది, దాని గురించి తెలిసినా, తెలియకున్నా, ప్రతీరోజూ ఎవరో ఒకరిని ఆదుకోనిదే నిద్రపట్టనివారు అతికొద్దిమంది!**

**అసలైన మానవత్వం అంటే అభిమానమే అందరికీ!**

**అయితే ఆ 'అసలు'లో దాగిన సిసలైన అర్థం అర్థమయింది ఎందరికి?**

**(అంటూ కరుణభావంతో ఆక్రోశించింది ఏనాడో కవి హృదయం).**

**ఎన్ని వాదాలున్నా, మార్గాలు కనిపిస్తున్నా- సేవా మార్గమే మిన్న. ఆ మార్గాన వెళ్లడమే తప్ప, మరి ఇంకేదీ తెలియని, మరో లోకమంటూ ఉండని కొందరు వనితల గురించి ఇప్పుడు!**

అదొక నగరం. రాత్రిళ్లు చలి చంపేస్తోంది. ఉన్నవారు, మధ్య తరగతివారు, కూడూ, గూడూ ఉన్నవారైతే సరే. మరి తిండికి లేని, ఒంటిమీద కప్పుకోవడానికి గుడ్డలేని, నిలవడానికి ఏ ఆధారమూ లేని నిరుపేదల స్థితి? వాళ్లు ఎవరికి కావాలి? వాళ్లమీద ఎవరికి జాలి?

ఇలా ఎప్పుడూ ఆలోచన చేసే ముగ్గురు అతివలు ఆ నగరం శ్రీకాకుళంలో ఉన్నారు. బ్యాంకులో పనిచేసే ఉద్యోగిని గౌతమి, ఆస్పత్రిలో నర్సుగా బాధ్యతలు నిర్వర్తించే కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయిని గా ఉన్న సౌజన్య. జీవిత అనుభవాలు, మదిలోపలి ఆదర్శాలు వీరిలోని సేవాభావనను ఎప్పటికప్పుడు తట్టిలేపుతూనే ఉన్నాయి.

ఒకరోజు రాత్రి... సేవాసంస్థ రెడ్‌క్రాస్ కీలక ప్రతినిధి నుంచి వాట్సప్ సమాచారం వచ్చింది. అదీ స్టేటస్‌లో.

నగర ప్రాంతంలోని వంతెన దిగువన ఒక అవ్వ పడి ఉందనేది ఆ సందేశ సారాంశం. 'రోజుల తరబడి ఆహారంలేదని ఆమెను చూడగానే అర్థమవుతోంది. అస్తిపంజరమా? అనిపిస్తోంది. కూడూ, గూడూ కరవై 'ఇవాళో రేపో' అన్నట్లుంది. గజగజ వణికించే చలితో నరకాన్నే చూస్తోందామె. ఇప్పుడే గమనించాను. స్త్రీలు ఎవరైనా తక్షణం స్పందిస్తే, ఆ వృద్ధురాలి ప్రాణం పోకుండా కాపాడినట్లవుతుంది. ఏ ఒక్కరైనా ముందుకొస్తే చాలు.'

ఇదీ ఆ మెసేజ్. నగరంలోని ఎంతమంది ఆ సమాచారం చూశారో, చదివినారో లేదో కూడా తెలియదు. కానీ – ఆ ముగ్గురు స్త్రీ మూర్తుల్లో ఒకరు వెంటనే చలించిపోయారు. దయాభావం ఉప్పొంగిన స్థితిలో 'నేను ఉన్నా' అని ఆ ప్రతినిధికి బదులిచ్చారు.

మరి కాసేపట్లోనే 'నేను సైతం' అంటూ మరొక అతివ నుంచి స్పందన. ఇంకొద్ది సేపటికి వేరొకరి నుంచి కూడా!

సేవాసంస్థ ప్రతినిధి మరింత చొరవగా, మరెంతో నిబద్ధతగా, ఇంకెంతో బాధ్యతాయుతంగా కదిలొచ్చారు. ఉమాశంకర్ అనే పేరున్న అతని వల్లనే ముగ్గురు మగువలూ ఆ వంతెన ప్రాంతానికి చేరుకున్నారు. అంతా కలసి వెళ్లి చూసేసరికి....

రోడ్డుమీద దీనాతిదీనంగా, హృదయవిదారక స్థితిలో కనిపించింది ఆ ముసలమ్మ. ఏ మాత్రమూ కదలిక లేదు. ఒంటిమీద చీర ఉండీ లేనట్లుంది. శరీరానికి పురుగులు పట్టిన పరమ దుర్భర దశ!

అంతలోనే రెడ్‌క్రాస్ ప్రతినిధి నుంచి అందిన సమాచార ఫలితంగా, మరికొందరు దయార్ద్ర హృదయులూ అక్కడికి చేరారు. ఆ నిర్భాగ్యురాలి దరికి చేరి, సపర్యలు సాగిస్తూనే, ఎంతో కొంత ఆహారమిచ్చారు. తినే స్థితిలోనూ లేదు ఆమె! నీళ్ల తాగేంత ఓపికా లేదు తనకి.

ఆ వృద్ధురాలిని అక్కడి నుంచి నెమ్మదిగా లేపి, కదలిక తెప్పించడం ఎలా? ఏం చేయాలి ఇప్పటికిప్పుడు?

ఈ ప్రశ్నకు సమాధానంగా ముగ్గురు అతివలూ (గౌతమి, కృష్ణవేణి, సౌజన్య) ముందడుగు వేశారు. ఆమె శరీరంమీద ఉన్న పురుగులను జాగ్రత్తగా తొలగించారు. వాహనంలో తెచ్చిన నీటితో శరీరాన్ని శుభ్రపరిచారు. దుస్తుల్ని మార్చి, ఎంతో కొంత ఉపశమనం కలిగించ గలిగారు.

ఇప్పుడు ఆ అభాగ్యురాలిని ఎక్కడికి తీసుకెళ్లాలి? ఆమె ప్రాణాల్ని ఏ విధంగా పరిరక్షించాలి? అసలిప్పుడు చేయాల్సిందేమిటి? అక్కడి స్త్రీ, పురుష సేవాపరాయణులు ఆలోచనలో పడ్డారు. నిమిషాల వ్యవధిలో ఒక నిర్ణయానికి వచ్చారు. వారి నుంచి సమీప పోలీసు ఠాణాకు వివరాలు చేరాయి. పోలీసుల అనుమతి వచ్చింది. ఆ వెంటనే ఆ అవ్వను వాహనంలో శ్రీకాకుళం నుంచి పలాసకు తరలించే ఏర్పాటు!

వారందరూ కలిసికట్టుగా ఆమెను ఆ వాహనం లోకి చేర్చి, పలాస సేవాసంస్థ (లలిత ట్రస్టు)

ఆశ్రమానికి బయల్దేరారు. అంతమంది తన చుట్టూ చేరి, అండదండగా ఉండటంతో, వృద్ధురాలికి కాస్తంత దిటవు ఏర్పడింది. కొద్దికొద్దిగా మాట్లాడటం మొదలు పెట్టింది. ముగ్గురు అమ్మాయిలూ అడిగినవాటికి జవాబులివ్వడం ఆరంభించింది.

'నాది ఫలానా ఊరు. పిల్లలున్నారు. పెంచి పెద్ద చేశాను, ఆడా, మగా వారందరి బాగోగులూ చూశాను, వయసు పెరిగి, శరీర అనారోగ్యం కలిగి, బాధపడుతున్న నన్ను ఏం చేయాలని చూశారో తెలుసా?

వదిలించుకోవాలని సిద్ధమయ్యారు కొడుకులూ కూతుళ్లూ!

ఒకరోజున నన్ను ఇక్కడికి (శ్రీకాకుళం) తెచ్చి, వంతెన దగ్గరికి చేర్చి, 'ఇక్కడే ఉండు, ఇప్పుడే వస్తాం' అని చెప్పి వెళ్లిపోయారు. అప్పటి నుంచీ నేను....

చెప్పడం ఆపింది అవ్వ. ఆ అమ్మాయిల కళ్లు వర్షిస్తున్నాయి. కళ్లలో నీళ్లు ఇంకిన స్థితి ముసలావిడది!

పిల్లలు ఎవరి కంట్లో నలక పడినా, కాలికి ముల్లు గుచ్చుకున్నా ముందుగా తానే విల్లవిల్లాడుతుంది తల్లి. పసి బిడ్డల దశ నుంచి నోటికి అందించే ప్రతీ చేతి ముద్దలో తన ప్రాణముంటుంది. ఎన్ని కలవరాలు, ఇంకెన్ని కలవరాలు? ఎన్నెన్ని చుట్టుముట్టినా ఆవిడ

# ా వనిత



కళ్లకి పిల్లలు ఎప్పుడూ పసివాళ్లే!

కానీ ఆ బిడ్డలు చేస్తోందేమిటి? గూడుపుఠాణీ చేసి, తీసుకొచ్చి, ఏ దూరప్రాంతంలోనో రోడ్డుమీద / రోడ్డు ప్రక్కన వదిలేసి వెళ్లిపోవడం. 'ఇప్పుడే వస్తాం. ఇక్కడే ఉండు' అనడమే తప్ప తిరిగొచ్చేదీ లేదు. తల్లి బతికి ఉందో లేదో చూసేదీ అసలే ఉండదు. వదిలేసి వెళ్లిపోవడం అంటే శాశ్వతంగా వదిలించు కోవడం.

అయినా తల్లి తెలుసుకోలేదు. గూఢార్థం గ్రహించలేదు. పిచ్చి నమ్మకంతో ఎదురుచూస్తూనే ఉంటుంది ఎప్పటికీ! 'మా వాళ్లు వస్తారు' అనుకుంటూ అంటూ రోజులు గడిపేస్తుంటుంది. అవన్నీ ఆమె పాలిటి చివరి రోజులే!

పలాస ఆశ్రమం అక్కున చేర్చుకుంది. అవ్వను సంరక్షించేందుకు నడుం కట్టింది. కొన్ని రోజులు గడిచాక ఈ లోకం నుంచి అన్న పానీయాలు లేక, ఎండా వానా చలిని తట్టుకోనూ లేక, దిక్కూ మొక్కూ లేక పైలోకం చేరుకుంది.

ముగిసిపోయింది జీవితం! సొంత బిడ్డలు ఈసడించి నడిరోడ్డు పాలు చేసినా, నోరు తెరిచి ఒక్క మాట అయినా అనని పిచ్చి తల్లి!

ఆమెకి అసలు పిల్లలెవరు? వాళ్లా, వీళ్లా?

బిడ్డల్లా ఉందీ, ఆదుకుందీ ఈ ముగ్గురే కదా!

అవ్వ కన్నుమూసిందని తెలియగానే, మరుక్షణమే తల్లడిల్లింది గౌతమి మది. కోలుకునేందుకు ఎన్నో రోజులు పట్టింది. అనుబంధం అనే పదానికి అర్థం గురించే ఆ పడతి ఆలోచనంతా!

'ఏది పుణ్యమో తెలిసింది నాకు. అవ్వని కొన్నాళ్లయినా ప్రాణంతో ఉంచగలిగానన్న సంతృప్తే మిగిలింది నాకు. జీవితానికి ఇటువంటిది చాలు. దీనికి సేవ అనే పేరు పెట్టడం నాకైతే ఇష్టం ఉండదు. నేను అనుకున్నది చేయగలిగాను. దీని గురించిన ఎటువంటి ప్రచారాన్నీ కోరుకోను. అసలు మనం చేసిన ఏ మంచి పనైనా మనకి ఇచ్చే సంతృప్తి అనంతం. అంతే! అంటూనే తన సేవాభావ నేపథ్యాన్ని వివరించారిలా....

'అనారోగ్య మహమ్మారి మా కుటుంబ పెద్దల్నీ పట్టి ఉక్కిరిబిక్కిరి చేసేసింది. అమ్మకు చూపులేదు. జీవితం గురించిన లోతైన చూపు మాత్రం ఎంతగానో ఉంది. ఆమె నన్ను చూడలేకపోయినా, నా జీవన ఉన్నతిని తొలి నుంచీ అంతర్ నేత్రంతో చూసింది. ఎన్నెన్నో జీవిత పాఠాలు నేర్పింది. నాన్న నన్ను రాకుమారిలా చూసుకున్నారు. అపురూపంగా పెంచి పెద్ద చేశారు. నా కుడి ఎడమ వైపుల్లో నిలిచింది అమ్మా నాన్నలే! వారి పెంపకం నన్ను అన్ని విధాలా తీర్చిదిద్దింది.

మావారు మరెంతో. అన్నీ మనం అనుకున్నట్లే జరిగితే, అది జీవితం ఎందుకవుతుంది చెప్పండీ? కారుణ్య నియామకం అనేలా ఆయన తాలూకు ఉద్యోగ పని నాకు లభించింది. నన్ను మా అమ్మా నాన్నా బాగా చూసుకున్నట్లే– నేనూ ఇప్పుడు నా సంతానాన్ని కంటికి రెప్పలా చూసుకుంటున్నా. ఎవరైనా బాధలో ఉండటం చూస్తే తట్టుకోలేను. వారు ఎవరైనా, ఎక్కడ ఉన్నా నాకు తోచిన సాయం చేయకుండా ఉండలేను. నా చిన్నారి పిల్లలకీ ఇదే అలవాటు చేస్తూ వస్తున్నా.

నాది చిన్న ఉద్యోగమే. ఆర్థిక స్థితి పరిమితమే. అయినప్పటికీ, నాకు ఉన్నదాంట్లో ఎంతో కొంత మొత్తాన్ని దీనుల కోసమే ఉపయోగిస్తాను. అవసరం ఉన్న ఎవరికైనా సాయం చేయడంలో ముందు వరసన




ఉంటా. ఇది నాకు బరువు కాదు. ఇష్టమైన బాధ్యత. ఎంతైనా చేస్తాను. కళ్లుతెరిచి చూడాలే కానీ– ఎన్నెన్ని విషాదాలు? అన్నం లేక, నీళ్లూ దొరక్క నకనకలాడే వాళ్లు ఎంతోమంది కనిపిస్తుంటారు. ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ చలికి వణుకుతూ, నానా విధాలా అలమటిస్తుంటారు. ఉన్నంతలో వాళ్లను ఆదుకోలేమా? అందరినీ కాకపోయినా, మన దృష్టికి వచ్చిన కొందరి పరిస్థితినైనా ఎంతో కొంత మెరుగుపరచలేమా? కావాల్సింది సాయపడే మనసు. అది మనం అనుకుంటే వస్తుంది' అంటుంటే గౌతమి కళ్లు మెరిశాయి.

గౌతమి, కృష్ణవేణి, సౌజన్య. ఇలాంటి కరుణ హృదయులు ఇంకొందరు ఉన్నారు. నిరుపేదరాలైన, నిండు గర్భిణి అయిన ఒకరు ఇదే శ్రీకాకుళం నగరంలో–అన్నమూ, నీళ్లూ కరవై అల్లాడుతుండటాన్ని ఒక విద్యాలయ వ్యవస్థాపకులు ఉమాదేవి, పద్మజ గమనించి సకాలంలో సాయం అందించారు. గర్భిణీగా, అంత సంక్లిష్ట సమయంలో... విపరీత చలిలో కటిక నేలమీద నిద్రించడాన్ని చూసి చలించిపోయారు.

కొంత ఆహారం, కొన్ని దుస్తులు, అవసర సామగ్రిలో కొన్నింటిని అందించారు. దీన్ని మానవత్వం అంటారో, మరేమైనా పేరు పెడతారో మాకైతే తెలియదు. తెలుసుకోవాలనే మాకు అనిపించదు. సాటి మనిషిగా ఏం చేయాలో అదే చేశాం. ఈ సంతృప్తి సరిపోతుంది. ఈ జీవితానికి ఇదే చాలనీ అనిపిస్తుంది. మనిషికి మనిషి కాకుంటే మరెవరు సాయం చేస్తారు' అంటారు వాళ్లిద్దరూ. మానవతకు ప్రతీకలు ఈ వనితలు!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

**మన దేశ జనాభా 140 కోట్లను మించినది, అందులో కార్మికశక్తి 56.3 కోట్లవరకు ఉంటుందని, ఈ కార్మిక శక్తిలో అధికులు అంటే 53.5 కోట్ల మంది ఏదో ఒక ఉద్యోగం ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే సంఘటిత రంగంలో ఉపాధి కలిగిన వారి సంఖ్య 6 కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక సర్వే పేర్కొన్నది. కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగుల సంఖ్య 48.67 లక్షలు మాత్రమే. అందులో అత్యధికులు రైల్వేలోనే ఉపాధి పొందుతున్నారు. ఇది కాక అన్ని రాష్ట్ర ప్రభుత్వాలలో కలిపి ఉద్యోగుల సంఖ్య 1.4 కోట్లవరకు ఉంటుందని అంచనావేశారు. వీరు కాక అనేక మంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఔట్‌సోర్సెస్ (పొరుగు సేవల) ద్వారా అతి తక్కువ వేతనానికి పనిచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మన దేశంలో పెన్షన్ విధానం అమలులో ఉండేది. ఆ విధానం ప్రకారం ఉద్యోగి పదవీ విరమణ లేక సేవానివృత్తి అయినప్పుడు వారి చివరి నెల జీతంలో సగం పెన్షన్‌గా చెల్లిస్తారు. ఇవి కాక ఉద్యోగులకు కరవు భత్యం పెంచినప్పుడల్లా అదే పద్ధతిలో ఈ పెన్షనర్లకు డియర్‌నెస్ రిలీఫ్ ఇస్తారు.**



# ఉద్యోగుల
# పెన్షనర్లే

ఉద్యోగులకు వేతన సవరణ జరిపినప్పుడు ఉద్యోగులతో సమానంగా పెన్షనర్లకు వారి పెన్షన్ సవరణ చేసి ఉద్యోగులకు వేతన సవరణ అమలు జరిపిన తేదీ నుంచి పెన్షనర్లకు కూడా సవరించిన పెన్షన్ అమలు చేయటం జరుగుతున్నది. పెన్షనర్లలో వయోవృద్ధులకు వారి వయసును బట్టి అదనపు పెన్షన్ ఇస్తారు. దానినే అదనపు క్వాంటమ్ పెన్షన్ అని పిలుస్తారు. ఉదాహరణకు తెలంగాణలో అదనపు పెన్షన్ వివరాలు పట్టికలో చూడవచ్చు.

| వయసు | శాతం (మూలపెన్షన్‌లో) |
|---|---|
| 70 - 75 | 15 |
| 75 - 80 | 20 |
| 80 - 85 | 30 |
| 85 - 90 | 40 |
| 90 - 95 | 50 |
| 95 - 100 | 60 |
| 100 సం॥ పైనవారికి | 100 |

ఈ అదనపు పెన్షన్‌పై కూడా డియర్‌నెస్ రిలీఫ్ చెల్లిస్తారు. వేతన సంఘం సవరణలు జరిగినప్పుడు ఈ అదనపు పెన్షన్ కూడా సవరిస్తారు. ఒకవేళ ఏ కారణంవల్ల అయినా పెన్షనర్ మృతి చెందితే వారి కుటుంబానికి కుటుంబ పెన్షన్ ఇస్తారు. ఈ కుటుంబ పెన్షన్ ఉద్యోగి భార్య లేక భర్తకు వారు జీవించిన కాలానికి చెల్లిస్తారు. ఒకవేళ వారిపై ఆధారపడిన సంతానం (స్త్రీ లేక పురుషులు) వారి వయసు 25 దాటేంతవరకు వారికి పెన్షన్ చెల్లిస్తారు. అంతేకాదు ఒకవేళ ఆ పెన్షనర్‌పై ఆధారపడిన సంతానంలో ఎవరికైనా వైకల్యం ఉంటే వారి జీవితకాలం కాని, వారికి ఉద్యోగం వచ్చేవరకు కాని పెన్షన్ చెల్లిస్తారు. ఆ తరువాత పెళ్లికాని ఆడపిల్లలు కాని, వితంతువులు అయిన సంతానం కాని ఆ పెన్షనర్‌పై ఆధారపడి ఉంటే వారి జీవితకాలం కాని లేక వారికి ఉద్యోగం వచ్చేవరకు కాని పెన్షన్ చెల్లిస్తారు. ఈ కుటుంబ పెన్షన్ విధానాన్ని వినియోగించుకుని కొంతమంది వయోవృద్ధులైన పెన్షనర్లు తమ కంటే చాలా చిన్న వయసువారిని మరో వివాహం చేసుకుని తమ తదనంతరం ఆ స్త్రీకి పెన్షన్ వచ్చేట్టుగా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జరిపిన ఒక అధ్యయనంలో 75 సంవత్సరాలు పైబడిన పెన్షనర్లు 20 ఏళ్ల వయసున్న మహిళలను కేవలం పెన్షన్ ఆశచూపి పునర్వివాహం చేసుకుంటున్నారని తేలడంతో సేవా నివృత్తి అనంతరం పెన్షనర్ ఎవరైనా పునర్వివాహం చేసుకోవాలంటే ప్రభుత్వ అనుమతి పొందాలనే నిబంధన తెచ్చారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య కంటే పెన్షనర్ల సంఖ్య అధికం. కేంద్రంలో ఉద్యోగుల సంఖ్య 48.67 లక్షలమంది కాగా పెన్షనర్ల సంఖ్య 69 లక్షలవరకు ఉంటుందని 2024-25 బడ్జెట్‌లో ఆర్థికమంత్రిత్వ శాఖ వివరించింది. వీరికి పెన్షన్లు చెల్లించటానికి 2023 సంవత్సరంలో రూ.2.40 లక్షల కోట్లకు పైగా ఖర్చుచేస్తుంది. ఈ ఖర్చు ఆ ఏటికా ఏడు గణనీయంగా పెరుగుతున్నది. 2025 జూన్ మాసాంతానికి కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఖ్య వివరాలు పట్టికలో చూడవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వాలలో పెన్షనర్ల సంఖ్య వివరాలు సాధికారికంగా లభించనప్పటికి అందు బాటులో ఉన్న గణాంకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలలో సేవానివృత్తి పొంది పెన్షన్లు పొందుతున్నవారి సంఖ్య కోటికి పైగా ఉంటుందని అంచనా. 2022-23లో దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్న ఉద్యోగుల పెన్షన్లే రూ.4,52,100 కోట్లు. ఈ రాష్ట్రాలకు తమ స్వంత పన్ను ఆదాయం (SOTR) క్రింద 2022-23లో వచ్చిన ఆదాయం రూ.1,26,98,675 కోట్లు. అందులో దాదాపు 26 శాతానికి మించి కేవలం తమ పూర్వ ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించటానికే ఖర్చు చేయాల్సి వస్తున్నది. రాష్ట్రాలు తమ స్వంత పన్ను ఆదాయంలో అధిక భారం కేవలం తమ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీలకే ఖర్చు చేయాల్సి వస్తున్నది. 2022-23లో దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు జీతాభత్యాలు క్రింద రూ.6,65,351 కోట్లు, వడ్డీలకు గాను రూ.4,46,198 కోట్లు, పెన్షన్లకు రూ.4,52,100 కోట్లు వెరసి రూ.15,63,649 కోట్లు ఖర్చుచేయాల్సి వచ్చింది. దీనికి పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలు కలిపితే రాష్ట్రాలకు వచ్చే SOTRకు మించి పోతున్నది. ఇటువంటి పరిస్థితి వస్తుందని మన దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు జరిపినప్పుడే నిపుణులు అంచనావేశారు. వారి సూచనల మేరకు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పెన్షన్లపై అధ్యయనాలు చేయించి వాటి ఆధారంగా తమ సిబ్బందికి చెల్లించే పెన్షన్ విధానంలో మార్పులు చేయకపోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందనే హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానం స్థానంలో జాతీయ పెన్షన్ పథకం

| | సంఖ్య | ఖర్చు (రూ.కోట్లలో) |
|---|---|---|
| సివిలియన్ పెన్షనర్లు | 11,91,956 | 64,684.44 |
| డిఫెన్సు పెన్షనర్లు | 34,23,266 | 1,21,983.90 |
| టెలికామ్ పెన్షనర్లు | 4,79,335 | 14,895.00 |
| రైల్వే పెన్షనర్లు | 14,95,722 | 51,935.24 |
| పోస్టల్ పెన్షనర్లు | 2,81,848 | 785.82 |
| **మొత్తం** | **68,72,127** | **2,54,284.40** |



# కంటే
# ే ఎక్కువ

అనే కొత్త విధానాన్ని 2004 నుంచి అమలు చేస్తున్నాయి.

మన దేశంలో 1990-91లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షన్ ఖర్చు రూ. 2138 కోట్లు కాగా 2024కు అది గణనీయంగా పెరిగి రూ. 9,60,000 కోట్లకు చేరింది. ఒక్క కేంద్ర ప్రభుత్వ పెన్షన్ల వ్యయమే 1990, 2000 దశకాలలో 21 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) చొప్పున పెరిగింది. గత 30 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ పెన్షన్ల వ్యయం దాదాపు 60 రెట్లు పెరిగింది. కొన్ని రాష్ట్రాలలో ఇది అంతకంటే ఎక్కువగా ఉంది. దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కలిపి మొత్తం ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కోసం చేసే ఖర్చు కన్నా తమ పూర్వ ఉద్యోగులకు చెల్లించే పెన్షన్లే ఎక్కువ. 2022-23లో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 4,52,100 కోట్లు ఖర్చు చేశాయి. అదే ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమానికి చేసిన ఖర్చు రూ. 2.75 లక్షల కోట్లు. పెన్షన్ల వ్యయం మోయలేని భారంగా మారి ఇబ్బందులకు గురిచేస్తు న్నందున అప్పటి వాజపేయి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న యశ్వంత్‌సిన్హా 2001-02 బడ్జెట్‌లో కేంద్ర పెన్షన్ల వ్యయం భరించలేని స్థాయికి చేరిందని అందువల్ల పెన్షన్ విధానాన్ని అమూలాగ్రం సమీక్షించి కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి నూతన విధానాన్ని వర్తించే విధంగా చేయవలసిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. తదనుగుణంగా జూన్, 2001లో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ ఫిబ్రవరి, 2002లో తమ నివేదిక అందిం చింది. ఆ నివేదిక ఆధారంగా 2003-04 అప్పటి ఆర్థిక మంత్రి జస్వంత్‌సింగ్ నూతన పెన్షన్ విధానాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ నూతన పెన్షన్ విధానం కేంద్ర ప్రభుత్వంలో 2004 నుంచి చేరే ఉద్యోగులకు వర్తించేలా అమలు జరిపారు. అయితే రక్షణ రంగానికి మాత్రం ఇది వర్తించకుండా చేశారు. అయితే ఈ నూతన పెన్షన్ విధానానికి అనుగుణంగా ప్రభుత్వం పెన్షన్ రూల్స్‌లో మార్పులు మాత్రం వెంటనే చేయలేదు. 2018లో కాగ్ ఈ ఎన్‌పీఎస్‌పై తనిఖీ చేసి ఇచ్చిన నివేదికలో నిబంధనల రూపకల్పన ఆవశ్యకతను గుర్తించి త్వరితగతిన తగిన నిబంధనలు రూపొందించి అమలుచేయాలని సూచించింది. ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులు చేసేముందు సేవా నివృత్తి అయిన ఉద్యోగులకు తమ వేతనంలో (సగటు చివరివేతనంలో) కనీసం సగం లేక అంత కన్నా ఎక్కువ పెన్షన్ వచ్చేలా సూచించింది. అయితే తమ అంచనాలను ప్రతి రెండు సంవత్సరాలకు ప్రభుత్వం సమీక్షించి, ఈ పథకం కింద పదవీ విరమణ చేసేవారికి కనీసం 50 శాతం పెన్షన్ వచ్చేలా ప్రభుత్వ కంట్రిబ్యూషన్‌లో మార్పులు చేయాలని కూడా సూచించింది. ఒక రకంగా చూస్తే 2003-04లో ప్రవేశపెట్టిన జాతీయ పెన్షన్ విధానం, ఒక్క ఉద్యోగుల కంట్రిబ్యూషన్స్ మినహా మిగిలిన అన్ని అంశాలలో పూర్వ విధానంలో ఉద్యోగులకు లభించే సొమ్ముకు తగ్గకుండా ఇంకా మెరుగైన లబ్ధి చేకూరే విధంగా ఆ పథకాన్ని రూపొందించారు. ఈ విధానంలో ఉద్యోగి తమ వేతనంలో 10 శాతం ఈ ఎన్‌పీఎస్‌కు కంట్రిబ్యూషన్ చెల్లించవలసి ఉంటుంది. ప్రభుత్వం అంతకు సమానంగా కాని అంతకంటే ఎక్కువగా కాని ప్రతి నెల కంట్రిబ్యూషన్ చెల్లించవలసి ఉంటుంది. ఇలా చేసిన కంట్రిబ్యూషన్‌కి నిపుణుల ఆధ్వర్యంలో పెట్టుబడులు పెట్టి, వారు చేసిన కంట్రిబ్యూషన్‌పై సరసమైన రాబడి వచ్చేట్టుగా చూస్తారు. తమ వంతు పెట్టుబడులపై ఎంత లాభం వచ్చిందో ప్రతి ఉద్యోగికి తెలిసేలా పారదర్శక విధానం అమలు జరిపారు. ఉద్యోగికి 60 సంవత్సరాలు నిండిన అనంతరం సేవానివృత్తి అయినప్పుడు ఆ ఉద్యోగి తమ జీతం నుంచి మొత్తం ఎంత చెల్లించారు. ప్రభుత్వం వారి పక్షాన ఎంత చెల్లించింది, ప్రతి సంవత్సరం ఈ సొమ్ముపై ఎంత వడ్డీ లేదా లాభం వచ్చిందో గణించి, దానిలో కనీసం 40 శాతం వారికి పెన్షన్ రూపంలో ఇవ్వటానికి Annvities క్రింద బదలాయించి మిగిలిన 60 శాతం సొమ్మును వారికి తిరిగి చెల్లిస్తారు. ఈ పథకం క్రింద నెలకు 30వేల రూపాయల జీతం (మూలవేతనం+ కరవుభత్యం) కలిగిన వ్యక్తి 30 సంవత్సరాలు ఎటువంటి పదోన్నతులు లేకుండా పనిచేసి సేవా నివృత్తి అయితే వారికి అధమపక్షం నేటి అంచనాల ప్రకారం 1.30 కోట్ల రూపాయలు అందులో 40 శాతం అంటే 52 లక్షల రూపాయలు Annvities క్రింద మార్చినా వారికి వారి జీతంలో 60శాతానికి పైగా పెన్షన్ వస్తుంది. ఇదికాక వారికి మరో రూ. 78 లక్షలు కనీసం వస్తాయి కాబట్టి, వాటిపై నెలకు కనీసం 43వేల రూపాయలు వడ్డీ వస్తుంది. ఇది పాత పెన్షన్ విధానం కన్నా ఎక్కువ లబ్ధి చేకూరుస్తుందని తెలియ జేయడానికి పెద్దగా ఆర్థిక నైపుణ్యం అవసరంలేదు. ఈ విధానం గత విధానం కంటే మెరుగైనది అనుకుంటే ప్రభుత్వం పూర్వవిధానం ఎందుకు రద్దుచేసినట్లు అనే అనుమానం కలగవచ్చు.

గత విధానంలో ఉద్యోగి పదవిలో ఉన్నప్పుడు, అటు ప్రభుత్వం కాని, ఉద్యోగికాని పెన్షన్ చెల్లింపుల కొరకు ఎటువంటి మదుపు చేయలేదు. కాబట్టి పదవీ విరమణ అనంతరం పెన్షన్ చెల్లింపు ప్రభుత్వానికి అదనపు భారంగా మారింది. అంతేకాక గత విధానంలో ఉద్యోగులకు వేతన సవరణ చేసిన ప్రతిసారి పెన్షన్‌లో కూడా మార్పు చేయవలసి రావటం మరో భారం. ఇది కాక ఉద్యోగులు నిబంధనలను తమకు అనుకూలంగా అన్వయించుకుని ఆ మేరకు అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి తమకు అనుకూల వాదనలు వినిపించి న్యాయస్థానాల జోక్యంతో మరింత అధిక పెన్షన్ పొందే అవకాశం పొందారు. దీనివల్ల కొంతమంది తమ పదవిలో ఉన్నప్పుడు తీసుకున్న వేతనం కంటే అధికంగా పెన్షన్ పొందగలుగుతున్నారు. ఉదాహరణకు ప్రభుత్వంలో ఒక ఉన్నతాధికారి 2005లో రాష్ట్రంలో అత్యున్నత పదవి నుంచి పదవీ విరమణ చేశారనుకోండి. అప్పుడు వారి పెన్షన్ వారి జీతంలో సగం అనగా 26వేల రూపాయలలో సగం 13వేల రూపాయల పెన్షన్ దానిపై డీఏ వచ్చేది. అనంతర కాలంలో 6వ వేతన సంఘం సిఫార్సులు అమలు జరిపినప్పుడు పాత జీతాన్ని 1.86తో గణించి దానిని సవరించిన వేతనంగా పరిగణించారు. ఆ సూత్రం ప్రకారం



13వేలు పెన్షన్ పొందుతున్న ఆ మాజీ అధికారి పెన్షన్‌ను సవరిస్తే వారి సవరించిన పెన్షన్ 24,180 అవుతుంది. దానిపై వారికి డీఏ వస్తుంది. 2009లో అదే పదవిలో పదవీ విరమణ చేసిన వ్యక్తి పెన్షన్ అతని జీతంలో (80వేల రూపాయలు) సగం 40 వేలుగా నిర్ణయింపబడుతుంది. అప్పుడు 2005లో పదవీ విరమణచేసి పెన్షన్ పొందుతున్న వ్యక్తి తను కూడా అదే స్థాయిలో పదవీ విరమణ చేశాను కాబట్టి తన పెన్షన్ కూడా 40వేలకు పెంచాలని వాదించి తమకు అనుకూల నిర్ణయాన్ని పొంది తన పెన్షన్ పెంచేలా ఉత్తర్వులు తెచ్చుకుంటున్నారు.

ఇక 2018లో అదే స్థానం నుంచి పదవీ విరమణ పొందిన వ్యక్తి అప్పటికి 7వ వేతన సంఘం సిఫార్సులు అమలు జరిగాయి కాబట్టి అతని తాత్కాలిక జీతం (రూ॥2,25,000)లో సగం 1,12,500 రూపాయలు పెన్షన్ పొందారు. పెన్షన్‌దారులకు కూడా ఉద్యోగులతో సమానంగా పూర్వ వేతనం నుంచి నూతన వేతన సవరణకు నిర్దేశించిన ఫార్ములా ప్రకారం 40వేల పెన్షన్‌ను 2.56తో గణించి రూ॥1,02,400లుగా 2005లో, 2009లో పదవీ విరమణ పొందిన అధికారుల పెన్షన్‌ను సవరించి నప్పటికీ 2018లో పదవీ విరమణ చెందిన అధికారికి నిర్ణయించబడిన రూ॥1,12,500 పెన్షన్‌తో సమంగా సవరించాలని ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇలాంటి పద్ధతులు మొదట్లో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవలంబించి పెన్షన్ సవరణ ఉత్తర్వులు తెచ్చుకు న్నారు. కాలక్రమంలో ఇతర అధికారులు కూడా న్యాయస్థానాలను ఆశ్రయించి తమకు కూడా అదే పద్ధతిలో పెన్షన్ సవరించటంతోపాటు, బకాయిలు కూడా చెల్లించాలని ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇటువంటి ఉత్తర్వులు అమలు జరిపితే ప్రభుత్వంపై (కేంద్ర ప్రభుత్వంపై) అదనంగా రూ॥25వేల కోట్ల రూపాయలకు పైగా భారం పడుతుండటంతో ఇటీవలి ఆర్థికమంత్రి పార్లమెంటులో చట్ట సవరణ ద్వారా పెన్షన్లను సవరించి, వాటిని వర్తింప చేయటంలో ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ఉండేలా ఇటువంటి పెన్షన్ సవరణల అమలు నిలువరించే అధికారం పొందారు. ఈ సవరణను ప్రతిపాదించి నప్పటి నుంచి పెన్షనర్లు వ్యతిరేకించారు. అయితే దేశ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం మాత్రం ఆ



సవరణ చేసేసింది. పెన్షన్ పొందటానికి నిబంధనల ప్రకారం కనీసం కొంత సర్వీసు ఉండాలి. అయితే కొంతమంది ఈ కనీస సర్వీసు అవ్వకముందే వేరే (ప్రభుత్వేతర) పదవిలో ఉద్యోగం సాధించి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేస్తారు. అటువంటివారికి వారు ప్రభుత్వంలో పనిచేసిన కాలానికి పెన్షన్ చెల్లించే పద్ధతి అమలులో ఉన్నది. 2004 తరువాత ప్రభు త్వంలో చేరినవారికి ఈ నిబంధనలేవి వర్తించవు. వారికి జాతీయ ఫించన్ పథకం విధానంలో వారు మదుపు చేసుకున్న సొమ్ము ఆధారంగా పెన్షన్ ఇస్తాయి. ప్రభుత్వం కూడా ఉ ద్యోగి, ఉద్యోగం చేస్తున్న సమయంలో పెన్షన్ వాటాను చెల్లిస్తారు. కాబట్టి దానిని జీతంలో భాగంగా భావిస్తారు, సేవానివృత్తి అనంతరం ప్రభుత్వం ఎటువంటి చెల్లింపులు చేయదు కాబట్టి, ప్రభుత్వంపై ఎటువంటి భారం ఉండదు. ఈ జాతీయ పెన్షన్ విధానం కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకే కాక ప్రైవేటు ఉద్యోగులు కూడా తమ ఇచ్ఛానుసారం వాడుకోవచ్చు. ఈ విధానంలో ప్రభుత్వ ఉద్యోగులకు వారి జీతంతో 10శాతం ప్రభుత్వ వాటాగా చెల్లించేవారు, 2019 అనంతరం కేంద్ర ప్రభుత్వం దానిని 14 శాతానికి పెంచింది. ఉద్యోగి మాత్రం 10 శాతం వాటానే చెల్లిస్తారు. ప్రభుత్వం 14 శాతం చెల్లిస్తుంది. మార్చి, 2024 నాటికి ఈ పథకం క్రింద ఎంతమంది నమోదైనారు, వారు మదుపుచేసిన సొమ్ము వివరాలు ఈ పట్టికలో చూడవచ్చు

| | సభ్యుల సంఖ్య | వారి మదుపు విలువ కోట్ల రూపాయలలో |
|---|---|---|
| కేంద్ర ప్రభుత్వం | 26.07 లక్షలు | 3,22,215 |
| రాష్ట్ర ప్రభుత్వం | 65.96 లక్షలు | 5,82,673 |
| కార్పరేటు రంగం | 19.48 లక్షలు | 1,66,729 |
| ఇతర పౌరులు | 35.64 లక్షలు | 59,826 |
| **మొత్తం** | **147.15 లక్షలు** | **11,31,443** |

ఈ ఎన్‌పిఎస్ విధానం అమలు చేసిన అనంతరం ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. అందులో ప్రధానమైనవి, ఈ పథకం క్రింద చేరిన ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ విధానంలోని వారితో సమానంగా గ్రాట్యూటి చెల్లించేలా వే, 2009 నుంచి అమలు జరిపారు. అలాగే ఈ విధానం లోని ఉద్యోగి ఉద్యోగంలో ఉన్నప్పుడు మరణిస్తే వారి కుటుంబానికి పాత పెన్షన్ విధానం ప్రకారం కుటుంబ పెన్షన్ పొందే వెసులుబాటు కలిగించారు. అయినప్పటికి ఉద్యోగ సంఘాలు మాత్రం ఈ ఎన్‌పీఎస్‌ను వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. కొన్ని రాజకీయ పార్టీలు కూడా వాటికి మద్దతు ఇస్తున్నాయి. కేవలం అధికారమే లక్ష్యంగా రాజకీయ లబ్ధి పొందటానికి ఈ పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజల సంక్షేమ, రాష్ట్ర దీర్ఘకాల ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకో కుండా తమ ఎన్నికల మానిఫెస్టోలలో ఎన్‌పీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని ప్రకటించాయి. వాటి ఆధారంగా కొన్ని రాష్ట్రాలలో ఈ ఎన్‌పీఎస్ విధానం రద్దుచేసి పాత విధానం వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చాయి. కాని ఆ రాష్ట్రాల ఆర్థిక స్థితి మాత్రం ఆ విధానం కొనసాగించటానికి అనుకూలంగా లేదు. ఈ నిర్ణయం ప్రకారం చెల్లింపులు చేయటానికి కనీసం 8 నుంచి 10 సంవత్స రాలు పడుతుంది కాబట్టి ఆర్థికపరమైన అంశాలు అప్పటి ప్రభుత్వాలు చూసుకుంటాయిలే అన్న ధోరణిలో వ్యవహరించాయి. ప్రభుత్వోద్యోగులలో నెలకొన్న అసంతృప్తిని తొలగించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ స్థానంలో ఏకీకృత పింఛను పథకం –యూపీఎస్‌ను ప్రవేశపెట్టింది. యూపీఎస్ క్రింద ఉద్యోగి చివరి సగటు జీతంలో 50శాతం పెన్షన్‌ను 25 సంవత్స రాల సర్వీసు చేసిన వారందరికి చెల్లిస్తారు. 10 నుంచి 25 సంవత్సరాల లోపు సర్వీసు ఉన్న వారికి దామాషా పద్ధతిలో పెన్షన్ చెల్లిస్తారు. ఈ పెన్షన్‌ను ద్రవ్యోల్బణం ఎంత పెరిగితే అంత పెంచుతారు. దీంట్లో ప్రభుత్వం వాటా 18శాతం చెల్లిస్తారు (ఎన్‌పీఎస్‌లో 14 శాతం). ఉద్యోగి రిటైర్ అయిన ప్పుడు అతనికి సర్వీసు ఆధారంగా జీతంలో 10శాతం ప్రతి ఆరు మాసాల సర్వీసు ఆధారంగా గణించి చెల్లిస్తారు. ఈ యూపీఎస్ లోకి ఉద్యోగులు ఐచ్ఛికంగా చేరవలసి ఉంటుంది. యూపీఎస్‌లో ఉన్నవారు తమ సర్వీసులో ఒకసారి ఎన్‌పీఎస్‌లోకి మారటానికి అవకాశం ఉంటుంది.

యూపీఎస్ విధానాన్ని ఎన్‌పీస్‌తో పోల్చినప్పుడు పదవీ విరమణ చేసిన రోజున గణించేపెన్షన్ కొంత మేరకు తక్కువగా ఉంటుంది. కాని యూపీఎస్ లోని పెన్షన్ కరవు భత్యం పెరిగినట్టు ద్రవ్యోల్బణం మారినప్పుడల్లా పెరుగుతుంటుంది. అదే ఎన్‌పీఎస్‌లో అయితే ఒకసారి నిర్ణయించిన పెన్షన్ స్థిరంగా ఉంటుంది. ఈ ఎన్‌పీఎస్‌లోనూ, యూపీఎస్ లోనూ ఉద్యోగి రిటైర్ అయినాక పెన్షన్ చెల్లించే భారం ప్రభుత్వంపై ఉండదు. భవిష్యత్తు ప్రభుత్వాలపై పెన్షన్ భారం పెరగకుండా, ఉద్యోగుల సాంఘిక భద్రతలకు ప్రాధాన్యం కల్పించే క్రమంలో ఈ పథకాలను అమలు చేయటం జరిగింది.

**– సాయి, ఆర్థిక నిపుణులు**

**హిందూఫోబియా, వలస బానిసత్వం నిలువెల్లా కలిగి ఉన్న కొంతమంది మేధావులు, సోషలిస్టులు వృద్ధి మందగమనానికి హిందూత్వతో ముడిపెట్టారు. ఈ భావ దారిద్ర్యానికి నిజమైన దోషులు సోషలిస్టులు, వారికి ఊతమిస్తున్న పెద్దలు అవుతారు.**

# వృద్ధి మందగమనంపై హిందూ ముద్రను తిరస్కరిద్దాం



ఇది వలసరాజ్యాల కాలం నాటి దుష్ప్రచారం. 100 దేశాలలో నివసిస్తున్న 200 కోట్ల మంది హిందువులను ఏదో ఒక కారణంతో ఎగతాళి చేసే హక్కు ఎవరికీ లేదు. 1950లు, 1980ల కాలంలో భారత్ వృద్ధి మందగమనానికి లేదా 3.5 శాతం తక్కువ జీడీపీ వృద్ధికి హిందూత్వ కారణమని తేల్చడం హిందూ ధర్మం పట్ల ఉన్న ద్వేషాన్ని తేటతెల్లం చేస్తున్నది.

ఇటీవల జరిగిన హిందూస్తాన్ టైమ్స్ వార్షిక నాయకత్వ సదస్సులో, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హిందూత్వ ఆధారంగా ఆర్థిక వృద్ధి మందగమనాన్ని అంచనా వేయడం వెనుక వలసవాద మనస్తత్వాన్ని సరిగ్గానే ఎత్తి చూపారు.

ఆర్థిక పురోగతి, అభివృద్ధి మందగమనానికి హిందూత్వను ఎందుకు ఆపాదించాలి అనేది పెద్ద ప్రశ్న. కొంతమంది మేధావులు హిందువులను వేలెత్తి చూపడానికి అవమానకరమైన వ్యాఖ్యలను, పక్షపాత ప్రణాళికను ఎందుకు చేస్తారు?

భారత్ గత రెండు దశాబ్దాల కాలంలో ఏడు నుండి ఎనిమిది శాతం వృద్ధి సాధించడానికి ఈ హిందువులే కారణమనే విషయాన్ని స్వయంప్రకటిత మేధావులు, ఆర్థికవేత్తలు ఎందుకు విస్మరిస్తున్నారు?

కొంతమంది మేధావులు అంటిపెట్టుకున్న వలసవాద బానిస మనస్తత్వం వృద్ధి మందగమనానికి హిందూత్వతో ముడిపెట్టి ఉండవచ్చు. ది ఆక్స్‌ఫర్డ్ కంపానియన్ టు ఎకనామిక్స్ ఇన్ ఇండియా ప్రకారం, ఆర్థికవేత్త రాజ్ కృష్ణ 1982లో అప్పటి 3.5 శాతం ఆర్థిక వృద్ధిని స్వాభావిక సాంస్కృతిక దృగ్విషయంతో అనుసంధానించడానికి ప్రయత్నించారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఫ్యాకల్టీ సభ్యుడైన రాజ్ కృష్ణ హిందువులు పెద్దగా ఆలోచించరు, ఆశయం లేకుండా నిశ్చింతగా ఉంటారు అంటూ నిందలు వేశారు.

సరే, రాజ్ కృష్ణ లేదా అతని శిష్యుల వాదనలు నమ్మదగినవి కావు. ఆయన ఉద్దేశపూర్వకంగా, ప్రణాళిక ప్రకారం తప్పు చేసి ఉండవచ్చు. ఇందిరా గాంధీ లేదా నెహ్రూ కాలంలో ఆర్థిక పురోగతి, అభివృద్ధిని అంచనా వేయడానికి స్వీకరించిన నమూనాలలోనూ, ఏలుబడిలోనూ సోషలిజమ్ ప్రభావం ఎక్కువగా ఉండేది. 1991లో ఆర్థిక సంస్కరణలు ఆవిష్కృతమయ్యేంత వరకు, ప్రభుత్వ నియంత్రణలు అత్యంత దారుణంగా ఉండేవి. వృద్ధిని అణచివేసేవి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో స్వేచ్ఛా వాణిజ్యం, వ్యాపారాలు, వ్యక్తుల స్ఫూర్తిని గొంతు నొక్కడం ఆనవాయితీగా ఉండేది. పాలనా నమూనా కూడా సోషలిస్ట్ స్వభావాన్ని సంతరించుకుని ఉండేది. కమ్యూనిస్ట్ సామ్రాజ్యం లాగా ప్రధానమంత్రి దగ్గర ఎక్కువ అధికారం కేంద్రీకృతమై ఉండేది.

భారత్‌లో సామాజిక-ఆర్థిక అభివృద్ధి గొంతు నొక్కారని, పేదరికంపై పోరాటాన్ని హిందువులు నెమ్మదిస్తున్నారని ఆరోపించడం అత్యంత బాధాకరమైన విషయం. 2023లో ఆర్థికవేత్త రఘురామ్ రాజన్ వృద్ధి రేటు మందగమనంతో హిందూత్వాన్ని అనుసంధానించడంపై చర్చను పునరుద్ధరించారు.

సెప్టెంబర్, 2025తో ముగిసిన త్రైమాసికంలో, భారత్ ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం విస్తరణను నివేదించింది. దేశంలో దాదాపు 65 కోట్ల మంది ఉద్యోగాలు చేస్తున్నారు.

అదే విధంగా, 2024-25లో ప్రపంచవ్యాప్తంగా 7.3 శాతం వృద్ధి రేటును నివేదించిన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. ఇది జీ-20 దేశాలలో అత్యధిక వృద్ధి రేటుగా నమోదైంది. చైనా, ఇండోనేషియా దేశాలు వరుసగా 5.3 శాతం, 5.1 శాతంతో రెండవ, మూడవ స్థానంలో నిలిచాయి. ఇటలీ, కెనడా వంటి దేశాలు కొన్ని త్రైమాసికాల్లో తమ ఆర్థిక వ్యవస్థలలో హెచ్చుతగ్గులను నివేదించాయి. జర్మనీ 0.2 శాతం బలహీనమైన వృద్ధితో పిరమిడ్ దిగువన ఉందని నివేదించబడింది.

భారత్ అద్భుతమైన ఆర్థిక పనితీరుకు సాంస్కృతిక, నాగరికత లేదా ధార్మిక ముద్రను ఎందుకు వేయడంలేదు? ఇది హిందూఫోబియా మనస్తత్వం కాకపోతే మరేమిటి? స్వయం ప్రకటిత మేధావులు ఆర్థిక పురోగతి లేకపోవడం లేదా నెమ్మదించడానికి హిందూ కోణాన్ని ఎందుకు తీసుకువచ్చారు? ఈ హిందూఫోబియా మనస్తత్వం ఫలితంగా 'హిందూ వృద్ధి రేటు' అంతర్జాతీయంగా విద్యావేత్తలు, ప్రజల నమ్మకాని చూరగొంది. తద్వారా భారత్, హిందువులు అభివృద్ధికి అసమర్థులనే తప్పుడు భావనను ప్రేరేపించింది. ఆ భావనను బలోపేతం చేసింది.

నాగరికత ముద్రను వేయడం లేదా హిందువులను సోమరిపోతులుగా లేదా ఆధునికత లేనివారిగా తప్పుగా చిత్రీకరించడాన్ని తిరస్కరించాలి. నిజానికి, మొదటి నాలుగు దశాబ్దాలలో స్వీకరించిన సోషలిస్ట్ విధానాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థను నిద్రాణస్థితిలోకి నెట్టివేశాయి.

భారత్ స్వేచ్ఛాయుతమైన, సరళమైన, ఊహించదగిన విధాన నమూనాలో సామర్థ్యాన్ని ఆవిష్కరించడం ద్వారా ఉన్నత శిఖరాన్ని అధిరోహించగలదు. భారతీయ మార్గంలో వృద్ధిని మరింత వేగవంతం చేయడానికి వలసవాద మనస్తత్వం నుండి బయటపడటం, కాలం చెల్లిన సోషలిస్ట్ సిద్ధాంతాలను తిరస్కరించడం తప్పనిసరి.



**కె.ఎ.బదరీనాథ్**
**డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్,**
**సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్**
**హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.**



# బాంగ్లా.. మైనారిటీ

**2024లో జరిగిన విధ్వంసానికి జెన్‌జీ ఉద్యమమని పేరు పెట్టారు. ఇప్పుడు ఏ పేరు లేకుండా కేవలం విధ్వంసంతో ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నది ఆ దేశం. ఇదంతా భారతదేశం మీద పగతో బాంగ్లాదేశ్ అనే ఆ చిన్న దేశం తనను తాను దహనం చేసుకుంటున్నది. డిసెంబర్ 19 రాత్రి మొదలైన హింసాకాండ ఇందుకు తార్కాణంగా నిలుస్తుంది. జెన్‌జీ పేరుతో షేక్ హసీనాకు వ్యతిరేకంగా నిరుడు తలెత్తిన తిరుగుబాటు, హింసాకాండ, విధ్వంసకాండలకు వెనుక ఉన్న షరీఫ్ ఉస్మాన్ హాది అనే విద్యార్థి, యువ రాజకీయ నాయకుడిని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపడంతో తాజా అల్లర్లు మొదలయినాయి. ఈ అల్లర్లకు ఉద్యమమనీ, అది జెన్‌జీ తరానిదనీ ఎవరూ వీరావేశంతో వ్యాఖ్యానించకపోవడమే గమనించదగిన అంశం. ఇది ముస్లిం మతోన్మాద వర్గాల నాయకత్వంలో నడుస్తున్నదని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అసలు వాస్తవం.**

బాంగ్లాదేశ్‌లో ఇప్పుడు ఏ అల్లరి జరిగినా దాని వెనుక అసలు ఉద్దేశం హిందువుల మీద దాడి కోసమేనన్నది సుస్పష్టం. చట్టోగ్రామ్ అనే చోట ఉన్న భారత మిషన్ కార్యాలయం మీద రాళ్లు రువ్వారు. తరువాత భారత్ అక్కడి వీసా కేంద్రాన్ని మూసి వేసింది. విధ్వంసకారులు 'ప్రోథమ్ ఆలో', 'డెయిలీ స్టార్' అనే రెండు పత్రికలకు నిప్పు పెట్టి ప్రచురణను నిలిపివేశారు. హాది రక్తం వృథా కాదంటూ ఆ పచ్చి భారత వ్యతిరేకి మీద బాంగ్లా పాలకులు పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. దేశం మంటల్లో ఉన్న సంగతి కంటే అతడికి నివాళి ఘటించడానికే ఎక్కువ శ్రద్ధ చూపారు. బాంగ్లా తాజా అల్లర్లు కూడా మైనారిటీ హిందువులను, క్రైస్తవులను, బౌద్ధులను లక్ష్యంగా చేసుకున్నాయి. వారిని, ముఖ్యంగా హిందువులను ఊచకోత కోస్తున్నారు. శాంతిభద్రతలు అన్నమాటే ఆ దేశంలో ఆశించలేనిదిగా ఉంది. హసీనాను దేశం నుంచి పంపించిన తరువాత శాంతిని స్థాపించడంలో తాత్కాలిక ప్రభుత్వ నేత యూనస్ దారుణంగా విఫలమయ్యారు. ఫలితం– మైనారిటీల ఊచకోత, బాంగ్లా మీద మతోన్మాదుల పిడికిలి మరింత బిగియడమే.



షరీఫ్ ఉస్మాన్

ఢాకాలోనే, ఒక మసీదు నుంచి బయటకు వస్తుండగా ముసుగులు ధరించిన వ్యక్తులు డిసెంబర్ 12న హాది మీద కాల్పులు జరిపారు. మొదట ఢాకాలోను తరువాత సింగపూర్‌లో వైద్యం అందిస్తుండగా 18వ తేదీ రాత్రి హాది చనిపోయాడు. ఆ సాయంత్రమే అతడి మృతదేహం బాంగ్లాకు చేరింది. మరునాడే బాంగ్లాదేశ్ దగ్ధకాండ మొదలయింది. ఉద్రిక్తతల మధ్య పార్లమెంట్ భవన ప్రాంగణంలోని సౌత్ ప్లాజాలో డిసెంబర్ 20న అంత్యక్రియలు జరిపారు. అంత్యక్రియల తరువాత కూడా హాది అభిమానులు పార్లమెంట్ భవనంలోకి చొరబడడానికి ప్రయత్నించారు. కానీ పోలీసులు నిలువరించారు. ఇదంతా ఏమిటి? షేక్ హసీనాకు ఆశ్రయం కల్పించిన భారత్ మీద పగ మాత్రమే కాదు, బాంగ్లాదేశ్‌ను మతరాజ్యంగా తక్షణం మార్చడం కూడా.

ఈ అల్లర్లను అడ్డం పెట్టుకుని పాత పగలతో దీపూచంద్ర దాస్ అనే దుస్తుల తయారీ కర్మాగారం కార్మికుడిని సాటి కార్మికులు దైవ దూషణ చేశాడంటూ అతి కిరాతంగా చంపారు. బాంగ్లాదేశ్ హిందు, బౌద్ధ, క్రైస్తవ ఐక్య సమితి ఈ హత్యను తీవ్రంగా గర్హించింది. నిజానికి దీపూ హత్య తాజా హింసలో తొలి ఘట్టం అనుకోవచ్చు. డిసెంబర్ 19న మిగిలిన చోట్ల విధ్వంసం విస్తరించింది. 18వ తేదీ రాత్రే దీపూను సాటి కార్మికులు హత్య చేశారు. బాంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకుడొకరి ఇంటికి తాళం పెట్టి తగులబెట్టడంతో ఏడేళ్ల బాలిక చనిపోయింది. దీపూ హత్యకు సంబంధించి మొత్తం పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. బాంగ్లాలో ఉద్యమాల పేరుతో మతోన్మాదం ఎంత చెలరేగిపోతున్నదో డిసెంబర్ 19వ తేదీన గోవిందదాస్ అనే రిక్షా కార్మికుని మీద జరిగిన దాడి కూడా తెలియచేస్తున్నది. అతడు 'రిసెర్చ్ అండ్ అనాలిసిస్ (రా)' ప్రతినిధి అంటూ ఒక మూక వచ్చి దాడి చేసింది. నిజానికి అతడి చేతికి హిందువులు సాధారణంగా ధరించే ఎర్రదారం కనపడడమే దాడికి అసలు కారణమని చెబుతున్నారు. ఝునైదా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. ఈ నిరసనలలోనే బాంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకుడు ఒకరి ఇంటిని ఆందోళనకారులు తగులబెట్టారు. ఇంటికి బయట తాళం వేయడంతో లోపల ఏడేళ్ల బాలిక సజీవ దహనమైంది. మరొక ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. లక్ష్మీపూర్ సదర్ దగ్గర డిసెంబర్ 20 అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది.

విద్యార్థుల మద్దతుతో షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఇంక్విలాబ్ మంచ్ నాయకుడు హాది. 32 ఏళ్ల హాది కరుడుగట్టిన భారత వ్యతిరేకి. 2024 ఆగస్ట్‌లో షేక్ హసీనా దేశం నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకున్న సంగతి ఇతడిని నిలవనీయడం చేసింది. కొద్దిసేపు గడిస్తే అప్పుడే ఆమెను చంపేవారని కూడా అప్పుడు వార్తలు వచ్చాయి. అప్పటి నుంచి ఇతడు పూర్తి భారత వ్యతిరేకిగా మారాడు. టీవీలలో, బయట జరిగే ఇతడి కార్యక్రమాలను చూసి దేశమంతటా అభిమానులు ఏర్పడ్డారు. అదే సమయంలో వ్యతిరేకులు కూడా పెరిగారు. జెన్‌జీ పేరుతో నిరుడు జరిగిన హింసాకాండలో 1400 చనిపోవడానికి హసీనా కారణమని చెబుతూ ఆమెకు నవంబర్‌లోనే ఆ దేశ న్యాయస్థానం మరణదండన విధించింది.

దేశంలోని అన్ని రాజకీయ పక్షాలు హాది మరణం పట్ల సంతాపం ప్రకటించాయి. కుట్రదారులను వెంటనే పట్టుకోవాలని ఆ పార్టీలు తాత్కాలిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. హాది మరణం దేశానికి తీరని లోటు అని తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనుస్ వ్యాఖ్యానించారు. డిసెంబర్ 20న హాది మృతికి సంతాపసూచకంగా దేశంలో సెలవు ప్రకటించారు. ఫిబ్రవరిలో తలపెట్టిన ఎన్నికల





AFP

# ల పాలిట బలిపీఠం

ప్రక్రియకు భంగం కలిగించడానికే కుట్రదారులు ఈ హత్యకు పాల్పడ్డారని యూనస్ ఆరోపించారు. హాది ఆ ఎన్నికలలో (వచ్చే ఏడాది ఫిబ్రవరి 12) ఢాకా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని అనుకున్నారు. ఆ ప్రచారంలో ఉండగానే డిసెంబర్ 12న కాల్పులు జరిగాయి. వారం రోజులు మృత్యువుతో పోరాడిన హాది డిసెంబర్ 18న చనిపోయారు. ఈ హత్యకు ఆవామీలీగ్, భారత్ కారణమని అక్కడ గగ్గోలు పెడుతున్నారు. ఆవామీ లీగ్ కార్యకర్తలుగా పేరున్న ఫైయాసల్ కరీం మసూద్, ఆలంగీర్ షేక్ ఈ హత్య చేసి భారత్‌కు పారిపోయారని కూడా బాంగ్లాలో వదంతులు వ్యాపించాయి. మా దేశంలో కల్లోలం సృష్టించిన వారికి మీరు ఆశ్రయం ఇస్తే, ఈశాన్య రాష్ట్రాలలోని తిరుగుబాటు దారులకు తాము కూడా ఆశ్రయం ఇవ్వవలసి వస్తుందని నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నత్ అబ్దుల్లా ఇప్పటికే ఒక ప్రకటన జారీ చేశారు.

డిసెంబర్ 18న చనిపోయిన షరీఫ్ ఉస్మాన్ హాదిని షహీద్ అంటూ బాంగ్లాదేశ్ గౌరవించుకుంటున్నది. పనిలో పనిగా ఢాకా విశ్వవిద్యాలయంలో ఒక మందిరానికి ఉన్న వంగబంధు షేక్ ముజిబూర్ రెహమాన్ పేరు తొలగించి దానిని షహీద్ షరీఫ్ ఉస్మాన్ హాదీ హాల్ అని మార్చారు. ఇంక్విలాబ్ మంచ్ నాయకుడు హాది మృతికి సంబంధించిన కొత్త సమాచారం 24 గంటలలో సిద్ధం చేయాలని ఆ దేశ హోంశాఖకు ఉద్యమకారులు గడువు నిర్ణయించారు.

హాది అంత్యక్రియలు ఢాకాలోని విశ్వవిద్యాలయం మసీదు దగ్గరి శ్మశానవాటికలో నిర్వహించారు. దీనికి దేశ తాత్కాలిక అధ్యక్షుడు మహమ్మద్ యూనుస్ ఇతర ప్రముఖులు హాజరయ్యారు. హాది మృతదేహాన్ని బాంగ్లాదేశ్ జాతీయ కవి ఖాజీ నజ్రుల్ ఇస్లాం సమాధి పక్కనే ఖననం చేశారు. అంటే నజ్రుల్ ఇస్లాంతో సమంగా గౌరవించినట్టే. అయితే సెక్యులరిజానికి అంకితమైన నజ్రుల్ సమాధి పక్కన హాది అంత్యక్రియులు నిర్వహించడంపైన కొందరు నిరసన వ్యక్తం చేశారు. నజ్రుల్‌కు తిరుగుబాటు కవి అన్న పేరు ఉంది.

అంతర్జాతీయ సమాజం కూడా దౌత్య మర్యాదలను మరచి వ్యవహరిస్తున్నది. హాది హత్యను కొన్ని పాశ్చాత్య దేశాలు బరువైన పదాలతో ఖండించాయి. కానీ దీపు, గౌవిందదాస్, బీఎన్‌పీ నేత ఏడేళ్ల కుమార్తె దారుణ మరణం గురించి కనీసం ప్రస్తావించడం లేదు. యూఎస్ దౌత్యకార్యాలయం, యూరోపియన్ యూనియన్, జర్మనీ, ఫ్రాన్స్ హాది హత్య పట్ల బాహాటంగా సానుభూతి ఒలకబోయడంలోని విజ్ఞతను భారత విదేశ వ్యవహారాల మాజీ కార్యదర్శి కన్వల్ సిబల్ ప్రశ్నించారు. ఆసియాలో మానవ హక్కులు, సెక్యులరిజం అమలు, ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో ఆ దేశాలు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. హాదికి ముస్లిం మతోన్మాద వర్గాలతో సంబంధాలు ఉన్నాయని, అతడు ఇంక్విలాబ్ మంచ్ నాయకుడని, ఈ మంచ్ ఉద్దేశం దేశంలో ఇస్లామిక్ పాలన తేవడమేనని సిబల్ గుర్తు చేశారు. భారత్ అధీనంలోని ఈశాన్య భారత రాష్ట్రాలపై హాది తరుచు హక్కును ప్రకటిస్తూ ఉంటాడని, హాది భారత వ్యతిరేకత అందరికీ తెలిసినదేనని సిబల్ ఎక్స్ వేదికగా ఇచ్చిన ప్రకటనలో వ్యాఖ్యానించారు. ఇంక్విలాబ్ మంచ్ లక్ష్యం ప్రజాస్వామ్య, సెక్యులర్ బాంగ్లాను ఇస్లామిక్ దేశంగా మార్చడమేనని తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు. షేక్ ముజిబుర్ రెహమాన్ (బాంగ్లా జాతిపిత) భవంతిని హాది అనుచరులు తగులబెట్టారని, దీనిని పాశ్చాత్య దేశాలు సమర్థిస్తాయా అని కూడా సిబల్ ప్రశ్నించారు. నిజానికి హాది అంత్యక్రియల తరువాత కూడా పార్లమెంట్ భవనం మీద దాడికి హాది అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆ పాశ్చాత్య దేశాలు ఇచ్చిన ప్రకటనలు అంతర్జాతీయ ప్రాముఖ్యం ఉన్న వ్యక్తుల విషయంలోనే సబబుగ ఉంటాయని సిబల్ స్పష్టం చేశారు.

ఈ విధ్వంసమంతా ప్రస్తుతం బాంగ్లా మీద ఆధిపత్యం సంపాదించిన ముస్లిం మతోన్మాద సంస్థలే చేయిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. షేక్ హసీనా నాయకత్వంలోని ఆవామీ లీగ్ ప్రభుత్వం పతనమైన తరువాత ఈ విధ్వంసక శక్తులే బాంగ్లాను తమ చేతులలోకి తీసుకున్నాయి. కాబట్టి జెన్‌జీ పేరుతో జరిగిన విద్యార్థుల అల్లర్లు, దీనికి వత్తాసు పలికిన సైన్యం, రాజకీయ పార్టీలు అన్నీ ఆ ముస్లిం మతోన్మాద శక్తులు ఆడించినట్టే ఆడాయని అర్థం చేసుకోవాలి. దేశంలోనే పెద్ద రాజకీయ పక్షం బాంగ్లాదేశ్ జమాత్ ఇ ఇస్లామి (బీజేఐ), ఇతర ఇస్లామిస్ట్ ముఠాలు హసీనా నిష్క్రమణ తరువాత బాంగ్లా మీద పట్టు సాధించాయి. ఇస్లామీ ఆందోళన్ బాంగ్లాదేశ్, ఇస్లామి ఒయిక్యా జోతే, హెఫాజత్ ఇ ఇస్లాం వంటి తీవ్రవాద సంస్థలే ఇప్పుడు బాంగ్లాను శాసిస్తున్నాయి. వీటన్నిటికీ జమాతుల్ ముజాహుదీన్ బాంగ్లాదేశ్, హర్కత్ ఉల్ జిహాద్ అల్ ఇస్లామీ బాంగ్లాదేశ్, అన్సారుల్లా బాంగ్లా టీమ్ వంటి ఉగ్రవాద సంస్థల మద్దతు ఉంది. ఇంకొన్ని తీవ్రవాద ముఠాలకు, హరున్ ఇజహార్, ఆసిఫ్ అద్నాన్, జిమ్ తన్వీర్ వంటి నాయకులు యువతను ప్రభావితం చేయగలుగుతున్నారు. పైకి వీటి ఆశయాలు, ఆచరణ వేర్వేరుగానే కనిపిస్తాయి. కానీ వాటన్నిటి ఉద్దేశం ఒక్కటే– బాంగ్లాదేశ్‌ను ముస్లిం మత రాజ్యంగా మలచడమే. ఆ ముస్లిం మత రాజ్యం అఫ్ఘాన్ వలె లేదా ఇరాన్ వలె ఉండాలని వారు కోరుతున్నారు. పైగా ఈ తీవ్రవాద ముఠాలన్నిటినీ పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ కూడా ప్రోత్సహిస్తూ ఉంటుంది. ఈ ముఠాలు, ఈ వ్యక్తులు అంతా బాంగ్లాకు చెందినవారేనన్నది వాస్తవం. కానీ హాది హత్యను తీవ్రవాద ముఠాల చర్యగా తాత్కాలిక పాలకుడు యూనుస్ పేర్కొనడమే వింత. ఎవరా తీవ్రవాదులు? ఏవీ ఆ తీవ్రవాద ముఠాలు?

దీపూదాస్ హత్యాకాండ బాంగ్లాలోని హిందువులనే కాదు, భారతదేశంలోని హిందువులను కూడా కదిలించింది. కానీ ఆ విషయంలో సజావుగా, మర్యాదగా స్పందించే ఉద్దేశం కూడా బాంగ్లాకు లేదనిపిస్తుంది. డిసెంబర్ 21న ఈ అంశం మీద భారత్–బాంగ్లాల మధ్య జరిగిన మాటల యుద్ధం దీనినే నిరూపిస్తున్నది. దీపూ హత్యకు నిరసనగా పాతిక మంది హిందూ యువకులు ఢిల్లీలోని బాంగ్లా మిషన్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీనినే బాంగ్లా మీడియా భద్రతా సమస్యను సృష్టించే ప్రయత్నం జరుగుతున్నదని వ్యాఖ్యానించడం

# హిందువులపై రాక్షస మూకల దాడులు



దీపూ చంద్రదాస్

'వారి కుటుంబానికి దీపూచంద్ర దాస్ ఒక్కడే ఆధారం. దివ్యాంగుడైన అతడి తండ్రి, తల్లి, భార్య, వారి బిడ్డ అతడి జీతం మీదే ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటి? జిహాదీల నుంచి తమను తాము రక్షించుకోవడానికి భారత్‌కు రావడానికి కూడా వాళ్ల దగ్గర డబ్బు లేదు. అక్కడ వాళ్లు దయనీయంగా ఉన్న మైనారిటీలు కాబట్టి వారిని ఆదుకునేవారే లేరు. వాళ్లకి దేశం లేద. వాళ్ల సొంత దేశం అనుకున్న చోటే వారి దేశం కాదు. వాళ్లకంటూ ఒక మతం ఉన్నది. కానీ వాళ్లకి మతం లేదు' ఇవీ బాంగ్లాదేశ్ మతోన్మాదుల చేతులలో హింసకు గురై చనిపోయిన హిందూ నిరుపేద కార్మికుడు దీపూచంద్ర దాస్ గురించి రచయిత్రి తస్లీమా నస్రీన్ అన్నమాటలు.

బాంగ్లాదేశ్‌లో చెలరేగిన తాజా హింసాకాండకు దీపూచంద్రదాస్ అనే ఈ కార్మికుడు బలైపోయాడు. ఇతడిని అత్యంత దారుణంగా హింసించారు. తరువాత చెట్టుకు వేలాడదీసి నిప్పు పెట్టారు. అతడి మీద ఆ రక్తపిపాసులు మోపిన నేరం ఒక్కటే– అతడు దైవదూషణకు దిగాడు. దాస్‌ను మైమెన్‌సింగ్ జిల్లా భాలుకా అనే చోట డిసెంబర్ 19 రాత్రి ఈ ఘాతుకం చోటు చేసుకుంది. ఒక దుస్తుల తయారీ సంస్థలో పనిచేసే దాస్, సమీపంలోనే ఒక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇతడు దైవదూషణకు పాల్పడ్డాడని చెబుతున్నప్పటికి అందుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవు. ఎలాంటి దర్యాప్తు జరగలేదు. ఉన్మాదం నెత్తికెక్కిన ఒక మూక అతడిని కర్రలతో చుట్టుముట్టి చనిపోయే వరకు కొట్టింది. తరువాత అతడి మృతదేహాన్ని ఒక చెట్టుకు వేలాడదీసి నిప్పంటించింది. చనిపోయిన వ్యక్తి దీపూచంద్ర అని భాలుకా పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న రిపోన్ మియా బీబీసీ విలేకరి వద్ద ధ్రువీకరించాడు. ఈ హత్యకు దీపూదాస్ దైవదూషణ చేసినట్టు చెబుతున్నప్పటికీ నిజానికి హాదీ మరణం తరువాత చెలరేగిన అల్లర్లలో భాగంగా, హిందువులపై జరుగుతున్న హత్యాకాండలో ఇదీ భాగమేనని చెబుతున్నారు.

దీనిని పశ్చిమ బెంగాల్ బీజేపీ తీవ్రంగా ఖండించింది. వక్ఫ్ సవరణ చట్టం సవరణ సమయంలో, అంటే ఏప్రిల్ 2025లో జరిగిన అల్లర్లలో ముర్షిదాబాద్‌కు చెందిన హరిగోవింద దాస్ (72), చందన్‌దాస్ (40) ఇదే విధంగా చంపారని బీజేపీ నాయకులు ఆరోపించారు.

దీపూ హత్య గురించే తస్లీమా కూడా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. అక్కడ జరిగినదేమిటో వివరించారు. భాలూకాలో దీపూ పనిచేస్తున్న దుస్తుల కర్మాగారం మేనేజర్ బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించాడు. అతడే ఆ మూకకు అప్పగించాడు. అతడు ప్రవక్త మహమ్మద్‌ను అవమానిస్తూ దూషణలకు దిగాడని, అందుకే సాటి కార్మికులు అతడిని కొట్టి చంపారని చెబుతున్నారు. ఇదంతా ఆ దుస్తుల తయారీ కర్మాగారం ఎదుటే జరిగింది. దీపూచంద్రకు పోలీస్ భద్రత ఉన్నది. అయినా ఇంత ఘోరంగా అతడిని చంపారని తస్లీమా ఆరోపించారు. పాత పగలను దృష్టిలో ఉంచుకుని అదే కర్మాగారంలో పనిచేసే ముస్లింలు దీపూను చంపారని కూడా ఆమె చెప్పారు. అదెలాగంటే, ఇతడిని హైనాలలా మీదపడి సాటి కార్మికులు చీరుతుంటే పోలీసులు వచ్చి తన అదుపులోనికి తీసుకున్నారు. ఆ తరువాతనే అతడి ప్రాణాలు పోయాయి. ఎందుకంటే దీపూను తీసుకుపోతున్న కార్మికులను వెంబడించే ప్రయత్నమేదీ పోలీసులు చేయలేదు. జిహాద్ అంటే పోలీసులకు కూడా ఇష్టమే కాబట్టి దీపూ హత్యను ఆపే ప్రయత్నమేదీ చేయలేదని ఆమె తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ★

విశేషం. నిరసన తెలిపిన వారిపై హిందూ తీవ్రవాదులుగా ముద్ర వేయడం తెంపరితనం తప్ప మరొకటి కాదు. ఇతర మతాలవారిని చంపడం తమ విశ్వాసంలో భాగమన్న మధ్యయుగాల మనస్తత్వాన్ని ప్రదర్శించడమే.

నిజానికి ఈ దుష్టశక్తులను పెంచి పెద్ద చేయడంలో షేక్ హసీనా కూడా తనవంతు పాత్ర నిర్వహించారని, తన రాజకీయ మనుగడ కోసం చేరదీశారని కూడా విశ్లేషకులు చెబుతారు. 20 ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికి ఉగ్రవాద మూకల ప్రభావం నుంచి ఆమె దేశాన్ని కాపాడలేకపోయారు. 2021లో దసరా సమయంలో 21 హిందువుల ఇళ్లకు మతోన్మాద శక్తులు నిప్పు పెట్టిన ఘటన ఆమె కాలంలోనే జరిగింది. కౌంటర్ టెర్రరిజం అండ్ ట్రాన్స్‌నేషనల్ క్రైమ్ యూనిట్ ఆఫ్ ఢాకా, యాంటీ టెర్రరిజం యూనిట్ వంటి ఉగ్రవాద నిరోధక వ్యవస్థలకు ఆ ఉగ్రమూకలు సవాళ్లు విసిరే స్థాయికి చేరుకున్నాయి. అయితే ఆ సంస్థలు ఉగ్రవాద నిరోధం కంటే, చిన్న చిన్న నేరాల దర్యాప్తునకు పరిమితం కావలసి వస్తున్నదంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బాంగ్లా ఆవిర్భావం సందర్భంగా 1972లో రాసుకున్న రాజ్యాంగంలో సెక్యులరిజం అన్న పదం కనిపిస్తుంది. ముందుమాటలోని ఈ పదంతో పాటు, ఆర్టికల్ 8లో ప్రాథమిక హక్కులను కూడా చేర్చారు. కానీ ఐదేళ్లకే, అంటే 1977లోనే జనరల్ జియా ఉర్ రహమాన్ రాజ్యాంగ స్వరూపం మార్చారు. ఐదో రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులరిజం అన్న పదం తొలగించారు. దాని స్థానంలో సర్వోన్నత అల్లాకు విధేయమైన రాజ్యంగా ప్రకటించారు. దీనితో 1988 నాటికి బాంగ్లా పూర్తి మత రాజ్యంగా ఆవిర్భవించింది. అయితే 2011లో మళ్లీ సెక్యులరిజం అన్న పదం రాజ్యాంగంలో చేరినా అంత ప్రాధాన్యం సంతరించుకోలేదు. ఇప్పటి అల్లర్ల వెనుక ఉన్నవారు బాంగ్లాను వడివడిగా మత రాజ్యం దిశగా అడుగులు వేయిస్తున్నారు.

ఇవన్నీ ఎలా ఉన్నా 2026 ఫిబ్రవరిలో జరగవలసిన బాంగ్లా ఎన్నికల మాటేమిటి? ఇప్పుడు అంతా వేసుకుంటున్న ప్రశ్న ఇదే. ఈ ఎన్నికల ప్రక్రియను భగ్నం చేసి, ప్రజాస్వామికంగా బాంగ్లా సుస్థిరం కావడం ఇష్టం లేని వారే హాదిని హత్య చేశారని యూనస్ వ్యాఖ్యానించారు. కాగా మాజీ ప్రధాని ఖాలీదా జియా కొడుకు తారిక్ రహమాన్ (60) రంగంలోకి దిగవచ్చునని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి ఇతడే తాత్కాలిక నేత. కానీ ఈ పార్టీని యూనస్ ప్రభుత్వం నిషేధించింది. ఒకవేళ బాంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చినా జమాత్ పార్టీతో ఇబ్బందులు తప్పవని విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే ప్రస్తుత తాత్కాలిక అధ్యక్షుడు యూనస్‌కూ, సైనిక దళాల ప్రధానాధికారి వాకరజ్ జమాన్‌కు నడుమ విభేదాలు ఎలాంటి ఫలితాలకు దారి తీస్తాయో ఊహించడం కష్టం.

2024లో బాంగ్లాలో వచ్చిన సామాజిక సంక్షోభానికి ఉదారవాదులు జెన్‌జెడ్ పేరు పెట్టి ఆకాశానికి ఎత్తారు. ఆ తరహా సంక్షోభాన్ని ప్రపంచం చూడడం అదే మొదటిసారి. ఇదే వ్యాధి తరువాత ఆసియా దేశాలు నేపాల్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, తైమోర్‌లెస్టె, మాల్దీవులకు పాకింది. అది ఎక్కడ ఎలాంటి ఫలితాలను ఇచ్చిందో కూడా ప్రపంచం చూసింది. ఏమైనా బాంగ్లా తనకు తాను తెచ్చుకున్న సంక్షోభానికి ఇప్పట్లో ముగింపు పలకలేదు. అప్పటి దాకా భారత్ అప్రమత్తంగా ఉండక తప్పదు. ఐదు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న బాంగ్లాదేశ్‌తో కఠినంగా వ్యవహరించక తప్పదు. కాబట్టి ఇప్పటికైనా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా వంటి నేతలు కళ్లు తెరుచుకోవడం అవసరం.

**– జాగృతి డెస్క్**

SRI VIJNANA VIHARA E.M. SCHOOLS

# గురుకుల విద్యాలయం

NIVEDITA GURUKULAM

(ప్రాచీన భారతీయ మరియు ఆధునిక విద్యా విధానాల మేలు కలయిక)

## 2026 - 2027 : 4 వ తరగతికి ప్రవేశములు జరుగుచున్నవి

**పరీక్ష జరుగు తేదీలు (28 డిసెంబర్ 2025, మార్చి 15 2026, ఏప్రిల్ 12 2026)**

**(పరీక్ష మరియు ముందుగా ఇవ్వబడే శిక్షణ కాలంలో విద్యార్థుల దక్షత ఆధారంగా ఎంపిక జరుగును)**

సమర్థవంతమైన మరియు ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే భారతీయ జీవనాన్ని పునరుద్ధరించాలి. అందుకు మన ప్రాచీన గురుకుల విద్యావ్యవస్థను తిరిగి తీసుకురావడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది. మన సమాజంలోని ఇప్పటితరానికి మనం ఈ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అందిస్తే వారు దీన్ని భవిష్యత్ తరాలకు సమర్థవంతంగా అందించగలరని మేము నమ్ముతున్నాము. ఈ గురుకుల విద్యను అభ్యసించే కాలం పూర్తిగా 12 సంవత్సరాలు ఉంటుంది. 12 సంవత్సరాల విద్యను పూర్తిచేసుకున్న గురుకుల విద్యార్థులు జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ గివర్స్‌గా (Entrepreneur) మారుతారు.

గురుకులంలోని విద్యార్థులకు ఈ 12 సంవత్సరాలు గురుకుల శిక్షణాకాలంలో 64 రకాల కళలను దశలవారీగా నేర్పబడును. ఇందులో వేదవిద్యతోపాటుగా గుర్రపుస్వారీ, త్రినేత్రవిద్య, మల్లఖంబ విద్య, విలువిద్య, జ్యోతిష్యము, సంగీతము మరియు చిత్రలేఖనము వంటి విషయాలు నేర్పించబడును. **గురుకులం కేవలం బాలికలకు మాత్రమే.**

**బాలికల కొరకు**

**శ్రీ నివేదిత గురుకులం**

కృష్ణా జిల్లా, గన్నవరం, విజయవాడ దగ్గర
ఉంగుటూరు గ్రామం, 8341153131

లొకేషన్ కొరకు స్కాన్ చేయండి

**గురుకుల వాతావరణం**

## ✱ ఉచిత విద్య

- ✱ గురుకుల విద్య పూర్తిగా CBSE సిలబస్‌ను అనుసరిస్తుంది.
- ✱ కుటుంబం నుండి ఒక అడ్మిషన్ మాత్రమే అనుమతించబడుతుంది.
- ✱ సాంకేతిక మరియు వైజ్ఞానికమైనటువంటి విషయాలు.
- ✱ విద్యార్థులకు నాలుగు భాషలు (తెలుగు, ఇంగ్లీష్, హిందీ మరియు సంస్కృతము) నేర్పించడం జరుగుతుంది.
- ✱ తల్లిదండ్రులు తమ పిల్లలను 12 సంవత్సరాల కాలం పాటు గురుకులంలో ఉంచవలసి వుంటుంది.
- ✱ విద్యార్థులకు జ్ఞానార్జనే ప్రధానము. మార్కుల ఒత్తిడి విద్యార్థి మనసుమీద ప్రభావము చూపరాదు.
- ✱ ప్రతి సంవత్సరం రూ. 25000/- కాషన్ డిపాజిట్ చెల్లించాలి. 12 సంవత్సరాల విద్య పూర్తి అయిన తరువాత తిరిగి విద్యార్థికి చెల్లించబడుతుంది.
- ✱ తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తకాలు మరియు ఇతర సామాగ్రిని అవసరానికి తగినట్టుగా అందించాలి.
- ✱ శ్రీకృష్ణుడు మరియు సుధాముడు ఒకే గురుకులములో చదువుకున్నట్లు నివేదిత గురుకులములో కూడా అన్ని వర్గాల అమ్మాయిలు కలిసి చదువుకుంటారు.
- ✱ పరీక్ష సమయంలో రూ॥500/- పరీక్ష ఫీజు చెల్లించవలసి వుంటుంది.




# తరం మార్పు
# నితిన్ నబీన్

**ఆచార్య చాణక్య రాజనీతి శాస్త్రంలో గొప్ప నాయకత్వం గురించి చెబుతూ... ధైర్యం, న్యాయం, నిజాయతీ, వినయం, ఆత్మవిశ్వాసం, లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన, ప్రజా సంక్షేమం, క్రమశిక్షణ, దూరదృష్టి వంటి అత్యున్నతమైన లక్షణాలున్న వారు గొప్ప నేతగా ఎదుగుతారని సూత్రీకరించారు. ఇలాంటి అర్హతలున్న నేతలు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో విరివిగా కనిపిస్తుంటారు. బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ సిన్హా నియామకం కూడా ఇదే కోవకు చెందుతుంది. ప్రస్తుతం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా తొలుత పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఏడు నెలలు బాధ్యతలు నిర్వహించారు. అనుభవం గడించిన అనంతరం రెండు పర్యాయాలు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతూ త్వరలో ఆరు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. ఈ నేపథ్యంలో నితిన్ నబీన్ కూడా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికయ్యే అవకాశాలుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇతర పార్టీలతో పోలిస్తే బీజేపీ తీసుకునే నిర్ణయాలు వైవిధ్యంగా ఉంటాయి.**

దేశంలో రాజకీయ పండితుల ఊహలకు అందని విధంగా బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా నితిన్ నబీన్ సిన్హా ఎంపిక జరిగింది. జేపీ నడ్డా పదవీకాలం త్వరలో ముగియనుంది. ఆయన తర్వాత పార్టీ అధ్యక్షుడు ఎవరనే చర్చ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వేళ రాజకీయ విశ్లేషకులతో పాటు మీడియాలో కూడా అనేక ఊహాగానాలొచ్చాయి. వివిధ ప్రాంతాలు, పలు సామాజిక వర్గాల కోణంలో డజనుకుపైగా పేర్లు భావి అధ్యక్షుడి కోసం ప్రచారమయ్యాయి. ఉత్తర, మధ్య, దక్షిణ, ఈశాన్య, తూర్పు ప్రాంతాలకు సంబంధించి వివిధ సామాజిక వర్గాలకు చెందిన పలువురు సీనియర్ నేతలతో పాటు నాయకు



నితిన్ నబీన్ సిన్హా

రాళ్ల పేర్లు కూడా అధ్యక్ష పదవిపై విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు క్రమశిక్షణ పార్టీగా చెప్పుకునే బీజేపీలో ప్రస్తుతం పరిస్థితులు మారాయని, పార్టీలో అంతర్గతంగా పోరు తీవ్రంగా ఉందని, పార్టీకి, ఆర్ఎస్ఎస్‌కు మధ్య విభేదాలున్నాయని, దీంతో జాతీయ అధ్యక్షుడి నియామకంపై పార్టీ నిర్ణయం తీసుకోలేక జాప్యం చేస్తుందనే ప్రచారం కూడా ఒకవైపు జోరుగా సాగింది. ఎవరి ప్రచారంలో వారుండగా, చడీచప్పుడు లేకుండా, ఎవరూ అంచనా వేయని విధంగా కుల, మత, ప్రాంతీయ సమీకరణాలకు అతీతంగా నితిన్ నబీన్ సిన్హా పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడయ్యారు. ఈ నియామకం అనంతరం ఇలాంటి పరిణామాలు బీజేపీలోనే సాధ్యమని మరోసారి రుజువైంది.

సామాన్య కార్యకర్తలను ఉన్నత స్థాయి నేతలుగా తీర్చిదిద్దడంలో ఇతర పార్టీలతో పోలిస్తే బీజేపీ ముందంజలో ఉంటుంది. తాత్కాలిక కుల, మత, ప్రాంతీయ సమీకరణాల కంటే పార్టీ దీర్ఘకాలిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బీజేపీ నిర్ణయాలుంటాయి. అధ్యక్ష పగ్గాలు చేపట్టే నేత సుదీర్ఘకాలం సేవలందించేలా పార్టీ నియామకాలుంటాయి. అందుకే 45 ఏండ్ల నితిన్ నబీన్ సిన్హా ఎవరూ అంచనా వేయని విధంగా అత్యున్నతమైన పదవిని అలంకరించనున్నారు. వయస్సు రీత్యానే కాకుండా సైద్ధాంతికంగా కూడా పార్టీ అడుగుజాడల్లో నడుచుకునే వ్యక్తి కావడం కూడా ఆయనకు అదనపు బలంగా మారింది. పిన్న వయస్సులోనే పార్టీపై పూర్తి అవగాహన కూడా ఉండడంతో సీనియర్ నేతగా కూడా ఈయనకు మంచి గుర్తింపు ఉంది. చిన్న వయసులోనే సీనియర్ నేతగా మారిన ఈయన జాతీయత, సనాతన ధర్మం, దేశ ఐక్యత వంటి పార్టీ సిద్ధాంతాలపై నిక్కచ్చిగా వ్యవహరించే క్రమశిక్షణ కలిగిన నేతగా గుర్తింపు పొందారు.

భారతీయ జనతాపార్టీ పార్లమెంటరీ బోర్డు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ ఎంపికలో పలు కోణాలను పరిగణనలోకి తీసుకుంది. బీజేపీ చరిత్రలో అతి పిన్న వయస్సులోనే కీలక బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఈయన పుట్టిన 1980 సంవత్సరంలోనే బీజేపీ కూడా ఆవిర్భవించడం విశేషం. బీజేపీ వ్యవస్థాపక నేతల్లో ఒకరైన నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కుమారుడైన నితిన్ తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తూ బాల్యం నుంచే బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి నబీన్ కిశోర్ మరణానంతరం 2006లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలిచారు. వరుసగా 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఐదు సార్లు ఓటమి ఎరుగని ఎమ్మెల్యేగా నిలిచారు.

ప్రజాప్రతినిధిగా దాదాపు 20 సంవత్సరాల అనుభవం ఉండటం విశేషం. 2021లో బిహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2025లో కూడా అదే పదవిలో కొనసాగుతున్నారు. ఏబీవీపీ కార్యకర్తగా సంఘ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనడంతో బీజేపీ జాతీయతపై అవగాహన ఉంది. బీజేవైఎం జాతీయ కార్యదర్శిగా పార్టీ సైద్ధాంతికతపై మంచి పట్టు ఉండడమే కాకుండా జాతీయ స్థాయి నేతలతో సత్సంబంధాలున్నాయి. ఏబీవీపీ, బీజేవైఎంలో క్రియాశీలకంగా పనిచేసిన




# నకు సంకేతం
# నియామకం

అనుభవాలు పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేయడానికి ఉపయోగపడుతాయి. పార్టీపై పట్టు ఉండడంతో పాటు మంత్రిగా పనిచేసిన పాలనాపరమైన పరిజ్ఞానం కూడా ఉండడం కార్యనిర్వాహక అధ్యక్ష పదవికి ఎంపికకు సులభమైంది. ఈ యువనేత పార్టీని కిందిస్థాయి నుండి బలోపేతం చేసే బాధ్యతలను చురుగ్గా నిర్వహించగలరనే విశ్వాసంతో బీజేపీ పార్లమెంటరీ బోర్డు పార్టీ అత్యున్నత పదవిని ఆయనకు కట్టబెట్టింది. మరోవైపు ఈయనకు చిన్నవయస్సు నుండే ఆర్ఎస్ఎస్‌తో సత్సంబంధాలుండడంతో క్రమశిక్షణ, జాతీయత, సేవాభావం విలువల్లో కూడా మంచి అనుభవం ఉంది. నితిన్ నబీన్ సిన్హా ఎంపికతో సైద్ధాంతికంగా, సంస్థాగతంగా బలం, యువతపై పట్టు, ఎన్నికలకు సంసిద్ధత అంశాలను పార్టీ పరిగణనలోకి తీసుకుందని స్పష్టమైంది.

బీజేపీ జాతీయ అధ్యక్షుడి పదవీ కాలం మూడు సంవత్సరాలు. పార్టీ నిబంధనల ప్రకారం వరుసగా రెండుసార్లు అంటే గరిష్టంగా ఆరు సంవత్సరాలు అధ్యక్షుడిగా కొనసాగే అవకాశాల్లేవు. బీజేపీ ఇప్పుడే కాదు గతంలో కూడా అధ్యక్ష పీఠాన్ని యువ నేతలకు అప్పగించడానికే మొగ్గు చూపింది. సామాజిక, ప్రాంతీయ వంటి తాత్కాలిక సమీకరణాలకంటే దీర్ఘకాలిక ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తుంది. బీజేపీ చరిత్రలో ఇప్పటివరకు అధ్యక్షులుగా పనిచేసిన 14 మంది ఎంపికలను పరిగణనలోకి తీసుకుంటే యువనేతను పార్టీ అత్యున్నత పదవికి ఎంపిక చేయడం నితిన్ నబీన్ సిన్హాతోనే ప్రారంభం కాలేదు. 2014లో అమిత్ షా 49 ఏళ్ల వయస్సులో, 2009లో నితిన్ గడ్కారీ (52), 2002లో వెంకయ్యనాయుడు (53), 2005లో రాజ్‌నాథ్ సింగ్(54), 1980లో అటల్ బిహారీ వాజపేయి(55), 1986లో ఎల్‌కే అద్వాణి(58), 1991లో మురళీ మనోహర్‌జోషి (57), 2020లో జేపీ నడ్డా(59), 2000లో బంగారు లక్ష్మణ్(60), 2001లో జానా కృష్ణమూర్తి (72), 1998లో కుశభావు ఠాక్రే(75)లకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో పార్టీ దీర్ఘకాలిక వ్యూహాలు కనిపిస్తున్నాయి. జానాకృష్ణమూర్తి, కుశభావు ఠాక్రే మినహా మిగతా వారందరూ 60 ఏళ్ల వయస్సు లోపలే పార్టీ అధ్యక్ష పదవులను చేపట్టడం గమనార్హం. గత ఎంపికలను పరిశీలిస్తే అధ్యక్షుల ఎంపికలో పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాలకిస్తున్న ప్రాధాన్యం అవగతమవుతోంది.

పార్టీ అధ్యక్షుడి ఎంపికలోనే కాకుండా ముఖ్యమంత్రుల విషయంలో కూడా బీజేపీ ఇదే పంథాను కొనసాగించడం విశేషం. దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలో ఉన్న బీజేపీ యువ నేతలకే అధిక ప్రాధాన్యతిచ్చింది. అరుణాచల్ ప్రదేశ్‌కు పెమా ఖండూ(46), ఉత్తరాఖండ్‌కు పుష్కర్ సింగ్ ధామీ(50), ఢిల్లీకి రేఖా గుప్తా(51), గోవాకి ప్రమోద్ సావంత్(52), ఉత్తరప్రదేశ్‌కు యోగి ఆదిత్యనాథ్ (53), ఒరిస్సాకు 53 మోహన్ చరణ్ మాఝీ(53), మహారాష్ట్రకు దేవేంద్ర ఫడణవీస్(55), హరియాణాకు నయాబ్ సింగ్ సైనీ(55), అస్సాంకు హిమంత బిశ్వ శర్మ(56) , రాజస్తాన్‌కు భజన్ లాల్ శర్మ(58), మధ్యప్రదేశ్‌కు మోహన్ యాదవ్(60), ఛత్తీస్‌గఢ్‌కు విష్ణుదేవ్ సాయి(61), గుజరాత్‌కు భూపేంద్ర పాటిల్(63), త్రిపురకు మాణిక్ సాహా (72) ముఖ్యమంత్రులుగా కొనసాగుతున్నారు. వీరిలో మాణిక్ సాహా మినహా మిగతా వారందరూ 65 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం.



ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ అయిన బీజేపీ మరింత బలోపేతానికి సంస్థాగత ఆవశ్యకతను గుర్తించి, అదే పంథాలో యంత్రాంగాన్ని తయారుచేసుకుంటోంది. సీనియర్ నేతలను కాదని యువకులను పార్టీ ఉన్నత పదవులకు ఎంపిక చేస్తుందనే వాదన సత్య దూరం. రాబోయే 10 నుంచి పదిహేను సంవత్సరాలు పార్టీకి కీలక సేవలను అందించేలా నేతలను పార్టీ ఎంపిక చేస్తోంది.

ముఖ్యమంత్రుల ఎంపికలో బీజేపీ తన వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలతో పాటు రాజకీయ విశ్లేషకులను కూడా విస్మయానికి గురిచేసింది. ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయి ఎంపిక ప్రత్యేకమైంది. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ రమణ్ సింగ్‌ను పక్కనపెట్టి విష్ణుదేవ్‌ను సీఎం చేశారు. రాజస్తాన్‌లో సీనియర్ బీజేపీ నేత వసుంధర రాజేను కాదని భజన్‌లాల్ శర్మను ముఖ్యమంత్రి చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కావడానికి సీనియర్ నేతలున్నా రేఖా గుప్తాను సీఎంను చేసి బీజేపీ మహిళలకు పెద్ద పీట వేసింది. మహారాష్ట్రలో యువనేత దేవేంద్ర ఫడణవీస్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేసి పార్టీలో యువతను ప్రోత్సహించింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపిక మరింత ఆసక్తికరమైనది. 2005 నుండి 2018 వరకు వరుసగా 13 సంవత్సరాలు, 2020 నుండి మరో మూడు సంవత్సరాలు శివరాజ్ సింగ్ చౌహాన్ సీఎంగా ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం సిట్టింగ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కాదని మోహన్ యాదవ్‌ను ముఖ్యమంత్రిగా చేయడంతోనే బీజేపీ దీర్ఘకాలిక వ్యూహాలు, ప్రణాళికలు అర్థమవుతున్నాయి.

ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ అయిన బీజేపీ మరింత బలోపేతానికి సంస్థాగత ఆవశ్యకతను గుర్తించి, అదే పంథాలో యంత్రాంగాన్ని తయారు చేసుకుంటోంది. సీనియర్ నేతలను కాదని యువకులను పార్టీ ఉన్నత పదవులకు ఎంపిక చేస్తుందనే వాదన సత్య దూరం. రాబోయే 10 నుంచి పదిహేను సంవత్సరాలు పార్టీకి కీలక సేవలను అందించేలా నేతలను పార్టీ ఎంపిక చేస్తోంది. వయస్సురీత్యా తరం మార్పును సూచిస్తూ నేతలను తయారుచేస్తోంది.

సంఘపరివార్ మార్గదర్శనంలో రాటుదేలి విద్యార్థి, యువ విభాగాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారు సైద్ధాంతికంగా ఎంతో అనుభవం గడిస్తున్నారు. దీంతో బీజేపీలో పలువురు యువ నేతలు సైద్ధాంతిక పరిజ్ఞానంతో సీనియర్ నాయకులుగా ఎదుగుతున్నారు. సిద్ధాంతాలకు కట్టుబడుతూ, అనుభవమున్న సీనియర్ నేతలతో పాటు అదే స్థాయిలో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువ నేతలకు కూడా బీజేపీలో కొదవలేదు. అంతర్జాతీయంగా అత్యధిక కార్యకర్తలున్న పార్టీగా రికార్డు సృష్టించిన బీజేపీ తరాల మార్పునకు సంకేతంగా సీనియర్ల స్థానంలో యువ నేతలను ప్రోత్సాహిస్తోంది. తద్వారా భావితరాలకు కూడా పార్టీని చేరువ చేయడంలో విజయవంతమవుతోంది.

**–శ్రీపాద**

# పర్యావరణానికి పంచ




**జాతి పునర్నిర్మాణానికి అంకితమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 2025 సంవత్సరంలో శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటోంది. దాని సైద్ధాంతిక పునాది, నిర్వహణ నిర్మాణం, నిస్వార్థ సేవ కారణంగా, ఆర్ఎస్ఎస్ భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఒక బలమైన సంస్థగా ఆవిర్భవించింది.**

సమ్మిళిత, బలమైన, సంపన్నమైన, అభివృద్ధి చెందిన భారతదేశానికి వ్యతిరేకంగా దేశం లోపలా, బయటా కొన్ని విధ్వంసక శక్తుల కారణంగా, సంస్థను కించపరిచే మీడియా కథనం తరచుగా, ముఖ్యంగా పాశ్చాత్య మీడియాలో వస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ముఖ్యమైనది ఏదైనా ఉందంటే అది స్ప్రింగ్ లాంటి ఆర్ఎస్ఎస్‌పై ఎంత బలంగా ఒత్తిడి పెంచితే అంతే స్థాయిలో ఆర్ఎస్ఎస్ ప్రతి చర్యా ఉండటం.

బ్రిటీష్‌వారి విభజించు, పాలించు విధాన ఫలితంగా మతం ప్రాతిపదికగా భారత్ విభజన జరిగింది. దురదృష్టవశాత్తు, స్వతంత్ర భారతదేశంలో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు అదే వలసవాద మనస్తత్వంతో, అదే విధానాన్ని అనుసరించాయి తప్ప పెద్దగా తేడా చూపించలేదు. ఈ ప్రభుత్వాలు వివిధ కులాలు, వర్గాలు, భాషా సమూహాల రూపంలో సామాజిక నిర్మాణాన్ని విచ్చిన్నం చేస్తూనే ఉన్నాయి. సంక్షేమం ముసుగులో చేపట్టిన బుజ్జగింపు విధానాలు జాతి నిర్మాణం కోసం జరుగుతున్న ప్రయత్నాలను బలహీనపరిచాయి.

కొన్ని వర్గాలను నడిపిస్తున్న మతమౌఢ్యం ఆ వర్గాల్లోని అమాయక ప్రజలను తీవ్రవాద/ఛాందస వాద భావజాలం వైపు ప్రేరేపిస్తోంది. అలాంటివారు తమ మతం దేశానికి అతీతమైనదిగా ప్రకటించుకున్నారు. మిగిలినవారితో కలిసి శాంతియుతంగా జీవించడానికి నిరాకరిస్తున్నారు. దీంతో దేశం పట్ల వారి విధేయత ప్రశ్నార్థకంగా మారుతుంది. అలాంటి ఒక ధోరణి పట్ల అదే మతానికి చెందిన మేధావులు కానీ రాజకీయ నాయకత్వం కానీ సామాన్య ప్రజలు కానీ ఆగ్రహం వ్యక్తం చేయకపోవడం విడ్డూరంగా ఉంది.

ఈ నేపథ్యంలో, జాతి పునర్నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి, భారతీయ సమాజాన్ని మార్చడానికి ఆర్ఎస్ఎస్ పంచ పరివర్తనలతో ముందుకు వచ్చింది. వాటిలో సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన్, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ ఆచరణ, పౌరుల కర్తవ్య పాలన అనే ఐదు అంశాలు ఉన్నాయి.

ఈ వ్యాసం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కొన్ని అంశాలను, ఆలోచనలను చర్చించింది. అలాగే ప్రాచీన భారత దేశంలో ప్రకృతికి ఇచ్చిన ప్రాముఖ్యత, ప్రస్తుత పర్యావరణ సవాళ్లు, పర్యావరణ పరిరక్షణ కోసం భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యల గురించి క్లుప్తంగా చర్చించింది.



**'భూమిపై జీవితం' భగవాన్ చేత నడుస్తుందని చెప్పడం సముచితంగా ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, పంచభూతాలు (భ + అగ్ + వ + ఆ + ఎన్) ఇక్కడ 'భ' అంటే భూమి, 'అగ్' అగ్ని, 'వ' వాయువు, 'ఆ' ఆకాశ్, 'ఎన్' అంటే నీరు ఇవ్వన్నీ కలిసి ఈ ప్రపంచాన్ని ఏర్పరిచాయి.**

'పర్యావరణం అంటే ఏమిటి'? తో ప్రారంభిద్దాం. పర్యావరణం అంటే విస్తృత అర్థంలో మన చుట్టూ ఉన్నది, ఈ భూమిపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రతి జీవి మనుగడకు సహాయపడుతుంది.

పర్యావరణాన్ని జీవ సంబంధితమైనవి (మానవులు, పక్షులు, జంతువులు, మొక్కలు, చెట్లు, సూక్ష్మజీవులు), నిర్జీవమైనవి (భౌతిక మూలకాలు, వాతావరణం, జలావరణం, భూమి, సూర్యకాంతి, అంతరిక్షం) అని మరొక విధంగా వర్గీకరించవచ్చు. ఇవన్నీ సంక్లిష్టమైన "జీవన వలయం"లో అనుసంధానితమై పరస్పరం ప్రభావితమవుతుంటాయి.

'భూమిపై జీవితం' భగవాన్ చేత నడుస్తుందని చెప్పడం సముచితంగా ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, పంచ భూతాలు (భ + అగ్ + వ + ఆ + ఎన్) ఇక్కడ 'భ' అంటే భూమి, 'అగ్' అగ్ని, 'వ' వాయువు, 'ఆ' ఆకాశ్, 'ఎన్' అంటే నీరు ఇవ్వన్నీ కలిసి ఈ ప్రపంచాన్ని ఏర్పరిచాయి.

పర్యావరణం మన మనుగడ, జీవనోపాధికి చాలా ముఖ్యమైనది. ఇది మనకు అవసరమైన ఆహారం, గాలి, నీరు అనే సహజ వనరులను అందిస్తుంది. స్వచ్ఛమైన పర్యావరణం కూడా జీవన ప్రమాణాన్ని మెరుగుపరుస్తుంది. ఇది వివిధ కాలుష్య కారకాలను గ్రహించి వాటిని తిరిగి ఉపయోగించుకునే అంతర్గత సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. పర్యావరణ సమస్యలను అవి ప్రభావం చూపించే స్థాయిలను బట్టి ప్రపంచ, స్థానిక సమస్యలుగా వర్గీకరించవచ్చు.

**ప్రాచీన భారతదేశంలో పరిరక్షణ**

పర్యావరణ పరిరక్షణ అనేది ప్రాచీన కాలం నుండి భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా ఉంది. ఇక్కడ ప్రకృతిని పవిత్రంగా భావిస్తారు. చారిత్రాత్మకంగా ప్రకృతి, వన్యప్రాణుల పరిరక్షణ భారతీయ సమాజం రోజువారీ జీవితం, పురాణాలు, జానపద కథలు, ధర్మం, కళ, సంస్కృతిలో ప్రతిబింబిస్తుంది.

వన్యప్రాణులు, చెట్లు, అడవులను రక్షించడం రాజు విధిగా 2300 సంవత్సరాల క్రితం అశోక చక్రవర్తి ప్రకటించాడు. అడవులను నాశనం చేయడాన్ని, వివిధ జాతుల జంతువులను చంపడాన్ని నిషేధిస్తూ తన రాజ్యం అంతటా రాళ్లు, ఇనుప స్తంభాలపై శాసనాలు చెక్కించాడు. నేటికీ మిగిలి ఉన్న ఈ చారిత్రక సాక్ష్యం, ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణకు మొట్టమొదటి ఆనవాలుగా నిలిచి పోయింది.

జీవావరణ శాస్త్రపు ప్రాథమిక సూత్రాలైన అన్ని జీవుల పరస్పర సంబంధం, పరస్పర ఆధారితం భారతీయ ఆచార విచారాల్లో మమేకమై ఉన్నాయి. అవి మన పురాతన గ్రంథం ఈశోపనిషత్తులో ప్రతిబింబించాయి. "మహోన్నత శక్తిమంతుడైన పరమాత్ముడు అన్ని జీవుల ప్రయోజనం కోసమని ఈ విశ్వాన్ని సృష్టించాడు. కాబట్టి ప్రతి జీవి, ఇతర జీవులతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటం ద్వారా వ్యవస్థలో ఒక భాగమై వ్యవస్థ అందించే

ప్రయోజనాలను ఆస్వాదించడం నేర్చుకోవాలి. ఏ ఒక్క జీవి మరొక జీవి హక్కులను ఆక్రమించకూడదు, అతిక్రమించకూడదు” అని ఈశోపనిషత్తు పేర్కొంది.

మన గతం నేటికీ మనకు స్ఫూర్తినిస్తుంది. నవంబర్ 24, 2025న అయోధ్యలోని శ్రీరామ ఆలయంలో ప్రధానమంత్రి ‘ధ్వజారోహణ’ సందర్భంగా ధ్వజంపై కోవిదార చెట్టు ప్రాముఖ్యతను ఎత్తి చూపారు. ఇది మొదటి జీవసాంకేతిక శాస్త్రవేత్త కశ్యప మహర్షి మందార, పారిజాత చెట్లను సంకరం చేయగా ఉద్భవించినది. ఇది పురాతన విజ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తోంది. పవిత్రమైన మన సంప్రదాయాలను కొనసాగిస్తోంది.

**భారత్ ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లు**

భారత్ ప్రస్తుతం వాయు, నీటి కాలుష్యం, భూసార క్షీణత, నశిస్తున్న పరిరక్షణ మండలాలు, క్షీణిస్తున్న జీవ వైవిధ్యం వంటి అనేక పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. భారతీయుల జీవనశైలి భూమి పరిరక్షణకు కట్టుబడి ఉంటుంది. కానీ గత కొన్ని

ప్రక్రియలను పునఃపరిశీలించడం ద్వారా సుస్థిరమైన ప్రణాళికను రూపొందించడం కూడా ముఖ్యం. మీడియా సైతం పర్యావరణ పరిరక్షణకు అనుకూల మైన సందేశాలను ప్రచారం చేయడంలో తన వంతు పాత్రను రూపొందించుకోవాలి.

ఆర్థిక నిర్వహణకు సంబంధించి దేశంలోని అన్ని స్థాయిలలో పర్యావరణానికి సానుకూలమైన, ప్రతికూలమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు, జాతీయ సగటు కంటే ఎక్కువ అటవీ ప్రాంతాన్ని (విస్తీర్ణం లోనూ, సాంద్రత లోనూ) కలిగి ఉన్న



# పరివర్తనలు కీలకం

దశాబ్దాలుగా ప్రపంచంలో చోటు చేసుకుంటున్న పరిస్థితులు భారతీయులను గొప్పదైన వారి జీవనశైలికి దూరం చేస్తున్నాయి.

భారత్ శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల తోడ్పాటుతో ఒక సున్నితమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. దానికి బాధ్యత కలిగిన పౌరులను జోడించాలి. తద్వారా ఒక ఆచరణీయమైన పర్యావరణ సంస్కృతిని నెలకొల్పవచ్చు. భారత్ రాజ్యాంగ పరంగా కూడా, తన పర్యావరణ వ్యవస్థలను రక్షించుకోవడానికి తగినన్ని భరోసాలను కలిగి ఉంది.

**సొంత మార్గంలో ముందుకు**

ప్రభుత్వం పర్యావరణ పతనాన్ని ఆపడానికి ఎన్ని పనులు చేసినప్పటికీ అంతిమంగా ప్రజల్లో పర్యావరణ స్పృహ అనేది ఉండాలి. ఈ విషయంలో పంచ పరివర్తనలో ప్రస్తావించిన పర్యావరణ పరిరక్షణ చక్కగా పనిచేస్తుంది.

భారత్ గత కొద్ది కాలంగా పర్యావరణ పరిరక్షణకు పాశ్చాత్య నమూనాలను అనుకరిస్తోంది. కానీ మనం ఇప్పుడు నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్రజా రవాణా, వాయు కాలుష్యం వంటి విషయాల్లో పర్యావరణ పరిరక్షణకు మనకంటూ సొంత కార్యాచారణను రూపొందించి, అభివృద్ధి చేసి, ఆచరించడానికి సమయం ఆసన్నమైంది.

ప్రభుత్వంలోని మూడు అంగాలైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు వాటి విధానాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక పురస్కారాలు ఇవ్వాలి. ఆ పురస్కారాల ప్రయోజనాలు అడవుల్లో నివసించే వారికి చేరాలి. ప్రస్తుతం, మన వన్యప్రాణుల సంరక్షణ చట్టం పరిరక్షణ కార్యకలాపాలలో ప్రైవేట్ రంగం పాల్గొనడాన్ని నిరుత్సాహపరుస్తుంది. వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని సముచితంగా సవరించడం ద్వారా దేశంలో వివిధ స్థాయిలలో ‘వంతరా’ (జామ్ నగర్‌లో అతి పెద్ద ప్రైవేట్ వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, పరిరక్షణ కేంద్రం) వంటి వాటిని ప్రోత్సహించాలి. అదేవిధంగా, వన్యప్రాణుల సంరక్షణ చట్టం భారతదేశంలోని మైదాన ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంరక్షణను నిషేధిస్తుంది. కనుక మన పరిరక్షణ చర్యలను పునఃపరిశీలించి, ప్రస్తుత ధోరణు లకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉంది.

స్టార్టప్‌లు అభివృద్ధి చేస్తున్న అనేక అంశాలలో, స్వదేశీ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ ప్రస్తావించదగినది.

“భారత్‌లో తయారైంది. స్వదేశీ ఉద్యమానికి గర్వకారణంగా నిలిచింది. ఈ ఉద్యమంలో నవకల్పన సుస్థిరతతో సంగమిస్తుంది. వ్యర్థాల నిర్వహణ ప్రపంచ స్థాయి ఉత్పాదకతకు దారి తీస్తుంది. భారత్‌లో ఆవిర్భవించిన స్వదేశీ రథ చక్రాలు పురోగతి దిశగా వడివడిగా ముందుకు సాగుతాయి. వ్యర్థాల నిర్వహణలో ప్రజలకు మార్గదర్శనం చేస్తాయి. పర్యావరణాన్ని కాపుకాస్తాయి. అవి అధునాతనమైన పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ, వాటిని తిరిగి వాడటం, వనరుల సేకరణ, హరిత విధానాన్ని దేశీయ తయారీ నైపుణ్యంతో రూపొందించిన ఏకైక మొబైల్ వేదికపైకి చేరుస్తాయి. దీంతో సరికొత్త భారత్ ఆవిష్కృతమవుతుంది.

నవకల్పన అనేది మనలో నరనరాన ఇంకిపోయి ఉన్నది. నవకల్పన ద్వారా మన ప్రజలకు సుస్థిరమైన పరిష్కారాలను అందించాలి. పరిశుభ్రమైన నగరాలు, పల్లెల కోసం వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలి. ప్లాస్టిక్ నుంచి జౌళి రంగం వరకు స్వదేశీ ఉత్పాదకత ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేస్తుంది. స్వదేశీ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ, వాటిని తిరిగి వాడటం అనేది మనం ఎదుర్కొంటున్న అతి పెద్ద పర్యావరణ సవాళ్లలో కొన్నింటికి తగిన సమాధానం ఇస్తుంది. సుస్థిరమైన స్వదేశీ రథం కేవలం ఒక వాహనం కాదు. అది వృద్ధి చెందుతున్న భారత్ సామర్థ్యానికి ఒక సంకేతం. ప్రతీ ఇంటికి సుస్థిరతను అందుబాటులోకి తెచ్చే ఒక వాగ్దానం. సాంకేతికత, పర్యావరణం,ఉత్పాదక సామర్థ్యాన్ని సమ్మిళితం చేసే ఒక దృక్పథం. భారత్‌లో ఉద్భవించే సుస్థిరమైన స్వదేశీ రథం స్వదేశీ స్ఫూర్తిని అణువణువునా కలిగి ఉంటుంది. నవకల్పన చోదకంగా, సుస్థిరమైన ఉత్పాదకత ఇంధనంగా ముందుకు సాగుతుంది. అది పరిశుభ్రమైన, హరిత భవిష్యత్తును నిర్మించడానికి తనసుతాను అంకితం చేసుకుంటుంది.”

చివరిగా, ఆర్‌ఎస్‌ఎస్ ప్రవచిస్తున్న పంచ పరివర్తనలు భారతీయ సమాజానికి అన్ని విధాలుగా ఉపకరిస్తాయి.

– డా. శైలేంద్రకుమార్ జోషి

కథ

**‘ఊరోల్లందరికీ తెలియజేసుడేమనగా! రేపు తోట్లకు వంటలకు పోవాలె! ఎవరింట్లోనన్నా పొయ్యి ఎల్గిందంటి ఊరొల్లంతా ఎలేస్తరు! గిది ఊరిలోని పెద్దలందరి నిర్ణయం ఓహో!’ అంటూ డప్పు కొట్టి సాటిస్తున్నడు మస్కూరి సాయిలు. డప్పు సప్పుడుకు పోరాగాల్లంతా వాని సుట్టూ జేరి ఇంటున్నరు. సాయిలు ఆడ ఆడ నిలవడి సాటింపేస్తున్నడు.**

‘తోట్లకు లేదు ఏమి లేదు పోయి బయట ఆడుకొ్రని!’ కసురుకుంటూ అన్నది వనజ.

గప్పుడే ఇంట్లకొస్తున్న తండ్రిని సూషి ‘బాపు..! మనం తోట్లకు పోదామా రేపు?’ పిల్లలు అడుగుతుంటే మధ్యలోనే అందుకుని ‘వద్దని’ కోపమయింది వనజ.

‘గదేంటిదే పిల్లల్ని గట్ల కసురుతవు గాళ్లు గిప్పుడే మడిగింద్రు ఊరొల్లందరి లెక్క తోట్లకు పోదాం అన్నరు’ కొడుకు మొఖాన్ని సూసుకుంటూ కోపంగా అంది భూలచ్చుమ్మ.

‘అత్తమ్మ నువ్వు మధ్యలకు రాకు ఆయన కేమన్న అయితే నా గతి నా పిల్లల గతి ఎట్లా గానాటి పంచాది తలుచుకుంటేనే నాకు శెమటలు పడుతున్నయి’ భయంతో శెప్పింది వనజ.

‘ఎద్దు లేని ఎవుసము’ యజమాని సూసుకోని ఎవుసము ‘ఏట్ల వద్ద ఎరువు లెక్క’. ఏడాది కెల్లి శేను మొఖం చూసుడు లేదు జీతగాళ్లు ఏం శేస్తున్నరు? ఏం పండిస్తున్నారు. సూసుడే లేకపోయా.. గట్ల అయితే అంతా అమ్ముకోవాలి. నలుగురికి కూడుబెట్టిన ఇల్లు గిట్ల అయితే మనమే అడుక్కొని తినాలె’ కళ్లల్ల గంభీరం కొట్టొస్తుంటే మాట్లాడుతూనే ఉంది భూలచ్చుమ్మ.

‘నువ్వు తోట్లకు పోతా అంటే పో! నీ కొడుకును పొమ్మనకు నువ్వు బలిమి జేసి తీస్కపోత నేను ఈడనే పానం తీసుకుంటా!’ కండ్లల్ల నీళ్లు తీసుకుంటూ పిల్లలను దగ్గరకు తీసుకుంది వనజ.

‘నీకు గంత భయం ఎందుకే? శేన్లున్నప్పుడు గెట్లు,

# తోట్లలు

**మహ్మద్ షరీఫ్**



‘నానమ్మ తోట్లకు పోవుడంటే ఏందే!’ కొత్త మాటలను తెలుసుకోవాలని ఉరుక్కుంటూ వచ్చి అడిగిండు సాయి.

‘నాకు ఎరికే! నాకు ఎరికే! ఎవరి చేన్లకు వాళ్లు ఏవుడు గంతే కదా! నాన్నమ్మ?’ అని తన తెలివిని చూపించు కోవాలని అన్నది సింధు.

‘అవునర్రా ప్రతి ఏడు ఊరంతా అనుకోని ఊర్ల వంటలు చేయకుండా వాళ్ల వాళ్ల చేన్లల్లకు, పడ్ల తోట్లల్లకు ఏవాలి. పొద్దుగాల సంధి పొద్దుగూకేదాకా గాడనే ఉండి, వొంటలు శేస్కోని తిని శీకటి పడ్డాక ఇంటికి రావాలి’

‘గట్ల ఎందుకు పోతరే నాన్నమ్మ’ అని గావురంగా అడిగిండు సాయి.

‘ఏడాది కొక్క రోజైనా ఇడ్లల్లో కెల్లి బయటికెళ్లనోళు గిట్లనన్న తోట్లల్లకు పోయి తన శేను శెలక చూసు కొనుడుకు. ఆ పచ్చని చెట్లు పంటల నడుమ తిరుగుతూ మంచి గాలి పీల్చుడు, అందరితోని కలుసుడు, మాట్లాడు కొనడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నయి’ అని చెప్పవట్టింది భూలచ్చుమ్మ.

‘అమ్మ మనం రేపు తోట్లకు వంటలకు పోతున్నామా!’ వంట శాలలున్న తల్లిని అడిగింది సింధు.

పంచాయతీలు ఉండనే ఉంటయి. ఒస్తనే ఉంటయ్ పోతనే ఉంటయ్, దానికి భయపడతమా?'

'ఏమో అత్తయ్యా.. అతన్ని ఒంటరిగాన్ని జేసి ఆళ్లు కొట్టి సంపితే! ఎప్పుడైతే గేట్ల పంచాయతీ అయ్యిందో ఆళ్లు సంపుతామని ఖరాఖండిగా అప్పుడే శెప్పింద్రు! ఎప్పుడు ఎవరు తగాదా పడ్తరో అని నేను భయంతో సస్తున్న' కండ్లు తుడుచుకుంటూ అంది వనజ.

'నీ మొఖం వాల్లేం జేస్తరే! మీ మామ భుజం మీద కండువా, శేతి కఱ్ఱ పట్కోని ఇండ్లకెల్లి బయట కెల్లంగనె ఎవ్వరు ఎదురు నడిచే టొల్లు కాదు! నమస్తే పటేలా! నమస్తే దొరా! అని దూరం దూరం లిలవడేటొల్లు గటువంటి ఆయన కడుపున పుట్టినోడు పులి లెక్కనే ఉంటడు'.. కొడుకు రాజిరెడ్డి మొఖం సూసుకుంటూ రోషంతోని చేతులు ఊపుకుంటూ అన్నది భూలచ్చమ్మ.

'గదంతా ఏమి కాదే గెట్లు జరిపినప్పుడే వాళ్లను గెదిమి! గెదిమి! కొట్టిన గాళ్లు నన్ను కొట్టేంత మొనగాల్లా? మీరేమి భయపడొద్దు' మీసాలను తిప్పుకుంటూ అన్నడు రాజిరెడ్డి.

'మీరందరూ తోట్లకు పోతమంటే నేను గింత ఇసం తాగి సస్తా!' ఏడుస్కుంట వంట గదిలకెల్లింది వనజ.

* * *

ఊరు ఊరంతా కదిలిపోతున్నరు తోట్లల్లకు. బండ్ల మీద, కఱ్ఱాల మీద, సైకిల్ల మీద, వంట సామాను తీసుకొని ఇండ్లకు తాళాలు వెట్టి పోతున్రు. ఊరంతా సడీ సప్పుడు లేకుండా శీమ శిట్కు మన్నా ఇనిపించినట్టాయె.

పానాజీల నడుస్కుంటు, గీశేను గీల్లది, గీశేను గీల్లది అని పిల్లలకు శెప్తుంది భూలచ్చమ్మ. పానాజిల ఇస్కల నడుస్కుంటు, పచ్చని శెట్ల గాలికి, వాటిపై కూర్చున్న పక్షులను సూస్తూ కేరింతలు కొడుతూ వారి శేనుకు శేరుకున్నరు.

జీతగాళ్లు, పనోళ్లు సామాన్లు దింపుకొని వంటకు అన్ని తయ్యార్ శేయవట్టింద్రు. చాలా రోజుల తర్వాత తోటకు రావడం వల్ల యవ్వం ఎట్లుందో సూద్దామని తల్లి కొడుకులు తిరుగుకుంటు సూస్తున్నరు. ఆళ్ల ఎంట మనుమడు, మనుమరాలు 'ఇదేమి పంట, ఇదేం చెట్టు' అని అడుగుతున్నరు.



**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

ఒక్కసారి పెద్ద దిగుడు బావిని సూడంగనే పిల్లల పాణాలు పైపైకే పోయినట్ల య్యింది. 'నాయనమ్మ గింత పెద్ద బాయి చూస్తే భయమేస్తుంది అంటూ పిల్లలు దూరం జరిగింర్రు.

'మీ తాత ఎవ్సం జేసినప్పుడు నేను దిగి నీళ్లు ముంచుకొచ్చేదాన్ని. సుట్టుముట్టు ఎవ్వరు ఉండేటోళ్లు కాదు. గట్ల ధైర్యంతోని బతికినోళ్లం' అంటూ ఆనాటి ముచ్చట చెప్పవట్టింది భూలచ్చమ్మ.

'నానమ్మ నీవు పొరపాటున కాలు జారిపడితే ఎట్లా నీళ్లలో?' అని అడిగింది సింధు.

'పడితే ఏమైతది నాకు ఈతొచ్చు సిడీల దాక ఈదుకుంట వచ్చి పైకెక్కి వస్తా' అంది భూలచ్చమ్మ.

'నానమ్మ నీకు ఈతొచ్చా' అంటూ ఆశ్చర్యంగా అడిగింర్రు పిల్లలు.

'నాకే కాదు రా! మా కాలంలో ఆడమగ తేడా లేకుండా అందరికీ ఈతొస్తుండే. ఎందుకంటే బట్టలుత్కుడు నీళ్లు తెచ్చుడు చెర్లు, బాయిల మీదనే ఆధారం. ఇండ్లల్ల బాయిలు లేవు. అక్కడక్కడ ఊర్ల సర్కార్ బాయిలుండె. ఆడ ఎప్పుడు నిండుగా మనుషులు. అందుకే శెర్ల కెల్లి బట్టలు ఉత్కుడు, బర్లను గడుక్కునేటొల్లము. గందుకే అందరు ఈత నేర్చుకునేటోళ్లు'

భూలచ్చమ్మ కొడుకును మనుమన్ని మనుమరాల్ని తనెంట తీసుకొని చేను ఆ కొన నుంచి ఈ కొన దాక ఏమేమి పంటలున్నాయో ఏయే పనులు నౌకర్లకు శెప్పాలో కొడుకుకు శెబ్తుంది.'మంటి కైనా ఇంటోడు' ఉండాలె బిడ్డా ! లేకుంటే పాడైతది అన్నది.

వనజ ఇద్దరి పనోల్లను తీసుకొని వంటపని చేస్తున్నది.

గంతలనే పక్క చేన్ల కెల్లి వీరారెడ్డి భార్య వంట చేస్తున్న వనజ దగ్గరికి రావట్టింది. తన దిక్కుకే అస్తున్నామెను సూపి వనజకు చెమ్టలు పట్టినై.

'పటేలమ్మా! ఎందుకు భయపడుతున్నొ మేమున్నం'

మనుషులలో ఇసం లేకుండా మాట్లాడుకుంటు పగమర్చి ఉల్లాసంగా ఉండటం వలన సంతోషంగా బత్కొచ్చు. 'పగతో బత్కితే పాము పక్కలున్నట్లు పగ మర్చిపోయి బత్కితే పరమేశ్వరునితో' ఉన్నట్లు అందుకే 'సంతోషమే సగం బలం' అన్నరు. 'కలిసి ఉంటే కలదు సుఖం సంతోషం' అందరికి. 'అందరు ఈడనే భోంచేయండ్రి' ఆర్డరేసింది భూలచ్చమ్మ.

అని ఇద్దరు పనోళ్లు ధైర్యం శెప్పినా ! ఆమెకు భయం తగ్గలేదు.

'నేను ముందే శెప్పిన. ఈ తోట్ల వొంటలు వొద్దని. నేను జెప్పితే ఎవ్వరు ఇనిపించుకోరు. 'పాలిపగ పాము పగ' లెక్కుంటది. ఎంత మొత్తుకున్నా తల్లి కొడుకులు నా మాటలను ఖదర్ శేయలేదు. దేవుడా ఇప్పుడు ఎట్లన్నా కాపాడు ' అని వనజ తన మనసులోనే దేవుండ్లను తల్వవట్టింది.

దూరం నుండే ఇది గమనించిన భూలచ్చమ్మ అడుగులు పెద్దపెద్ద గేసుకుంటూ రానే వొచ్చింది.

'ఏందే ఏంది? గిట్లొచ్చినవు మా వొంటకాడికి ఏమి సంగతి' అని గద్దించినట్లు అడిగింది.

తలకాయ దించుకొని 'అత్తమ్మ! అత్తమ్మ! గది పులుసు, పులుసు విస్కెతందుకు చిన్న బగోనె కావాల్నని వొచ్చిన' అని వొనుక్కుంటూ శెప్పింది వీరారెడ్డి భార్య.

'నీకు ఎవరే అత్త? నీ మొగడు నా భూమిని గట్టు దాటి దున్ని తప్పని శెప్పిన నా కొడుకుని సంపుత నంటడా! వానికి గంత మదమా?'అని ఊగిపో సాగింది భూలచ్చమ్మ.

'ఇది శైలికి శిలికి గాలివాన కావట్టి దేవుడా దీన్ని సల్లవడగొట్టు' అని మనసుల మొక్కవట్టింది వనజ.




'గట్టుపంచాతి అయినప్పటి సంది మా పశు వుల్ని, నాగళ్లను మీ చేన్లో నుంచి రానిస్తలేరు మీ జీతగాళ్లు. మా చేన్లకు పోవాలంటే సుట్టూ తిరిగి పోవాలి శాలా కష్టమైతంది'

'మీతోని కొట్లాడి పెద్ద తప్పు శేషినమని మీ తమ్ముడు రోజు దల్చుకుంట బాధపడుతున్నడు క్షమించు. పాల్యొల్ల కొట్లాట అయితది కలుస్తము. ఎప్పటి కైనా మాట్లాడకుండా ఎండా ఉంటే నడుస్తదా బావ!' అని రాజిరెడ్డిని బతిమాలింది వీరారెడ్డి భార్య.

'అప్పుడు ఏమైందే వీరి గాని సోయి! వాని తెలివి ఏటువొయ్యింది! నా కొడుకును సంపుత నంటడా వాడు!' కోపంతో అరిచింది భూలచ్చమ్మ.

'ఆయన దోస్తులు తాగిపిచ్చి మీ మీదికి ఉపిగొల్పి తెచ్చింర్రు. అది ఒక శని గడియ పెద్ద మనసుతోని తప్పు కాయిండి' అని వీరారెడ్డి భార్య ఎళ్లిపోతుంటే!

'ఆగు! వనజ దానికి కేమవసరముందో అది ఇచ్చి పంపు' అని కోడలికి శెప్పింది భూలచ్చమ్మ.

చిన్న పాత్రనిస్తూ 'మళ్లీ తెచ్చి ఇవ్వు' అంది వనజ.

'తేవడమే గాదు... మీరు చమిస్తామంటే అందరిని తీసుకొచ్చి మీకు చమాపణ శెప్పిస్తా! వాళ్లు దాని గురించే ఎదురు సూస్తున్నరు' అంటూ జవాబుకు చూడకుండా పాత్రను తీసుకొని వెళ్ల సాగింది.

'రమ్మను. ఇప్పుడు కాకున్నా ఎప్పుడైనా కలిసేటోల్లమే కదా!' హుందాగా పలికింది భూలచ్చమ్మ.

కొంతసేపటికి వీరారెడ్డి తమ్ముళ్లు మరదళ్లు, పిల్లలు అందరూ గుంపు లెక్క ఇక్కడికి రావట్టింర్రు.

మల్ల వనజకు సల్లశెమ్టలు రావట్టి! 'నిజంగా కల్వడాని కొస్తుండ్రా? లేకుంటే కొట్లాట కోస్తుండ్రా?' మళ్లీ దేవున్ని మనసుల తల్వవట్టి.

అందరు వరుసగా భూలచ్చమ్మ, రాజిరెడ్డి కాళ్ల మీద పడి చెమించమని అడిగింర్రు.

పిల్లలందరు రాజిరెడ్డి పిల్లలతో మాట్లాడడం జరిగాక ఒక కొత్త ఖుషి వొచ్చినట్లయింది.

మనుషులలో ఇసం లేకుండా మాట్లాడుకుంటు పగమర్చి ఉల్లాసంగా ఉండటం వలన సంతోషంగా బత్కొచ్చు. 'పగతో బత్కితే పాము పక్కలున్నట్లు పగ మర్చిపోయి బత్కితే పరమేశ్వరునితో' ఉన్నట్లు అందుకే 'సంతోషమే సగం బలం' అన్నరు. 'కలిసి ఉంటే కలదు సుఖం సంతోషం' అందరికి

'అందరు ఈడనే భోంచేయండ్రి' ఆర్డరేసింది భూలచ్చమ్మ.

'అక్కడి వంటలు అట్లనే ఉంటయి!

ఎట్లా?' అన్నది వీరారెడ్డి భార్య.

'అవి అన్ని ఈడ్కి తీస్కరండ్రి. అందరం కలిసి భోజనం చేద్దాం' అంది వనజ.

అక్కడి వొంటలు తెస్తందుకు వీరారెడ్డి కుటుంబం సభ్యులు వారి శేను వైపు అడుగులు వేశారు. ★



సూర్యుడు ఉత్తరాయనంలోకి ప్రవేశించే ముందు వచ్చే ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అంటారు. పురాణగాథను బట్టి దక్షిణాయనంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి)నాడు యోగనిద్రకు ఉపక్రమించిన శ్రీమహావిష్ణువు, కార్తిక శుద్ధ ఏకాదశి (ఉత్థాన ఏకాదశి) నాడు మేల్కొని మార్గశిర శుద్ధ ఏకాదశి (ముక్కోటి/వైకుంఠ) నాడు సర్వాలంకార భూషితుడై శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనరూఢుడై ఉత్తర ద్వార దర్శనాన్ని అనుగ్రహిస్తాడు. ఈ దర్శనం ద్వారా 'మోక్షం' సిద్ధిస్తుందనే విశ్వాసంతో 'ఈ ఏకాదశిని 'మోక్షోత్సవ' దివసమనీ వ్యవహరిస్తారు. మహర్షులు, దేవతా, పితృగణాలు ఆనాడు వైకుంఠనాథుడి దర్శనం కోసం వేచి ఉంటారని ప్రతీతి.

# ముక్తిమార్గం ఉత్తర ద్వార దర్శనం

'విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు' అన్నారు పదకవితా పితామహుడు అన్నమాచార్య. అలా విశ్వమంతా విస్తరించిన విష్ణుశక్తిని ఆవహింప చేసుకొని ప్రతికూల శక్తులను నిలువరించే తిథి వైకుంఠ ఏకాదశి అని పద్మపురాణం పేర్కొంటోంది. ధనూరాశిలో సూర్యుడు సంచరించే మాసం ధనుర్మాసంకాగా, ఈ మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి అని వ్యవహరిస్తారు. వైకుంఠమంటే జ్ఞానసాగరమని శంకర భగవత్పాదులు అభివర్ణించారు.

ఈ ఏకాదశికి ఎన్నిపేర్లు ఉన్నా మోక్షమే అంతిమ లక్ష్యం. ఆ రోజున ముక్తిద్వారాలు తెరచి భగవంతుడు భక్తులను అనుగ్రహిస్తాడని విష్ణుపురాణం చెబుతోంది. నెలకు రెండు చొప్పున ఏడాదికి 24 ఏకాదశులు, అధికమాసంలో మరో రెండు వస్తాయి. ప్రతి ఏకాదశి పవిత్రమైనదే అయినా, వైకుంఠ ఏకాదశి వాటికి భిన్నమైనదిగా చెబుతారు. అన్ని ఏకాదశులను చంద్రమానం ప్రకారం గణిస్తే దీనిని మాత్రం సౌరమానంతో లెక్కిస్తారు.

ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, ఇద్దరు అశ్వనీదేవతలు... మొత్తం 33 మంది సృష్టి నిర్వాహకులు కాగా, పర్యవేక్షణాధిపతి శ్రీమహావిష్ణువు అని వేదం చెబుతోంది. వారంతా ఆయనకు తమ విన్నపాలను నివేదించి, కైంకర్యాలు సమర్పించేందుకు ముక్కోటినాడు తరలివస్తారని, వారు వెళ్లే దారి 'వైకుంఠ ద్వారం' పేరని చెబుతారు. వారి బాటలో నడచి విష్ణువును సేవించుకున్న వారికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. అలా దానికి 'స్వర్గద్వారం' అని పేరు వచ్చింది. దక్షిణాయనంలో దేహత్యాగం చేసిన జీవులు ఇదే రోజున స్వర్గారోహణ చేస్తారనే విశ్వాసం కారణంగా ఈ తిథి 'స్వర్గ ద్వారం' గా ప్రసిద్ధమైంది. ఈ తిథికి 'హరివాసం, వైకుంఠ దినం' అనీ పేరు. ఆనాడు చేసే పూజాదికాల వల్ల కుటుంబ శ్రేయస్సు కలగడంతో పాటు పితృదేవత లకు పుణ్యఫలం దక్కుతుందని విశ్వాసం. పూర్వం విఖానసుడు అనే రాజు పర్వత మహర్షి హితవు ప్రకారం, ఏకాదశి వ్రతాన్ని ఆచరించి, పితృదేవతలకు నరకలోకం నుంచి స్వర్గలోక ప్రాప్తి కలిగించాడట.

శ్రీ మహావిష్ణువు ఒక మన్వంతరంలో వికుంఠ అనే మహిళకు కుమారుడిగా జన్మించడం వల్ల ఆయనకు వైకుంఠుడు అనే పేరు వచ్చిందని అమరకోశం పేర్కొంటోంది. 'కుంఠ' అనే మాటకు మొక్కపోవడం అనే అర్థమూ ఉంది. మహావిష్ణువు మనలోని అరిషడ్వర్గాలను నిర్వీర్యం (వికుంఠం) చేస్తాడని చెబుతారు. మురాసుర సంహారానికి వైకుంఠం నుంచి వచ్చిన తిథి కనుక వైకుంఠ ఏకాదశి అని పురాణకథనం. కురుకుల పితామహుడు భీష్ముడు, తన తండ్రి శంతనుడు ప్రసాదించిన 'స్వచ్ఛంద మరణం' వరంతో ఉత్తరాయణం ప్రవేశించిన తరువాతనే దేహత్యాగం చేశాడు.

శ్రీమహావిష్ణువు అలంకార, సామ గానలోల ప్రియుడు. వైకుంఠ ఏకాదశి నాడు ఆలయంలో కానీ, ఇంటి వద్ద కానీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలతో అలంకరిస్తారు. పూజకు ప్రధానంగా తామరపూవులు, తులసి వినియోగిస్తారు. పాయసం లాంటి మధుర పదార్థాలు నైవేద్యంగా సమర్పిస్తారు. అష్టాక్షరీ జపంతో పాటు స్తోత్రాలు ఆలపిస్తారు. ఇలా అర్చన, జపం, ధ్యానసాధనల ద్వారా వైకుంఠపతి అనుగ్రహం కలుగుతుందని చెబుతారు.

శ్రీరంగం, తిరుమల, భద్రాద్రి సహా అన్ని విష్ణు క్షేత్రాలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీరంగ క్షేత్రంలో ఈ రోజు (ముక్కోటి) నుంచి 21 రోజులు పగలు (పగల్ పాథ్), రాత్రి (ఇరుల్ పాథ్) అని రెండుగా విభజించి విష్ణునామ సంస్మరణతో దర్శనభాగ్యం కలిగిస్తారు. శ్రీవైష్ణవాళ్వారులతో ఒకరైన నమ్మాళ్వార్ ఈ తిథి నాడే పరమపదించడం వల్ల వారు దీనికి విశేష ప్రాధాన్యమిస్తారు.

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామికి ఈ ఏకాదశికి ముందువచ్చే మంగళవారంనాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశినాడు ఉత్తరద్వార దర్శనం మరునాడు స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు.

**'మంగళం భగవాన్ విష్ణుః మంగళం గరుడధ్వజా / మంగళం కమలాకాంతమ్ త్రైలోక్యం మంగళమ్ కురు'**



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్



## మార్క్సిజం-శ్రీరామరాజ్యం

**జగత్తులో మానవుడు అన్వేషించి తెలుసుకోజాలని వస్తువు అంటూ ఏదీ లేదు అంటాడు మార్క్స్. సత్యత్వ ప్రమాణాలకు అనుగుణంగా మనం స్వీయ కల్పనలు చేసుకోగలిగితే వస్తుస్వరూపం సంపూర్ణంగా అవగతమవుతుంది అంటాడు ఏంగెల్స్. ఈ రెండు విషయాలపై శ్రీకరపాత్రీ స్వామి చేసిన విశ్లేషణ ఇదీ...**

# తెలుసుకోవాల్సిన సత్యాలు

ఏంగెల్స్ మాటల్లో, 'భౌతిక అస్తిత్వం, మననం, ప్రకృతి ఇంకా జీవాత్మల అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నయే తత్త్వశాస్త్రానికి ముఖ్య ప్రశ్న.' ఆదర్శవాదులు జీవాత్మను మొట్టమొదటే ఉన్నదానిగా అంగీకరిస్తారు. భౌతికవాదులు ప్రకృతిని అంగీక రిస్తారు. మార్క్స్ చెప్పేదేమిటంటే, 'ఏ భూతమైతే చింతన చేస్తుంటుందో... ఆ భూతమునుంచే చింతన మళ్లీ చేయడం సాధ్యం కాదు. ఏ జ్ఞానం ప్రయోగం – అనుభవం ద్వారా పర్యాప్తం అయిందో అదే వాస్తవిక జ్ఞానం అంటే. అట్టి జ్ఞానమే బ్రహ్మమై జగత్తుతో కలిసిపోతుంది. జగత్తులో అజ్ఞేయ (తెలియబడరాని) వస్తువు అంటూ ఏదీ లేదు. జగత్తును – దాని నియమాలను పూర్ణరూపంలో తెలుసుకోవచ్చు. అయితే ఇప్పటికిప్పుడే మనం దాని పూర్ణరూపాన్ని ఎందుకు తెలుసుకోలేకపోతున్నాం అనేది వేరొక సంగతి.'

పైన చెప్పిన విషయాలపై విచారణ చేసినప్పుడు అర్థమయ్యే విషయం ఏమిటంటే... మానవుడు ప్రపంచాన్ని అంతటినీ దాని నియమాలతో సహా తెలుసుకోగలడా లేదా అన్నది ఇప్పటికీ అనుమానమే. ఎందుకంటే ఇప్పటివరకూ సంపూర్ణ జగత్తు సంగతి పక్కన పెట్టి... కేవలం ఒక్క సూర్యునిలో ఎంతటి తత్త్వమున్నదో... దానినంతటినీ తెలుసుకునేంతగా అన్వేషణ జరగనే లేదు.

ఒక్క బొగ్గుముక్కలో, మట్టిముద్దలో, నూనెలో... ఆఖరికి ఒక పరమాణువులో ఎంతటి శక్తి ఉన్నది అనే అంశాలపై పూర్తి పరిజ్ఞానమూ మనం సంపాదించుకోలేక పోయాం. విజ్ఞానం వల్ల వచ్చిన బలిమి చేత నేటి వైజ్ఞానికులు ఒకానొక విషయానికి సంబంధించిన పూర్ణ పరిజ్ఞానం సాధించామని బుకాయిస్తున్నారు.

ఈ క్రమంలో ఒకనాడు వారు తాము ఏయే సంగతులు మరిచిపోయారో వాటిని గురించిన ఎరుక కూడా రాగలదు. ఏ వస్తువునైతే ఫలానా రోగాన్ని తగ్గించగల ఔషధంగా నేడు భావిస్తున్నారో... అదే వస్తువును భవిష్యత్తులో హానికారకంగా భావించాల్సిన స్థితి ఏర్పడవచ్చు. తనకంటే భిన్నమైన సకల వస్తువులనూ మానవునితో పోటీ పడుతూ ఎవరు ఎక్కడినుంచి రూపొందిస్తున్నారో నేటివరకు మనం తెలుసుకోలేకపోయాం. అంతకంటే పైనున్న దానిని తెలుసుకోవాలనే ఆశను బుద్ధిమంతుడైనవాడు ఎవడైనా పెట్టుకోగలడా? ఏ రసాయనాల సంయోగం ద్వారానో, యంత్రాల ద్వారానో, సంపూర్ణ ప్రపంచం... దానిలోని వైచిత్రులను ఎవరు తెలుసు కోగలుగుతారు?

మేడిపండు లోపలే బతికే అసంఖ్యాక పురుగులు పండుకు బైటనున్న వార్తలను ఎలా తెలుసుకోలేవో... అలాగే అతిచిన్నదైన భూగోళం... ఒక చిన్న బ్రహ్మాండం లోపల జీవించే జంతువుల వంటి మానవుడు తాను సర్వజ్ఞుడినని ప్రకటించుకున్నాడంటే ఇది సాహసం మాత్రమే. తాను చూసిన అల్పసంఖ్యాక జీవితాల తీరుతెన్నులను విశిష్టంగా భావించి... లక్షలాది జీవుల జీవన్మరణాలను తెలుసుకోవడానికి మానవుడు అంతటి శక్తిశాలి కాదు. అయినప్పటికీ వాటిని రస, వీర్య, గుణ, వికారాదుల ద్వారా తెలుసుకోవాలి అనుకోవడం ఎలాంటిదంటే... చీమను అధిరోహించి ఆకాశానికి పోవాలనుకోవడం లాంటిది.

ఏంగెల్స్ చెప్పిన ఈ కింది విషయం సరైనది కాదు. 'ఒకవేళ మనం ఏదైనా ఒక స్వీయకల్పన చేసుకుని, దానిని సత్యత్వ ప్రమాణం కోసం నిలిచేలా స్వయంగా రూపొందించ గలిగితే... దానిని తనవైన అవశ్యకతల నుంచి బయట పడవేసి, మనదైన వ్యవహారాల కోసం పని చేసేలా చేయగలిగితే... అప్పుడు కాంటే చెప్పిన వస్తుస్వరూప సిద్ధాంతం అంతమైపోతుంది.' ఇది సమర్థనీయం కాదు.

కారణం... అటువంటి దానినుంచి కూడా ఉపయుక్తమయ్యే తర్కానికి సమాధానం చిక్కదు. మానవుడు తన కన్నులతో చూసి, చెవులతో విని... వాటికి సహకరించే భౌతిక సాధనాల ద్వారా ఎంతో నేర్చుకుంటున్నాడు అనడం సరైనదే. కానీ అంతమాత్రం చేత అతడు అన్నింటినీ తెలుసుకోగలడు అనేది మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే ఇంద్రియాలు, వాటికి సహకరించే సాధనాలకూ ఒకే ఒక సరిహద్దు అంటూ ఏదీ లేదు. యోగం నుంచి ఉద్భవించి అతిశయించిన శక్తిచేత అట్టి సరిహద్దులను లంఘించడానికి యోగి సమర్థుడు అవుతాడు.

కన్నుల ద్వారా రూపం కనిపిస్తూ ఉంటుంది. కానీ రూపం ద్వారా లేదా కన్నుల ద్వారా కన్నులను చూడడం సాధ్యం కాదు. మనసు ద్వారా చక్షురింద్రియం చేసే వ్యవహారాలకు మద్దతు – పటుత్వం మొదలైనవి అవగతం అవుతాయి. కానీ చక్షువుల ద్వారా మనసు చేసే వ్యవహారాలకు సంబంధించిన జ్ఞానం లభించదు. మనసు ద్వారానే మనసు జాడ పసిగట్టవచ్చు. కానీ మనసు లేదా అహంస్ఫురణ మొదలైనవన్నీ దేనివల్ల ప్రకాశిస్తాయి? వాటి గురించిన జ్ఞానం ప్రకాశమాత్రంగానే ఉండే మనసు లేదా అహం వల్ల ఏ విధంగా లభించ గలదు? సర్వవిజ్ఞాత అయిన వాడిని దేనిద్వారా మనం తెలుసుకోగలం?

'విజ్ఞాతారమరే కేన విజానీయాత్' (బృహదారణ్య కోపనిషత్తు) కర్మిష్ఠులై అగ్నిముఖంగా కూర్చుని తపించిన వారికి... ఆ బలం వల్ల అనేక సూక్ష్మ రసాయనాలను గురించిన బోధ కలుగుతుంది. దానివల్లనే దృశ్యమన్నదే లేని దృక్కును తెలుసుకో గలుగుతారు. ఇది భ్రమకాదు.

**(వచ్చేవారం...'అజ్ఞాని – సర్వజ్ఞుడు')**

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**

**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**



# 2025లో అరుదైన విజయాల క్రీడా'భారతం'!

**భారత క్రీడారంగం గత ఏడాదికాలంలో కళ్లు చెదిరే అరుదైన, అపురూప విజయాలతో మెరిసి మురిసింది. ప్రపంచ మహిళా క్రికెట్‌లో ట్రోఫీలతో పాటు తొలిసారిగా ప్రపంచ స్కేటింగ్, ప్రపంచ స్క్వాష్ పోటీలలో పతకాల మోత మోగించింది.**

భారత క్రీడాచరిత్రలో 2025 సంవత్సరం అత్యంత విజయవంతమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుంది. క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, విలువిద్య లాంటి ప్రధానక్రీడలతో పాటు.. స్కేటింగ్, స్క్వాష్ లాంటి క్రీడల్లోనూ అంచనాలకు మించి రాణించింది.

## క్రికెట్‌లో ' తీన్మార్' షో...

క్రికెట్‌లో పురుషుల, మహిళలజట్లు కళ్లు చెదిరే విజయాలతో వారేవ్వా! అనిపించుకొన్నాయి. దుబాయ్‌లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (మినీ ప్రపంచకప్)ను రోహిత్ శర్మ నాయకత్వంలోని జట్టు రెండోసారి గెలుచుకొని తనకుతానే సాటిగా నిలిచింది. ఈ టైటిల్ పోరులో మాజీ చాంపియన్ న్యూజిలాండ్‌ను కంగుతినిపించింది. 2013లో మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలో తొలిసారిగా మినీ ప్రపంచకప్ నెగ్గిన భారత్ 2025 టోర్నీలోనూ విజేతగా నిలిచింది. 2025 ఆసియా టీ-20 క్రికెట్ సమరంలోనూ భారత్ కు ఎదురేలేకపోయింది. టైటిల్ పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను కంగు తినిపించడంలో తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ కీలక పాత్ర పోషించాడు.

భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో నవీముంబైలో జరిగిన ఐసీసీ మహిళా వన్డే ప్రపంచకప్-2025ను భారత్ దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. బధిరుల మహిళా ప్రపంచకప్‌ను సైతం భారత్ మొదటిసారిగా గెలుచుకొని జాతీయ క్రికెట్ ఖ్యాతిని మరింతగా ఇనుమడింప చేసింది.

2023 ప్రపంచకప్‌లో కాంస్య పతకం మాత్రమే నెగ్గిన భారత్ 2025 ప్రపంచకప్‌లో స్వర్ణ పతకం అందుకోడం విశేషం. బ్యాడ్మింటన్‌లో భారత్‌కు మిశ్రమఫలితాలు ఎదురయ్యాయి. సుదీర్మన్ కప్ మిక్సిడ్ ప్రపంచ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో మాజీ చాంపియన్ భారత్ కేవలం 9వస్థానానికే పరిమిత మయ్యింది. డేవిస్ కప్ టెన్నిస్ అర్హత పోటీలలో స్విట్జర్లాండ్ పై సంచలన విజయం సాధించడం ద్వారా భారత్ సుదీర్ఘవిరామం తరువాత క్వాలిఫైయర్ రౌండ్‌కు అర్హత సాధించగలిగింది.

న్యూఢిల్లీ వేదికగా నిర్వహించిన మొట్టమొదటి ప్రపంచ ఖో-ఖో కప్ పోటీలలో ఆతిథ్య భారత్ జంట స్వర్ణాలు సాధించింది. పురుషుల ఫైనల్లో 54-36 పాయింట్లతో నేపాల్‌ను, మహిళల స్వర్ణం పోరు లోనూ నేపాల్ నే భారత్ అధిగమించి ప్రపంచ ట్రోఫీ అందుకొంది.

బీహార్ రాజ్‌గిరి స్టేడియం వేదికగా జరిగిన ఆసియాకప్ హాకీ టైటిల్‌ను మూడుసార్లు విజేత భారత్ అలవోకగా గెలుచుకొంది. అయితే పలు దేశాలతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్ ల్లో మాత్రం భారత్ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయింది. దోహా వేదికగా జరిగిన ప్రపంచ షూటింగ్ పోటీలలో భారత్ 2 స్వర్ణ, 3 రజత, ఓ కాంస్య పతకంతో సత్తా చాటుకొంది

ఉత్తరాఖండ్ వేదికగా జరిగిన 2025 జాతీయ క్రీడలు, లడాఖ్ ఆతిథ్యమిచ్చిన 2025 ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ పలు సరికొత్త జాతీయ రికార్డులతో విజయవంతమయ్యాయి. దుబాయ్ వేదికగా జరిగిన 2025 ఆసియా పారా క్రీడల్లో భారత్ 102 పతకాలతో మోత మోగించింది. ఇందులో మొత్తం 36 బంగారు పతకాలు ఉండటం మరో విశేషం. స్క్వాష్ ప్రపంచకప్‌ను భారత్ మొట్టమొదటిసారి గెలుచుకోడం ద్వారా మరో సరికొత్త క్రీడలో తన ఆధిపత్యాన్ని చాటుకోగలిగింది. చెన్నై వేదికగా జరిగిన 2025 ప్రపంచ స్క్వాష్ కప్ టైటిల్ సమరంలో హాంకాంగ్‌ను 3-0తో చిత్తు చేయడం ద్వారా భారత్ సరికొత్త చాంపియన్‌గా అవతరించింది. ఆసియాఖండంలోనే ఈ ఘనత సాధించిన తొలిదేశంగా భారత్ నిలిచింది.

చైనాలోని చెంగ్డు వేదికగా జరిగిన ప్రపంచ యువజన విలువిద్య క్రీడలో భారత విలుకాడు రిషభ్ యాదవ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో అత్యుత్త మంగా రాణించాడు. భారత్‌కు మొత్తం మూడు పతకాలు దక్కాయి, దక్షిణ కొరియాలోని గ్వాంగ్జు వేదికగా జరిగిన ప్రపంచ విలువిద్య పురుషుల కాంపౌండ్ విభాగంలో భారత్ తొలిసారిగా బంగారు పతకం నెగ్గి సరికొత్త చరిత్ర సృష్టించింది. మిక్సిడ్ విభాగంలో మాత్రం రజతపతకంతో సరిపెట్టు కోవాల్సి వచ్చింది.

కాగా, ధూమ్ ధామ్ టీ-20 ఫార్మాట్లో భారత మెరుపు ఆల్ రౌండర్ హార్థిక్ పాండ్యా, యార్కర్లకింగ్ జస్ ప్రీత్ బుమ్రా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వ్యక్తిగతంగా అరుదైన రికార్డులతో గత ఏడాదిని విజయవంతంగా ముగించగలిగారు.

2026 టీ-20 ప్రపంచకప్ కు సన్నాహకంగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదుమ్యాచ్‌ల సిరీస్‌లో బుమ్రా వంద వికెట్ల మైలురాయిని చేరుకోడం ద్వారా.. క్రికెట్ మూడు విభాగాలలోనూ 100 వికెట్లు సాధించిన భారత తొలి బౌలర్‌గా రికార్డుల్లో చేరాడు.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# అనంతపురం విభాగ్; హిందూ సమ్మేళనాల దృశ్యమాలిక (డిసెంబర్ 2025)




**రాయదుర్గంలో** జరిగిన సమ్మేళనానికి గనిమఠం (ఉరవకొండ) శ్రీశ్రీశ్రీ కరిబసవ రాజేంద్రస్వామి అనుగ్రహభాషణం చేయగా, అఖిల భారత ధర్మజాగరణ సహసంయోజక్ ఏలె శ్యాంకుమార్ ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 3040 మంది పాల్గొన్నారు.




**డి హీరేహాల్** సమ్మేళనంలో అనుగ్రహభాషణం శ్రీశ్రీశ్రీ సిద్ధలింగ శివాచార్య చేయగా, క్షేత్రకార్యవాహ తిప్పేస్వామి ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 1150 మంది ఉపస్థితులైనారు.




**ధర్మవరం** సమ్మేళనంలో శ్రీ దత్తానందగిరి స్వామిజీ, ఇస్కాన్ శ్రీ మాధవదాస స్వామిజీ, హిందూ జాగరణమంచ్ అఖిల భారత సహసంఘటక్ దేవేంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 8400మంది హాజరయ్యారు.




**గుత్తి :** గౌతమపురి ఖండలో జరిగిన హిందూ సమ్మేళనంలో తపోపీఠం పీఠాధీశ్వరి మాతాజీ శ్రీశ్రీ యోగాంబిక (భాగ్యనగర్) ఆశీఃప్రసంగం చేశారు. ముఖ్యఅతిథిగా రాజకీయ విశ్లేషకులు సురేష్‌కొచ్చాటిల్ (భాగ్యనగర్) ముఖ్యవక్తగా విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో 4850 మంది హాజరయ్యారు.

# ‘నిరామయ ఉత్పాదన’ విక్రయ కేంద్రం ప్రారంభం



**భాగ్యనగర్ :** డిసెంబర్ 20న భాగ్యనగర్, మెహదీపట్నంలోని ఖాదీ బోర్డు భవనంలో ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో **‘నిరామయ ఉత్పాదన – ఆయుర్వేద & హెర్బల్ ఉత్పత్తుల కేంద్రం’** ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యులు వి. భాగయ్య, నారాయణమ్మ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధ్యక్షులు పి.సుబ్బారెడ్డి, సినీనిర్మాత ఎ.దయాకర్‌రావు, కార్డియాలజిస్ట్, కేర్ గ్రూప్ హాస్పిటల్స్ డాక్టర్ వి. సూర్యప్రకాశ్‌రావు, విద్యానంద ఎడ్యుకేషన్‌సినీ నిర్మాత బెల్లంకొండ నాగలక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు.





**కామారెడ్డి :** సామాజిక సమరసత వేదిక కామారెడ్డి శాఖ, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కామారెడ్డిలో డిసెంబర్ 21న జరిగిన సంచార జాతుల సమ్మేళనంలో 250 కుటుంబాలకు దుప్పట్లు పంచారు. ఇందులో వేదిక కళావిభాగం అఖిలభారత కన్వీనర్ అప్పాలప్రసాద్, గౌరవాధ్యక్షులు టి. రామచంద్రం, విభాగ్ సహసంయోజక్ బాల్‌రాజ్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు ఏ. రాజేందర్, రోటరీ క్లబ్ కామారెడ్డి అధ్యక్షులు యాచం శంకర్, కార్యదర్శి కృష్ణహరి పాల్గొన్నారు.



**భాగ్యనగర్ :** సంఘశతాబ్దిలో భాగంగా బర్కత్‌పురాభాగ్ యువ కార్యకర్తల శిబిరం డిసెంబర్ 21న భాగ్యనగర్‌లోని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న 248 మంది యువకార్యకర్తలు కాచిగూడ పురవీధుల గుండా పథసంచలన్ చేశారు. తదుపరి జరిగిన సార్వజనికోత్సవంలో దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ ప్రసంగించారు. ఈ శిబిరంలో భాగ్యనగర్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ వేదప్రకాశ్, బర్కత్‌పురా భాగ్ సంఘచాలక్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పామిడిలో హిందూ సమ్మేళనం

**పామిడి**లో జరిగిన హిందూ సమ్మేళనంలో అనుగ్రహభాషణం చేస్తున్న శ్రీశ్రీశ్రీ ఆదిత్యపరాశ్రీ స్వామిజీ. విభాగ్ సద్భావన ప్రముఖ్ కత్తిరామచంద్రారెడ్డి ప్రసంగించారు. 4600 మంది హాజరయ్యారు.

# బాల జాగృతి

## భక్తాగ్రేసరులు



## రవిదాసు

శ్రీరామానందుడి శిష్యగణంలో ప్రముఖుడు గురు రవిదాసు. గురువుతో పాటు అనేక ప్రాంతాలు సంచరించారు. రవిదాసు, రైదాసు, రోహిదాసు, రుహదాసు, రుద్రదాసు లాంటి పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఆయన భక్తుల్లో అనేక మంది నిరక్షరాస్యులు, ఆయన పేరును సరిగా ఉచ్చరించలేకపోవడం, ఉచ్చారణ భేదాలకు ప్రాంతీయ భేదాలు తోడుకావడంతో ఆయన పేరు ఇలా రూపాంతరం చెందింది. చర్మకారవృత్తితో పొట్ట పోసుకుంటూ, సాధుసత్పురుషుల సేవా సాంగత్యాలతో ఆనందం పొందేవాడు. వ్యాపారంలో బేరసారాలు, ధరవరలు, ఇచ్చిపుచ్చుకోవడాలలో ఆయన చూపె ఔదార్యం తండ్రికి నచ్చక దూరంగా ఉంచాడు. అయినా చింతించలేదు. తండ్రి ఇంటి వెనుకభాగంలో చిన్నపాక వేసుకున్నాడు. తన ఆధ్యాత్మిక చింతన ముందు పేదరికం చిన్నబోయింది. ఆ దంపతులు ఉన్నదానితో సంతృప్తి చెందారు. భక్తులు రవిదాసు పేరిట మఠాలు, మందిరాలు నిర్మించారు. ఆయన దర్శనసాంగత్యాల కోసం వచ్చే సాధు సన్యాసులకు రవిదాసు ఇల్లాలు తగురీతిని ఆదరించేది. ఆమె నేటికీ 'లోణాదేవి'గా పూజలు అందుకుంటోంది.

## కథ | అసలైన శిక్షణ



సూర్యగిరి మహారాజు జయంతుడు. యువరాజు దిలీపుడు సీతాపురంలోని గురుకులంలో సకల విద్యలు అభ్యసించాడు. గురుకులం నుంచి కోటకు చేరుకునే మార్గంలో కొంతదూరం వాగులూ, వంకలూ ఉండడం వల్ల యువరాజు కోసం మహారాజు పల్లకి పంపి, దాని ద్వారా వాటిని దాటి రహదారికి చేరిన తరువాత ప్రయాణించడానికి రథాన్ని ఏర్పాటు చేశాడు.

దిలీపుడు ప్రయాణానికి సిద్ధమై గురువు కోసం వేచి చూస్తుండగా, ఆయన భార్య 'మీ గురువు గారు పని మీద బయటకు వెళ్లారు' అని చెప్పింది. ఆమె పాదాలకు నమస్కరించి, పల్లకి ఎక్కాడు దిలీపుడు. కొద్ది దూరం వెళ్లాక దారి పక్కన ఓ ముసలాయన గాయాలతో పడి ఉన్నాడు. 'మా తాతను వైద్యుడి దగరకు తీసుకెళ్లి కాపాడండి' అని వేడుకోసాగాడు ఓ బాలుడు.

యువరాజు పల్లకి దిగి ఆ వ్యక్తి దగ్గరకు వెళ్లి మిగతా భటులను సాయం పట్టమని పల్లకీలో పడుకోబెట్టాడు. తను నడుస్తూ పల్లకీని ముందుకు పోనియ్యమన్నాడు.

'యువరాజా! మీరు ఈ ఎండలో వాగులూ వంకల్లో నడవలేరు' అన్నాడు ఒక భటుడు. 'కాస్త దూరానికే కందిపోనులే' అని నడవసాగాడు దిలీపుడు. కొంచెం దూరం వెళ్లాక అక్కడ సిద్ధంగా ఉన్న రథంలో ముందుగా ముసలి వ్యక్తిని ఎక్కించి తరువాత

## పద్యం

అందముగ నుండు పుష్పాలయందు
సౌరభమ్ము లేమియు లేకున్న వ్యర్థమౌను
క్రియల శూన్యపు మాటలు కేవలమ్ము
ఇంపుగా నుండు వినుటకే యేరికైన

**భావం :** పువ్వులు ఎంత అందంగా ఉన్నా సువాసన లేకుంటే వాటి ఉపయోగం లేదు. క్రియా శూన్యపు మాటలు వినడానికి మాత్రమే ఇంపుగా ఉంటాయి.

## శ్లోకం

భవన్తి నమ్రాస్తరవః ఫలోద్గమైః
నవాంబుభిర్ దూరవిలంబినో ఘనాః
అనుద్ధతా స్సత్పురుషాః సమృద్ధిభిః
స్వభావ ఏవైష పరోపకారిణామ్!!

**భావం :** ఫలాలతో నిండిన చెట్లు వంగి ఉంటాయి. కొత్త నీటిని తీసుకొచ్చే మేఘాలు కిందుగానే సంచరిస్తాయి. సత్పురుషులు సంపదలు వచ్చినప్పుడు గర్వరహితులుగా ఉంటారు. అవి పరోపకార పరాయణుల స్వభావాలు.

## జత పర చండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| జయక్వాడి | రాజస్థాన్ |
| తవా | మహారాష్ట్ర |
| కుందా | ఉత్తరప్రదేశ్ |
| జవాయ్ | తమిళనాడు |
| సింగ్రౌలి | మధ్యప్రదేశ్ |

**సమాధానాలు :** జయక్వాడి–మహారాష్ట్ర, తవా–మధ్యప్రదేశ్, కుందా–తమిళనాడు, జవాయ్–రాజస్థాన్, సింగ్రౌలి–ఉత్తరప్రదేశ్.

నిర్వహణ : నయనశ్రీ

## శాస్త్రవేత్తలు



### ఏఎస్ రావు

భారతదేశ ప్రముఖ అణుశక్తి శాస్త్రవేత్త, ఇంజనీర్. ఏఎస్ రావు పూర్తి పేరు అయ్యగారి సాంబశివరావు. సెప్టెంబర్ 20, 1914న పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో జన్మించారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్. ఎలక్ట్రానిక్స్, అణుశాస్త్ర రంగాలలో విశేష కృషి చేశారు. ఈసీఐఎల్‌ను స్థాపించి, భారతదేశంలో శాస్త్ర సాంకేతిక రంగంలో స్వావలంబనకు కృషి చేశారు. ఈయన సేవలకుగానూ భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

## జనరల్ నాలెడ్జ్

1. 1942లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ 'హింద్ ఫౌజ్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
2. భారత సుప్రీంకోర్టు మొట్టమొదటి ప్రధాన న్యాయమూర్తి?
3. 'తమాషా' అనేది ఏ రాష్ట్రానికి చెందిన జానపద నాటకం?

సమాధానాలు : 1. సింగపూర్, 2. హెచ్.జె. కానియా, 3. మహారాష్ట్ర.



దిలీపుడు ఎక్కాడు.

'మన కోట కంటే ముందే వైద్యశాల వస్తుంది కదా. ఈ తాతకు చికిత్స చేయిద్దాం' అని యువరాజు రథసారథికి చెప్పాడు.

వైద్యశాలకు చేరుకోగానే ఆ ముసలి వ్యక్తి తన మారువేషం తొలగించాడు. దిలీపుడు నివ్వెరపోయి... 'గురువుగారూ మీరా?' అన్నాడు ఆశ్చర్యంగా...

'అవును. నిన్ను పరీక్షించడానికే నేను ఈ నాటకం ఆడాను. పాలకులకు పల్లకీ ఎక్కే అర్హతే కాదు దాన్ని మోసే సుగుణమూ ఉండాలి. నువ్వు గురుకులంలో నేర్చుకున్న విద్య సార్థకమైంది' అన్నాడు గురువు చిరునవ్వుతో.

'మీరు నేర్పిన మంచి విషయాలు ఎప్పటికీ మరువను గురుదేవా!' అంటూ ఆయన ఆశీస్సులు అందుకున్నాడు దిలీపుడు. ★

## మెదడుకు మేత

పాడిందే పాడినా చిన్న పాప కాదు, ఎక్కడి పండ్లను తిన్నా దొంగ కాదు.. ఏమిటది?

జవాబు : రామచిలుక

## మంచిమాట

మంచి పని చేసేటప్పుడు ఎవరు ఏమనుకుంటారోనన్న ఆలోచన అవసరం లేదు






# వారఫలాలు 29 డిసెంబర్ - 4 జనవరి 2026



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

చిన్ననాటి స్నేహితులను కలుసుకుని కష్టసుఖాలు విచారిస్తారు. ఆస్తుల వివాదాల నుంచి కాస్త గట్టెక్కుతారు. వాహనాలు, భూముల కొనుగోలు యత్నాలు సానుకూలం. ఉద్యోగులకు ముఖ్య సమాచారం అందుతుంది. పారిశ్రామికవర్గాలకు దీర్ఘకాలిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. కళాకారులు, పరిశోధకులకు యత్నాలు 29,30 తేదీల్లో బంధు విరోధాలు. శారీరక రుగ్మతలు. శివాష్టకం పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

సమాజంలో ప్రత్యేక గౌరవం పొందుతారు. నూతన ఉద్యోగయోగం. బంధువుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారులకు క్రమేపీ లాభాలు. ఉద్యోగులకు మార్పులు ఉత్సాహాన్నిస్తాయి. కళాకారులకు కాస్త అనుకూల సమయం. రచయితలు, పరిశోధకులకు ఆహ్వానాలు అందుతాయి. 31,జనవరి 1 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. పంచముఖ ఆంజనేయ స్తోత్రాలు పఠించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహన సౌఖ్యం. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో సమకూరతాయి. ఉద్యోగులకు ఊహించని పదోన్నతులు దక్కవచ్చు. రాజకీయవర్గాలకు అవకాశాలు దగ్గరకు వస్తాయి. క్రీడాకారులు, కళాకారులకు విశేషంగా కలసి వస్తుంది. జనవరి 3,4 తేదీల్లో సోదరులతో వివాదాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. విద్యార్థులు ఫలితాలు కొంత ఊరట. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. సమాజంలో ప్రత్యేక గుర్తింపు. వ్యాపారులకు లాభాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగులకు సమస్యలు తీరతాయి. రాజకీయవర్గాలకు ఆహ్వానాలు. క్రీడాకారులు, పరిశోధకులు కొత్త ఆశలతో ముందడుగు. జనవరి 2,3 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సేవా కార్యక్రమాలలో భాగస్వాములవుతారు. వ్యాపారులు కొత్త పెట్టుబడులు అందుకుంటారు, లాభాలు అందుతాయి. రాజకీయ వేత్తలకు ఊహించని అవకాశాలు. రచయితలు, క్రీడా కారుల అంచనాలు కొంత ఫలిస్తాయి. 30,31 తేదీల్లో ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. స్నేహితులతో తగాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

గృహ నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. ఆలోచనలు కార్యరూపం. పరిచయాలు విస్తృత మవుతాయి. వ్యాపారులకు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు సమస్యలు తీరతాయి. కళాకారులు, పారిశ్రామిక వేత్తలకు మరింత ప్రగతి. సాంకేతిక వర్గాల వారికి నూతనోత్సాహం. 31, జనవరి 1 తేదీల్లో సోదరులతో వివాదాలు. ఆరోగ్యసమస్యలు. కాలభైరవాష్టకం పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఇంటిలో సంతోషకరంగా గడుపుతారు. శత్రువులు సైతం స్నేహితులుగా మారతారు. భూములు, భవనాలు కొనుగోలులో అవాంతరాలు తొలగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి. పరిస్థితులు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు ఒడిదుడుకుల నుంచి విముక్తి. రాజకీయ వేత్తలు, కళాకారులు, రచయితలకు విశేష ఆదరణ. జనవరి 2,3 తేదీల్లో అనారోగ్యం. స్నేహితులతో వివాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం. విద్యార్థులకు ఆశ్చర్యకర ఫలితాలు కనిపిస్తాయి. వ్యాపారులకు ఒత్తిడులు తొలగుతాయి. ఉద్యోగులకు శ్రమ పడ్డా ఫలితం ఉంటుంది. రాజకీయవేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. రచయితలు, క్రీడా కారులకు ఊహించని ప్రగతి కనిపిస్తుంది. 29,30 తేదీల్లో ఆరోగ్యసమస్యలు. బంధువులతో వివాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

రాబడి మరింత పెరిగి ఉత్సాహాన్నిస్తుంది. కుటుంబ సమస్యలు తీరతాయి. శుభకార్యాల రీత్యా ఖర్చులు. నిరుద్యోగులకు ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. ఉద్యోగులకు క్లిష్ట పరిస్థితుల నుంచి ఉపశమనం. రాజకీయవేత్తలు, కళాకారులకు ఊహించని ప్రగతి. రచయితలు, క్రీడాకారులకు అంచనాలు నిజమవుతాయి. 30,31 తేదీల్లో అనారోగ్యం. శివాష్టకం పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

పలుకుబడి కలిగిన వ్యక్తులు పరిగ్డీ యమై సహకరిస్తారు. వ్యాపారులకు మరింత ఉత్సాహంతో సాగుతారు. పెట్టుబడులకు ఢోకా ఉండదు. ఉద్యోగులకు పనిభారం నుంచి విముక్తి. పారిశ్రామికవర్గాలకు మరింత అనుకూలత ఉంటుంది. పరిశోధకులు, క్రీడాకారులకు ఆశాజనకమైన కాలం. జనవరి 1,2 తేదీల్లో వృథాఖర్చులు. ఆరోగ్యభంగం. విష్ణుసహస్ర నామ పారాయణ చేయండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలలో ప్రతి ష్టంభన. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి స్నేహి తులను కలుసుకుంటారు. వ్యాపారులకు కొంత సామాన్యంగా ఉంటుంది. రాజకీయవర్గాలకు కొద్దిపాటి చికాకులు. రచయితలు, క్రీడాకారులకు గందరగోళంగా ఉంటుంది. 31, జనవరి 1 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. గణేశాష్టకం పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

అనుకున్న ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల యత్నాలలో కొంత పురోగతి కనిపిస్తుంది. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు సమస్యలు తీరి ఉపశమనం లభిస్తుంది. పారిశ్రామికవర్గాలకు శ్రమ ఫలిస్తుంది. రచయితలు, కళాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. జనవరి 3,4 తేదీలో ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి. ★

# పదరసం-544

### ఆధారాలు

**అడ్డం**

1. కిరీటం (3)
4. పనాజీ రాజధానిగా గల రాష్ట్రం (2)
6. 'డామిట్ కథ అడ్డం తిరిగింది'అన్న పాత్ర (3)
8. ముక్క, తునక (3)
9. భర్త తమ్ముడు తడబడ్డాడు (3)
11. సైన్యం (2)
12. చిన్నపాటి చినుకులు (3)
14. నల్లతామర (4)
17. అల, కెరటం లాంటిది (3)
19. మది, మనసు (3)
22. మహాభారతానికి మరో పేరు (2)
23. అధోలోకం (3)
25. కనుక, అడవి (2)
26. విగ్రహం, బొమ్మ (3)
27. రథం (2)
28. కిరణం.. కాంతి (2)
29. విధాలు... (3)
31. విరామం, వెసులుబాటు (3)
33. విరటుని కొలువలో భీముడి పేరు (4)
34. సహనం (2)

**నిలువు**

2. దర్భ (2)
3. నాణేల ముద్రణాలయం (4)
5. శ్రీమహావిష్ణువు ఐదో అవతారం (3)
6. నగరాజ పుత్రిక (3)
7. అనుమానాలు (3)
10. శ్రీనివాసుడిని చేరదీసిన తల్లి (5)
13. జెట్టీ.. బలవంతుడు.. తిరగబడ్డాడు (2)
15. మర.. మిషన్ (2)
16. రాయిగా మారిన నాతి... (3)
18. శరీరం (2)
20. జటాయువు సోదరుడు (3)
21. సర్పం (2)
22. సంక్రాంతి వచ్చే ఆంగ్లమాసం (4)
24. కలువలే (4)
26. తెలుగు సంవత్సరాల్లో మొదటిది (3)
27. వృశ్చికం (2)
30. మరుభూమి, అడవి (2)
31. తెలుగు జడ్జిమెంట్ (2)
32. ఈ యుగం (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | ■ | 4 | 5 | ■ | 6 | | 7 |
| ■ | 8 | | | ■ | 9 | | | ■ | |
| 10 | ■ | | ■ | 11 | | ■ | 12 | 13 | |
| 14 | | | 15 | ■ | ■ | 16 | ■ | | ■ |
| | ■ | ■ | | ■ | 17 | | | ■ | 18 |
| 19 | | 20 | ■ | 21 | ■ | | ■ | 22 | |
| | ■ | 23 | 24 | | ■ | ■ | 25 | | ■ |
| ■ | 26 | | | ■ | 27 | | ■ | | ■ |
| 28 | | ■ | 29 | 30 | | ■ | 31 | | 32 |
| ■ | 33 | | | | ■ | 34 | | ■ | |

## పదరసం - 543 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 న | రేం | 2 ద్ర | ■ | 3 సా | ధ | 4 న | ■ | 5 ఆ | న |
| యా | ■ | 6 ష్ట | 7 అ | మి | ■ | 8 గ | గ | నం | ■ |
| 9 గ | డి | ■ | ర | ■ | 10 మీ | రా | ■ | 11 ద | 12 స్త్రం |
| రా | ■ | 13 చే | ■ | 14 కూ | న | లు | ■ | 15 ని | అ |
| ■ | 16 న | వ | 17 ల | ■ | మే | ■ | 18 మా | ల | ■ |
| 19 ధ | ర్మం | ■ | 20 త | మా | షా | లు | ■ | యం | ■ |
| ను | ■ | 21 పా | లు | ■ | లు | ■ | 22 సౌ | ■ | 23 మె |
| 24 ర్మా | 25 బ | ■ | ■ | 26 ప | ■ | 27 అ | గ | 28 చా | ట్లు |
| 29 సం | ద | డి | ■ | 30 రు | 31 జ | ■ | 32 సు | మం | ■ |
| ■ | రి | ■ | 33 ది | గు | మ | తి | ■ | 34 తి | ట్టు |

జేమ్స్ కేమరాన్ సినిమా అనగానే ఇండియన్ ఫీచర్ ఫిలిమ్స్‌లో లాగా సెంటిమెంట్ దట్టంగా ఉంటుందని అందరికీ తెలుసు. జేమ్స్ 'అవతార్' సిరీస్ చూస్తే మన పురాణగాథల స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తుంది. 'అవతార్' సిరీస్ లోని ప్రధాన పాత్రలకు నీలం రంగు ఉండడం, తోకలు ఉండడం చూస్తే మన 'రామాయణం' గుర్తుకు రాకమానదు. ఇప్పటికే రెండుసార్లు జనం ముందు నిలచిన 'అవతార్' మూడో భాగం 'ఫైర్ అండ్ యాష్'తో డిసెంబర్ 19వ తేదీ ప్రేక్షకులను పలకరించింది. భారీ అంచనాలతో రూపొందిన ఈ చిత్రం తెలుగుతో పాటు మరికొన్ని భారతీయ భాషల్లోనూ విడుదలయింది.



# భావోద్వేగాలతో సాగే 'అవతార్ : ఫైర్ అండ్ యాష్'

'అవతార్' ఫ్రాంచైజ్‌లో మూడో భాగంగా వచ్చిన తాజా చిత్రం అర్థం కావాలంటే తప్పకుండా ఇంతకు ముందు వచ్చిన రెండుభాగాల 'అవతార్' చూసి తీరాలి. లేదంటే 'అవతార్–3'లోని విజువల్ బ్యూటీ తప్ప మరేది ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. అలా 'విజువల్ వండర్' అనిపించుకుంటుంది 'అవతార్–3'. మొదటి రెండు భాగాలతో పోలిస్తే ఈ మూడో చిత్రంలోని టెక్నికల్ ఎఫెక్ట్స్ భారీగా ఉన్నాయి. కథ విషయానికి వస్తే – రెండో భాగంలో పండోరా వాసులపై భూలోకవాసులు దాడిచేయగా కథా నాయకుడు కన్నకొడుకును కోల్పోతాడు. విచిత్రంగా భూలోకంలోని ఓ అబ్బాయి హీరో కుటుంబంలో చేరతాడు. అతడిని హీరో ఆదరించినా, అతని భార్య తమ జాతిలో కలవడానికి అంగీకరించదు. అయినా, ఆమె పిల్లలు ఆ అబ్బాయితో ఎంతో సఖ్యంగా ఉంటారు. ఆ బాబు కోసం కన్నతండ్రి, పెంచిన తండ్రి మధ్య పోరు సాగుతుంది. ఆ అబ్బాయికి పండోరావాసులలాగా రంగు, రూపు మారక పోయినా, మనిషిలాగే ఉంటూ అక్కడి శక్తులు పొందుతాడు. అవి ఎలా వచ్చాయో ప్రయోగం చేసి తెలుసుకుంటారు మానవులు. ఆ ప్రయోగాలు ఫలిస్తే తమ జాతి అంతరించి పోతుందని హీరో కూడా భావిస్తాడు. అందువల్ల ఆ అబ్బాయిని హీరోనే మట్టుపెట్టాలని చూస్తాడు. అయితే ఒకానొక దశలో హీరో ప్రాణాలను ఆ అబ్బాయి రక్షించి ఉంటాడు. అందువల్ల హీరో భార్య ఆ అబ్బాయిని చంపొద్దని చెబుతుంది.ఆ తరువాత ఆ బాబు ఏమయ్యాడు? చివరకు కన్నతండ్రి, పెంపుడు తండ్రిలో ఎవరిని చేరాడు? అన్న అంశాలతో కథ సాగుతుంది.

'అవతార్–3' సినిమాలో మొదటి రెండు భాగాల కన్నా మిన్నగా ఇందులో భారతీయ పురాణాలు కనిపిస్తాయి. భారతీయుల మనోభావాలకు దగ్గరుండేలా కథ సాగుతుంది. అయితే తొలి రెండు భాగాల కథతో పరిచయం లేకపోతే ఈ సినిమా చూసినా, ఇందులోని కథ ఏ మాత్రం అర్థం కాకపోగా, ఎంత విజువల్ వండర్‌గా తెరకెక్కినా, ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. ఇక సినిమా నిడివి కూడా పెద్దగా ఉంది. మూడు గంటల 17 నిమిషాల పాటు నడుస్తుంది. అది ప్రేక్షకుడి సహనాన్ని పరీక్షించక మానదు. పైగా ఓ జనరేషన్ గ్యాప్‌తో వచ్చిన సినిమా కాబట్టి, ఇందులోని పాత్రల వింత ఆకారాలు నవతరానికి అంతగా నచ్చడం లేదనీ చెప్పవచ్చు. ఏది ఏమైనా 'అవతార్' మొదటి భాగంలాగా రెండో భాగం 'ద వే ఆఫ్ వాటర్' కూడా సామాన్య ప్రేక్షకుడిని అంతగా ఆకట్టుకోలేక పోయింది. అయినా మొదటి భాగం క్రేజ్‌తో రెండో భాగం బ్లాక్‌బస్టర్‌గా నిలచింది. కానీ, ఈ సారి ఆ మ్యాజిక్ జరుగుతుందో లేదో అనిపిస్తోంది. జేమ్స్ కేమరాన్ ఈ సినిమా హిట్ కాకుంటే తరువాతి భాగాలు రిలీజ్ చేయనని అన్నారు. ముందు అనుకున్న ప్రకారం 'అవతార్' నాలుగు, ఐదు భాగాలు డిసెంబర్ 21, 2029, డిసెంబర్ 19, 2031న విడుదల కావాల్సి ఉంది.

### గట్టి పోటీ ఇస్తున్న 'దురంధర్'

'అవతార్'కు తాము పోటీ ఇవ్వలేమని భావించిన భారతీయ సినిమా దర్శక నిర్మాతలు 19వ తేదీ వేరే ఏ పెద్ద చిత్రమూ విడుదల కాకుండా జాగ్రత్త పడ్డారు. 'అవతార్ 3'కి గ్రాండ్‌గా రెడ్ కార్పెట్ పరిచారు. ఇది ఇంగ్లీష్‌తో పాటు భారత్‌లో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. అయితే ఉత్తరాదిన మాత్రం 'అవతార్'కు 'దురంధర్' గట్టి పోటీ ఇస్తోంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ సినిమా మూడోవారంలోనూ తన సత్తా చాటుతోంది. ఇంతవరకూ రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన 'దురంధర్' ఇప్పుడు అగ్రస్థానం కోసం ఉరకలెత్తుతోంది. అంతేకాదు... త్వరలోనే 'దీనిని ఇతర భాషల్లో అనువదించి విడుదల రిలీజ్ చేయ బోతున్నారు. మన దేశాన్ని అస్థిర పర్చాలనుకున్న పాక్ కుట్రలను సీక్రెట్ ఏజెంట్స్ ప్రాణాలకు తెగించి ఎలా భగ్నం చేశారన్న అంశాలను 'ఉరి: ద సర్జికల్ స్ట్రైక్' ఫేమ్ ఆదిత్య ధర్ గొప్పగా తెరకెక్కించాడు. మితిమీరిన హింస ఉన్న కారణంగా 'ఎ' సర్టిఫికెట్ పొందిన 'దురంధర్'ను విడుదల కాగానే కొందరు విమర్శించారు కానీ అందులోని కథను అర్థం చేసుకుని ఇప్పుడు సాధారణ ప్రేక్షకులు ఆకాశానికి ఎత్తుతున్నారు. దాంతో ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ యేడాది హయ్యెస్ట్ గ్రాస్‌ను వసూలు చేసిన 'కాంతార: చాప్టర్ 1' రికార్డులను 'దురంధర్' మరో పది, పన్నెండు రోజుల్లో దాటేస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'దురంధర్'కు లభిస్తున్న ఆదరణను తట్టుకోలేక ఇప్పటికే కొందరు వామపక్ష వాదులు సన్నాయి నొక్కులు నొక్కడం ప్రారంభించారు. చిత్రం ఏమంటే... వారి కువిమర్శల కారణంగా 'దురంధర్' వసూళ్లు మరింత పెరుగుతున్నాయి!

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి | మెచ్చండి | పంచండి

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 11

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.80/-




వెల : ₹.100/-




వెల : ₹.400/-




వెల : ₹.300/-




వెల : ₹.151/-




వెల : ₹.800/900 : 999/1200




వెల : ₹.100/-




వెల : ₹.150/-



వెల : ₹.99/-




వెల:₹.1598/- సెట్




వెల:₹.449/-




వెల :₹.450/-




వెల : ₹.400/-




వెల : ₹.145/-

**పై పుస్తకములకు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 314, 315 స్టాల్లను సందర్శించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01